fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 55 | విజయవాడ, ఆదివారం 25 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు + స్నేహ వెల : 5.00

ఉత్పత్తి కేంద్రంగా రాష్ట్రం

విశాఖ సిఐఐ సదస్సు ప్రారంభంలో ఉప రాష్ట్రపతి వెంకయ్య

2018లో 7.7 శాతం వృద్ధి రేటు దిశగా దేశ ఆర్థిక వ్యవస్థ



విశాఖ సిఐఐ సదస్సులో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

దేశ వ్యాప్తంగా సరుకుల ఉత్పత్తి రంగానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఆ రంగంలో రాష్ట్రం నాయకత్వ స్థానానికి ఎదగాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. విశాఖలో కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియా (సిఐఐ) సదస్సు శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సదస్సుకు 54 దేశాల నుంచి 2,500 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొని ప్రసంగించారు. సరుకుల ఉత్పత్తి పెరిగితే మిగతా 9లో



శ్రీకాకుళం జిల్లా భావనపాడు వద్ద నౌకాశ్రయం ఏర్పాటుకు విశాఖలోని సిఐఐ సదస్సులో ఆదాని గ్రూపుతో ఎంఒయు కుదుర్చుకుంటున్న సిఎం చంద్రబాబు

తొలిరోజు 77 ఎంఒయులు


పెట్టుబడులు రూ.31,546 కోట్లు

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ సిఐఐ భాగస్వామ్య సదస్సులో తొలి ఎంఒయు ఆటోమోటివ్ అండ్ ఆటో కాంపోనెంట్ ఇండస్ట్రీస్‌పై ఈసిఎంఎతో ఎపి ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. తొలిరోజు శనివారం 77 ఎంఒయులు, రూ.31,546 కోట్ల పెట్టుబడులతో ఒప్పందాలు కుదిరాయి. మూడురోజుల సదస్సుల్లో సుమారు లక్షల కోట్ల విలువైన ఎంఒయులు మిగతా 9లో

ఓరియంటల్ బ్యాంక్‌కు మరో నగల వ్యాపారి కుచ్చుటోపీ

- రూ.389.85 కోట్ల మేర రుణాల ఎగవేత
- గత ఏడాదే విదేశాలకు చెక్కేసిన నగల వ్యాపారి
- ఫిర్యాదు చేసిన ఆరునెలలకు సిబిఐ కేసు నమోదు



న్యూఢిల్లీ : వజ్రాల వ్యాపారి నిరవ్ మోడి పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను మోసగించిన కేసు ఒక కొలిక్కి రాకముందే మరో వజ్రాల నగల ఎగుమతి కంపెనీ ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబిసి) ను మోసగించిన ఉదంతం వెలుగు చూసింది. దీనికి సంబంధించి సిబిఐ శుక్రవారం కేసు నమోదు చేసింది. ఓబిసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వజ్రాల నగల ఎగుమతి కంపెనీపైనా, దాని డైరెక్టర్లపైన కేసు నమోదు చేసింది. కరోల్‌బాగ్‌కు చెందిన ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే వజ్రాల నగల ఎగుమతి కంపెనీ రూ.389.85 కోట్ల మోసానికి పాల్పడిందని ఆ బ్యాంకు ఫిర్యాదు చేసింది. ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ మిగతా 8లో

మోడీ 'జన్‌ధన్ లూట్ యోజన'లో మరో స్కామ్ : రాహుల్ 8



అరుణ కాంస్య కాంతులు

తెలుగు జిమ్నాస్ట్‌కు కాంస్య పతకం

జిమ్నాస్టిక్స్ ప్రపంచ కప్‌లో సంచలనం

12

విలన్లు.. హీరోలు... వాళ్లే

అతనో రాష్ట్ర మంత్రి... రాష్ట్రంలో అల్లర్లు జరుగుతుంటే ప్రజలు భయాందోళనలకు గురవుతుంటారు. చిన్నచిన్న వ్యాపారస్తులు బేజారెత్తిపోతారు. ఈ విషయంపై మంత్రివర్యుని మీడియా ప్రశ్నిస్తే ఈ అల్లర్లకు కారకులైన వారిని పట్టుకుని తీరుతాం అంటాడు. కట్ చేస్తే.. చివరిలో ఆ మంత్రే ఆ అల్లర్లకు మూల కారకుడని తెలుస్తుంది. ఇది ఓ సినిమా కథ. ఈ నిజాన్ని ఛేదించడానికి హీరో ఏం చేశాడన్నది తెరపై చూస్తే కానీ అర్థం కాదు. అచ్చు ఇలాంటి కథే సినిమా ఇండస్ట్రీలో ఇప్పుడు నడుస్తోంది. ఒక పక్క హీరోలుగా, మరో పక్క విలన్లుగా కొద్దిమంది నిర్మాతలు నటిస్తూ...నడిపిస్తున్నారు.

- పూర్తి కథనం సినిమా పేజీలో....

సీమ న్యాయవాదులతో చర్చించండి..

సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు లేఖ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు కోసం ఆందోళన చేస్తున్న న్యాయవాదులతో సంప్రదింపులు జరపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శనివారం ఆయన లేఖ రాశారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ నెల రోజులుగా న్యాయవాదులంతా ఐక్యంగా ఆందోళన చేస్తున్నారని వివరించారు. వారికి మద్దతుగా యువతీ, యువకులు, వివిధ ప్రజా సంఘాలు, ప్రజలు ఆందోళనల్లో పాల్గొంటున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించకుండా ఈనెల 22న ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా రాయలసీమ జిల్లాలన్నింటిల్లోనూ న్యాయవాదులు, ప్రజాసంఘాలు, వామపక్షాల నాయకులను అరెస్టులు చేయడం ఏమాత్రమూ సమంజసం కాదని పేర్కొన్నారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆందోళన చేస్తున్న న్యాయవాదులతో వెంటనే చర్చలు జరిపి సమస్య పరిష్కరించాలని కోరారు.



బ్యాంకు ఉద్యోగుల అఖిలభారత మహాసభ సందర్భంగా విజయవాడలో నిర్వహించిన భారీ ప్రదర్శన - వార్త 3లో..

తవ్వేకొద్దీ కబ్జాలు

- బోండా అనుచరులే పాత్రధారులని ఫిర్యాదులు
- జెసికి విన్నవించుకున్న బాధితులు
- కబ్జా భూముల విలువ రూ.50 కోట్ల పైమాటే



ఎంఎల్ఎ బొండా ఉమా పక్కన ఉన్న మాగంటి బాబు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ ప్రతినిధి

విజయవాడ నగరంలో ఎమ్మెల్యే బోండా అనుచరులు కబ్జా మరొకటి వెలుగులోకి వచ్చింది. పెనమలూరులో ఇద్దరు అక్కా చెల్లెళ్లకు చెందిన 80 సెంట్ల భూమిలో బోండా అనుచరులు పాగా వేశారు. దీని విలువ సుమారు రూ. నాలుగు కోట్లు ఉంటుంది. ఇటీవల స్వాతంత్ర్య సమర యోధులకు సంబంధించిన భూమిని కబ్జా చేసిన విషయం మరువక ముందే మరో రెండు భూ కబ్జాలకు వెలుగులోకి వచ్చాయి. వీటిల్లోనూ ఎమ్మెల్యే బోండా మిగతా 9లో

ప్రసిద్ధ కథకుడు మునిపల్లె రాజు కన్నుమూత



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో : తెలుగు కథను సుసం పన్నం చేసిన ప్రసిద్ధ కథకుడు మునిపల్లె రాజు (93) ఇకలేరు. ఆయన రచయిత, కవి, వ్యాసకారుడు. హైదరాబాద్‌లోని ఏఎస్‌రావు నగర్‌లోని తన స్వగృహంలో ఆయన కన్నుమూశారు. ఆయన స్వగ్రామం గుంటూరు జిల్లా పొన్నూరు మండలం, మునిపల్లె. అయితే ఆయన కాకమాను మిగతా 9లో

ఇద్దరు రైతుల ఆత్మహత్య

ప్రజాశక్తి-గంపలగూడెం / కొమరాడ



రోదిస్తున్న వెంకయ్య కుంటుంబ సభ్యులు

రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలు ఇద్దరు రైతులను బలిగొన్నాయి. కృష్ణా, విజయనగరం జిల్లాలకు చెందిన ఇద్దరు రైతులు శనివారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో ఒకరు కౌలు రైతు. వివరాలిలా ఉన్నాయి. కృష్ణాజిల్లా గంపలగూడెం మండలం పెనుగొలనులో నకిలీ మిరపనారు నర్సరీ యజమానుల నుంచి పరిహారం రాకపోవడం, అప్పు ఇచ్చిన రుణదాతలు అప్పు చెల్లించాలని ఒత్తిడి చేయడం, కుమార్తె వివాహం నిశ్చయమవ్వడంతో కౌలు రైతు పంది వెంకయ్య (41) మనస్థాపానికి గురై పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని సిపిఎం పశ్చిమకృష్ణా కార్యదర్శి డి.వి.కృష్ణ, ఎపి కౌలు రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగబోయిన రంగారావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై. కేశవరావు, రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకయ్యది ప్రభుత్వ హత్యేనని, ఇప్పటికైనా మిగతా 9లో

ఎ కొండూరులో డయాలసిస్ సెంటర్

ప్రజాశక్తి-ఎ.కొండూరు

కృష్ణాజిల్లా ఎ కొండూరు, గంపలగూడెం మండలాల్లోని కిడ్నీ బాధితుల కోసం ఎ కొండూరులో డయాలసిస్ సెంటర్‌ను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ఈ ప్రాంత ప్రజలకు కాస్త ఊరట లభించింది. స్థానికులు కిడ్నీ జబ్బుల బారిన పడి పడుతున్న ఇబ్బందులను గత వారం రోజులుగా ప్రజాశక్తిలో వస్తున్న వార్తలకు అధికారులు స్పందించారు. కిడ్నీబాధితులను ఆదుకోవటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చెప్పారు. ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం పంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్‌లో మిగతా 9లో



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం పశ్చిమ కృష్ణా జిల్లా కార్యదర్శి డివి కృష్ణ



కిడ్నీ బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీకాంతం

ప్రజాశక్తి కథనాలతో అధికారుల పరుగులు

కిడ్నీ బాధితుల సమస్యలపై ఏడు రోజులుగా 'ప్రజాశక్తి'లో వస్తున్న వరుస కథనాలకు రాష్ట్రప్రభుత్వం, అధికార యంత్రాంగం ఎట్టకేలకు స్పందించింది. ప్రజాశక్తి యంత్రాంగం ప్రతిరోజూ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశోధించింది. అక్కడ ఉన్న దుర్భర పరిస్థితులను ఏరోజుకారోజు వివిధ రూపాల్లో కథనాలుగా ఇచ్చింది. ఈ కథనాలకు స్పందించిన జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం స్పందించారు. ఎ.కొండూరు మండలంలోని గిరిజన తండాల్లో ఆగమేఘాలపై శనివారం పర్యటించారు. మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కూడా పర్యటించక తప్పని పరిస్థితి ఏర్పడింది. డిఎంఅండ్‌హెచ్ఒ ఆధ్వర్యంలో వైద్యబృందాలు తండాల్లో పర్యటించి వైద్యసేవలు అందించాయి.

నేడు తెనాలిలో జిఎస్టీ రేంజ్ ఆఫీస్ ప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా తెనాలిలో జిఎస్టీ రేంజ్ కార్యాలయాన్ని సెంట్రల్ టాక్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ కమిషనర్ ఎమ్ శ్రీహరిరావు ఆదివారం ప్రారంభించనున్నారు. ఒక గజిటెడ్ ర్యాంక్ సూపరింటెండెంట్‌తో పాటు ఇన్స్‌పెక్టర్లు ఈ కార్యాలయంలో విధులు నిర్వహించనున్నారు. జిఎస్టీ చెల్లింపుదారులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా సేవలందించాలనే లక్ష్యంతోనే అన్ని జిల్లాలకు కార్యాలయాలను విస్తరిస్తున్నట్లు శ్రీహరిరావు తెలిపారు. గుంటూరు కమిషనరేట్ కింద గుంటూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో ఐదు డివిజన్ ఆఫీసులు, 36 రేంజ్ కార్యాలయాలు పనిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



సదస్సు
విశాఖలోని విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సిఐఐ సదస్సులో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ

సిఐఐ సదస్సులు ఎవరి కోసం?

ప్రజా సంఘాల సదస్సులో ఇఎఎస్ శర్మ

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడుల భాగస్వామ్య (సిఐఐ) సదస్సులు ఎవరి కోసం అని విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ ప్రశ్నించారు. ఈ సదస్సుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని విమర్శించారు. ప్రజా సంఘాల ఆధ్వర్యాన విశాఖలోని విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం 'పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులు ఎవరి కోసం- ఎందుకోసం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ ప్రజలను నట్టేట ముంచుతోందన్నారు. పెట్టుబడిదారులను విశాఖ తీసుకొచ్చి ప్రభుత్వ భూములను కారుచౌకగా కట్టబెడుతోందని విమర్శించారు. పెట్టుబడుల సదస్సుల ద్వారా వచ్చే లాభం కంటే ఈ సదస్సుల ఏర్పాట్లకు అయ్యే ఖర్చే ఎక్కువగా ఉందని ఆరోపించారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా తెలుగుదేశం ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందన్నారు. వ్యవసాయ భూములనూ పేదల నుండి లాగేసుకుని ఆహార భద్రతను పాటించడం లేదన్నారు. పంట భూములు లేకపోతే కచ్చితంగా ఆహార కొరత ఏర్పడుతుందని చెప్పారు. దీనిపై ఇప్పటికే తాము రాష్ట్రపతికి విన్నవించినట్లు తెలిపారు. నిరుపేదలు ఉండే భూములను సైతం ల్యాండ్ పూలింగ్ పేరుతో బలవంతంగా లాక్కుంటున్నారని చెప్పారు. పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ, పెట్టుబడుల సదస్సుల నిర్వహణ ద్వారా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు సి.భాస్కరరావు, రఘురామ్, టి.ప్రకాష్‌రావు, రాణిశర్మ తదితరులు పాల్గొన్నారు.



పొడి వాతావరణమే..

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలోని కోస్తా, రాయలసీమల్లో మరో నాలుగురోజుల పాటు పొడి వాతావరణమే కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ శాఖ శనివారం ప్రకటించింది. నైరుతి బంగాళా ఖాతానికి ఆనుకుని హిందూ మహాసముద్రంపై భూమధ్య రేఖ వద్ద, ఆగ్నేయ అరేబియా సముద్రంలోని లక్ష్యద్వీప్ నుండి దక్షిణ మహారాష్ట్ర తీరం వరకు రెండు ద్రోణులు కొనసాగుతున్నట్లు భారత వాతావరణ శాఖ పేర్కొంది. మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో దక్షిణ శ్రీలంక తీరానికి ఆనుకుని ఆవర్తనం ఏర్పడినట్లు తెలిపింది. పశ్చిమ ఆటంకాల ప్రభావంతో చలి తీవ్రత కొనసాగుతోందని వాతవరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. పగలు ఎండలు ప్రభావం చూపిస్తున్నప్పటికీ ఉత్తరాదిన చలి గాలుల ప్రభావంతో రాత్రి పూట చలి తీవ్రత కొనసాగుతోందని అభిప్రాయపడుతున్నారు.

ప్రజ్ఞ

1. శతకోటీశ్వర్ల సంపద మొత్తం కలిపితే భారత జీడీపీలో ఎంతకు చేరిందని ఓక్స్‌ఫామ్ ఇండియా తెలిపింది.
2. ప్రపంచ అవినీతి సూచీ 2017లో భారత్ ర్యాంకు ఎంత?
3. ప్రపంచ అవినీతి సూచీ 2017 ప్రకారం మొదటి రెండు స్థానాల్లో నిలిచిన దేశాలు?
4. భారత్‌లో కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడోకి ఇచ్చే విందుకు ఏ ఉగ్రవాదికి ఆహ్వానం అందడంతో వివాదాస్పదమైంది?
5. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నేషనల్ కాడెట్ కార్ప్స్ నూతన డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా ఎవరు నియామకం అయ్యారు?

సమాధానాలు 7లో

రజకుల రక్షణకు చట్టం తేవాలి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రజకుల కోసం సామాజిక రక్షణ చట్టం చేయాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు భాస్కరయ్య, సి గురునాథ్‌లు పేర్కొన్నారు. విజయవాడలోని సంఘ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో నిరవధిక దీక్షల పోస్టరును ఆవిష్కరించారు. ధర్నా చౌక్‌లో మార్చి 10, 11, 12 తేదీల్లో 72 గంటల పాటు నిరవధిక దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో రజకుల సంక్షేమానికి వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సహాయ కార్యదర్శి కె శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కాటూరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

లెక్క చెప్పని ఖర్చు 3,300 కోట్లు

- రాష్ట్రం నుంచి యుసిలు వెళ్లక నిలిపేసిన నిధులు 500 కోట్లు
- ఏళ్ల తరబడి నిర్లక్ష్యం
- యుసిలు పంపని నిధుల్లో రాజధాని, స్మార్ట్ సిటీలవే అధికం
- తేల్చి చెప్పిన ఎపి భవన్ నివేదిక

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

నిధులు వాడుకోవడమే తప్ప చేసిన ఖర్చును చెప్పని అధికారుల విధానం తదుపరి నిధుల నిధులకు చేటు తెచ్చేలా కనిపిస్తోంది. వారాలు కాదు నెలలు కాదు... ఏళ్ల తరబడి ఇదే విధానం కొనసాగుతుందనేది చర్చనీయాంశంగా మారింది. చివరకు ఢిల్లీలో కేంద్ర నిధుల కోసం ప్రయత్నాలు చేసే ఎపి భవన్ అధికారులు కూడా అధికారుల తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా 13 పథకాలకు సంబంధించి కేంద్రం విడుదల చేసిన రూ. 3300 కోట్ల ఖర్చుకు వినియోగ ధ్రువీ కరణ పత్రాలు (యుసి)లు అధికారులు సమర్పించ లేదని వారి పరిశీలనలో స్పష్టమవుతోంది. ఇలాగైతే కొత్త నిధులు రావడం కష్టమేనని వారు రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చి చెబుతున్నారు. ఈ పరిస్థితిపై ఉన్నత స్థాయిలో సమీక్షించాల్సిన అవసరముందని కూడా వారు సూచిస్తున్నారు.

కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులను ఖర్చు చేస్తూ, ఎప్పటికప్పుడు వినియోగ ధ్రువీకరణ పత్రాలను కేంద్రానికి పంపించాల్సి ఉంటుంది. అనంతరం మిగిలిన నిధులను కేంద్రం విడుదల చేస్తుంది. కేంద్రం నుంచి రాష్ట్రానికి



రావాల్సిన నిధులపై కేంద్రంలోని వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకునేందుకు ఢిల్లీలోని ఆంధ్రా భవన్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. తాజాగా ఎపి భవన్ నుంచి రాష్ట్రానికి వచ్చిన నివేదికలో ఖర్చు చేసిన నిధులకు యుసిలు ఇవ్వక పోవడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఏడాదికి పైగా కాలంలో కొన్ని రంగాలకు చెందిన నిధులకు యుసిలు ఇవ్వలేదని వారు నిర్ధరించారు. కొన్నియితే నాలుగైదు సంవత్సరాలుగా కూడా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రధానంగా 13 పథకా లకు సంబంధించిన రూ. 3300 కోట్ల ఖర్చుకు యుసి సమర్పించని వాటిలో స్మార్ట్ సిటీలకు వచ్చిన నిధులు, రాజధాని నిర్మాణానికి వచ్చిన నిధులు, పిఎంఎవై నిధులూ ఎక్కువగానే ఉన్నాయి. స్మార్ట్ సిటీలకు రూ.1125 కోట్లు, రాజధాని నిర్మాణానికి రూ. వెయ్యి కోట్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రూ. 338 కోట్లు రాగా, వాటి వినియోగ ధ్రువీకరణ పత్రాలు ఏడాదికి పైనుంచి సమర్పించలేదని నివేదికలో పేర్కొన్నారు. అలాగే అమృత్ సిటీలు, పిఎం మాతృ యోజన, వైద్య కళాశాలల స్థాయి పెంపు, జాతీయ ఆరోగ్య మిషన్ వంటి వాటికి వచ్చిన నిధులపైనా ఖర్చు చేసినట్లు పత్రాలు సమర్పించలేదు. వీటిపై యుసిలు సమర్పిస్తే మరో రూ.500 కోట్లు వచ్చే పరిస్థితి ఉంటుందని ఎపి భవన్ వర్గాలు పేర్కొన్నాయి.

ఆరు నెలల నుంచి ఏడాది లోపు వచ్చిన నిధులకు సంబంధించి రూ.148 కోట్ల వరకు ఖర్చుకు యుసిలు సమర్పించలేదు. ఇవి సమర్పిస్తే మరో రూ.131 కోట్లు వస్తాయంటున్నారు. ఆరు నెలలలోపు వచ్చిన నిధులు రూ.216 కోట్లకూ యుసిలు పంపలేదు. వీటిని సమర్పిస్తే రూ.165 కోట్లు వచ్చే పరిస్థితి ఉందంటున్నారు. వచ్చే నిధులు నిలిచిపోతున్నా పంపాల్సిన యుసిలు పంపకపోవడంపై రాష్ట్ర అధికారుల్లో చలనం కనిపించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఒక రంగానికి చెందిన నిధులను వేరే అవసరాలకు వినియోగిం చడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తుతున్నట్లు ఆరోపణలున్నాయి. రాష్ట్రంలో ఖర్చులు పెరిగిపో వడం, ఆదాయం తగ్గడం వల్ల కేంద్రం నుంచి వచ్చిన నిధులను కూడా వేరే అవసరాలకు వాడుకుంటున్నారని, అందుకే యుసిలు సమర్పించలేకపోతున్నారని అధికారులు అంగీకరిస్తున్నారు.

పెండింగ్ యుసిల వివరాలు (రూ.కోట్లలో)

కాలపరిమితి	యుసిల మొత్తం	అదనంగా వచ్చేది
ఏడాదికిపైగా	3,300	500
6 నెలల నుంచి ఏడాదిలోపు	148	123
ఆరు నెలల్లోపు	216	165

కేంద్రం ఇంట్రెస్ట్‌గానే పనిచేస్తాను

- ఎపిలోని బిజెపి మంత్రులకు ఇక్కడి ఇంట్రెస్ట్ ఉంటుంది
- భోగాపురం' రీ టెండర్ ఎందుకు పిలిచారో రాష్ట్రాన్నే అడగండి
- అశోక్‌గజపతి రాజు వ్యాఖ్యలు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

'నేను టిడిపి మనిషిని. ప్రస్తుతం ఎన్డీయేలో భాగస్వామిని. కేంద్రంలో టిడిపి మైనర్ పార్టనర్. రాష్ట్రంలో బిజెపికి చెందిన ఇద్దరు మంత్రులు ఉన్నారు. అక్కడ టిడిపి మంత్రులు ఇద్దరు.. ఇక్కడ బిజెపి తరపున ఇద్దరు మంత్రులు ఉన్నారు. ఇక్కడున్న వారు రాష్ట్ర ఇంట్రెస్ట్‌పై పని చేస్తారు. అక్కడ ఉన్న మేమిద్దరం కేంద్ర ఇంట్రెస్ట్‌పై పని చేస్తాం. అందువల్ల ప్రత్యేక హోదాపై మాకు ముడి పెట్టి అడగొద్దు' అని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి అశోక్‌గజపతి రాజు అన్నారు. విశాఖలో భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. భోగాపురం ఎయిర్‌పోర్టు కార్గోను కలిపే టెండర్ ఎందుకు పిలవలేదన్న ప్రశ్నకు అశోక్ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. 'నేను టెండర్లు పిలిచే గుమాస్తాను కాదు. తొలిసారి టెండర్‌లో కార్గో సర్వీసును ఎందుకు చేర్చలేదో రాష్ట్ర ప్రభుత్వాన్ని అడగండి' అని వ్యాఖ్యానించారు. కేంద్ర పౌర విమానయాన మంత్రి బాధ్యతలు స్వీకరించేనాటికి దేశంలో కార్గో ద్వారా 750 మిలియన్ యుఎస్ డాలర్ల ఆదాయమే వచ్చేదన్నారు. అది కూడా సింగపూర్, దుబాయ్, శ్రీలంక లకు ఎయిర్ క్రాఫ్టలు నడిచేవన్నారు.



జిఎస్‌టి వచ్చాక ఏ రాష్ట్రానికీ పెట్టుబడులు రాలేదు

జిఎస్‌టి వచ్చాక ఏ రాష్ట్రంలోనూ పెట్టుబడులకు అనుకూలంగా లేదని కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజు అన్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాలను బట్టే పెట్టుబడులు వస్తాయన్నారు. హోదా గురించి నన్ను అడిగితే కన్ఫ్యూజన్ అవుతుంది. హోదా ఉన్న రాష్ట్రాలకు, లేని రాష్ట్రాలకు రాయితీల్లో 30 శాతమే తేడా ఉంటుందన్నారు. హోదా ఉంటే 90 శాతం గ్రాంట్స్, 10 శాతం రుణంగానూ, లేని రాష్ట్రాల్లో 60 శాతం గ్రాంట్స్ గానూ, 40 శాతం రుణంగానూ వస్తాయన్నారు. సిఐఐ సద స్సులు విశాఖలో వరుసగా మూడోసారి నిర్వహిస్తున్నారంటే వారు విశాఖ ప్రియులయి ఉంటారని అశోక్ చమత్కరిం చారు. ఈ సదస్సులో రాష్ట్రంలో ఏం చేయగలమో తెలుసుకొని ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే పెట్టుబడులపై ఎంఒయులు ఉంటాయని తెలిపారు. దేశంలో పెట్టుబడుదారులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ బెటర్‌గా ఉందన్నారు. 'ఈ వేదికలో బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజి ప్రకటించే వీలు లేదు. ఇది కేవలం పెట్టుబడిదారుల సదస్సు. ప్రభుత్వ ప్రకటనలు చేయడానికి వేరే వేదికలుంటాయి. దయచేసి కన్ఫ్యూజన్ చేయకండి' అని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. పశ్చిమ దేశాలను ఆకర్షించడానికే ఈ సదస్సులన్నారు.

చిన్న సినిమాల నిర్మాతలకు రూ. 10 లక్షల ప్రోత్సాహమివ్వాలి

అంబికా కృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో చిన్న సినిమాల నిర్మాతలకు రూ.10 లక్షల ప్రోత్సాహం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్లు ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిఎఫ్‌డిసి) చైర్మన్ అంబికా కృష్ణ తెలిపారు. విజయవాడ ఆర్‌టిసి కాంప్లెక్స్ పరిపాలనా భవనంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డిజిటల్ సినిమా ప్రొవైడర్లకు, సినిమా నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్ల మధ్య చర్చల్లో తాను పాల్గొన్నానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతల అనాలోచిత ఒప్పందాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. యుఎఫ్ఒ, క్యూబ్ డిజిటల్ సినిమా ప్రొవైడర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రకటనలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదన్నారు. ప్రయివేట్ ప్రకటనలకు ప్రాధాన్యతనిస్తున్నారన్నారు.

చిన్న సినిమాల నిర్మాణాన్ని రాష్ట్రంలోనే చేపట్టాలని సూచించారు. పెద్ద సినిమాలు కూడా కొంత భాగం ఇక్కడే చిత్రించాలని కోరామన్నారు. సినీ పరిశ్రమ ఏర్పాటుకు సహకారం అందిస్తామని సిఎం పేర్కొన్నారన్నారు. తడ ప్రాంతంలో ఎవియం సంస్థ ఆధ్వర్యంలో 24 ఎకరాల స్థలంలో స్టూడియో ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేసిందని, అనుకున్న విధంగా నిధులిస్తే ప్రత్యేకహోదా అడిగేవాళ్లం కాదని ఆయన అన్నారు. ప్రత్యేకహోదా గురించి సినిమా హీరోల వద్ద ప్రస్తావన రాలేదన్నారు.

ప్రైవేటు సంస్థలకు వేల కోట్లు ధారాదత్తం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



విద్యుత్తు కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటే రాష్ట్రం సమస్యల్లో ఉందని చెబుతున్న సిఎం చంద్రబాబు, విద్యుత్ సంస్థలు పిపిఎల పేరిట ప్రైవేటు సంస్థలకు వేల కోట్లు ధారాదత్తం చేస్తోంటే ఏం చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు ప్రశ్నించారు. పవన, సోలార్ విద్యుత్తు బహిరంగ మార్కెట్‌లో యూనిట్ రూ.2 లకే దొరుకుతుంటే రాష్ట్రం రూ.6కి కొనుగోలు చేస్తోందన్నారు. విజయవాడ ధర్నా చౌక్‌లోని సమ్మె శిబిరంలో శనివారం ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కార్మికులు ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం రాలేదని విమర్శించారు. పదవులు శాశ్వతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న ముఖ్యమంత్రికి, కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించడానికి మాత్రం చేతులు రావడం లేదన్నారు. సచివాలయంలో శుక్రవారం సిఎంను సిపిఎం, సిపిఐ నాయకులు కలిస్తే ఈ వ్యవహారంతో ప్రభుత్వానికి సంబంధం లేదనడాన్ని తప్పుబట్టారు. విద్యుత్తు కాంట్రాక్టు కార్మికుల సమస్యలు, సమ్మె అంశంపై చర్చించేందుకు విపక్ష పార్టీలన్నీ ఆదివారం సమావేశం అవుతున్నాయన్నారు. వైఎస్ఆర్‌టియుసి విజయవాడ నగర నాయకులు రవి, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కె.పోలారి తదితరులు సమ్మె శిబిరానికి హాజరై కార్మికులకు మద్దతు తెలిపారు.

పలు యూనియన్ల మద్దతు

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు పలు సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. ఈ మేరకు ఆయా యూనియన్ల నాయకులు సంయుక్తంగా శనివారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న పిఎసిఎస్ ఉద్యోగులు, పెన్షనర్లు, ఎల్ఐసి ఏజెంట్లు విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు మద్దతుగా నిలవాలని, వారి శిబిరాల మద్దకు వెళ్లి వారి పోరాటానికి మద్దతు తెలపాలని కోరారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ వర్కర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పి అజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శులు కె సుధాకర్, ఎపి స్టేట్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి సత్యనారాయణ, ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి నరసింహారావు ప్రకటన విడుదల చేశారు.

రేపు కాగడాలతో నిరసన ప్రదర్శన

పిసిసి చీఫ్ రఘువీరా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి ప్రత్యేక హోదాను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 26న విజయవాడలో కాగడాలతో నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి తెలిపారు. ఆంధ్రరత్న భవన్ నుంచి పోలీస్ కంట్రోల్ రూం మీదుగా లెనిన్ సెంటర్ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్రం ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను మార్చిలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో సవరణలు చేసి రాష్ట్రానికి తగిన నిధులు కేటాయించాలని రఘువీరా కోరారు. ఈ మేరకు ఆయన ప్రధాని నరేంద్రమోడీకి శనివారం లేఖ రాశారు. ఎపికి ప్రత్యేక హోదా, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ హామీలు, ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అన్ని అంశాల అమలుకు సంపూర్ణ బాధ్యత తీసుకుంటామని బిజెపి ఇచ్చిన హామీలను ఆయన గుర్తు చేశారు.

నోరు అదుపులో పెట్టుకో..

మంత్రి ఆదినారాయణరెడ్డిపై వైసిపి మండిపాటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మంత్రి ఆదినారాయణరెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వైసిపి అధికార ప్రతినిధి టిజెఆర్ సుధాకర్‌బాబు హెచ్చరించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ గుర్తుపై గెలిచిన మంత్రి ఆదినారాయణరెడ్డికి వైఎస్ కుటుంబానికి సవాల్ విసిరేంత స్థాయి లేదన్నారు. వైఎస్ కుటుంబ భిక్షతో రాజకీయ పదవులు పొందిన సంగతి మరచిపోవద్దన్నారు. చంద్రబాబు రాజకీయ చరిత్ర, వైఎస్ రాజకీయ చరిత్రపై బహిరంగ చర్చకు ఎక్కడ ఎప్పుడైనా సిద్ధమేనన్నారు. నిజమైన రాయలసీమ వాసివే అయితే రాజీనామా చేసి మాట్లాడాలన్నారు. ఒక పార్టీపై గెలిచి ఇంకో పార్టీ తరుపున మంత్రి పదవి పొంది రాజకీయ వ్యభిచారం చేయడం తగదన్నారు. ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఇకనైనా నోటికొచ్చినట్లు మాట్లాడటం ఆపి చిల్లర వ్యాపారాలు చేసుకోవాలన్నారు.

28న డిస్కాంల ముట్టడి

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్య వేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెను మరింత ఉధృతం చేయాలని ఎపి విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్య వేదిక నిర్ణయించింది. భవిష్యత్తు కార్యాచరణను ఐక్య వేదిక సెక్రటరీ జనరల్ ఎం.బాలకాశి ప్రకటించారు. ఈనెల 25న అన్ని జిల్లాల్లో నిరవధిక దీక్షలు, 26న కలెక్టరేట్లకు సామూహిక రాయబారం, 28న ఎస్‌పిడిసిఎల్, ఇపిడిసిఎస్ సంస్థల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. విద్యుత్ సంస్థలలో 24 వేల మంది కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో ఉన్నారని చెప్పారు. విద్యుత్ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం సమస్యను పరిష్కరించకుండా చర్చల పేరిట కాలయాపన చేస్తోందన్నారు. కార్మికుల పోరాటానికి ఇప్పటికే రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయని, మరొకొన్ని మద్దతు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో అన్ని సంఘాల మద్దతుతో నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేయాలని ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

కార్మికులకు మద్దతుగా 26న పికెటింగ్ : కార్మిక, ప్రజా సంఘాలు

విద్యుత్ కార్మికుల సమ్మెకు మద్దతుగా ఈనెల 26న జిల్లా కలెక్టర్ కార్యాయాల వద్ద పికెటింగ్ నిర్వహించాలని అన్ని కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నేతలు తీర్మా నించారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ప్రభుత్వం తక్షణం స్పందించి కాంట్రాక్టు కార్మికుల ఐక్య వేదికతో చర్చించి, సమస్యలు పరిష్కరించా లని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులంతా రోడ్లపైకి వస్తారని హెచ్చరిం చారు. ఈ పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయా కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నేతలు స్పష్టం చేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ గఫూర్ మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మెపై ముఖ్య మంత్రికి స్వయంగా సమస్య విన్నవించినా నిరాశే ఎదురైం దన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు సమావేశానికి అధ్యక్షత వహిస్తూ అత్యవసర సర్వీసుల్లో ఒకటైన విద్యుత్ రంగంలో కార్మికులు సమ్మె చేసే పరిస్థితి రావడానికి ప్రధానంగా ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహే శ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ కార్మికులు డిమాండ్ల పరిష్కారం కోసం మూడేళ్లుగా వివిధ రకాలుగా నిరసనలు తెలిపారని, వాటిని వివరించారు. ఐఎఫ్‌టియ రాష్ట్ర నాయకులు పోలారి, రామారావు, ఎఐయుటియుసి రాష్ట్ర నాయకులు కె.సుధీర్, ఎన్ఎఫ్‌టిఇ (బిఎస్ఎన్ఎల్) నాయకులు జె.వి రావు, యుఇఐయు నాయకులు నాగ బ్రహ్మాచారి, డిహెచ్‌పిఎస్ నాయకులు రాయప్ప, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ, ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాయకులు బివిఆర్ రెడ్డి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం నాయకురాలు స్వరూపారాణి, ఆటో వర్కర్స్ యూనియన్, ఆర్.వి నర్సింహారావు, బిల్డింగ్ వర్కర్స్, రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ తదితర యూనియన్ల నాయకులు ప్రసంగించారు.

సంక్షిప్తం

జగన్ నిర్వాకం వల్లే ప్రధానికి నోటీసులు

మంత్రి సిద్ధా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విపక్షనేత జగన్మోహన్‌రెడ్డి నిర్వాకం వల్లే ప్రధాని మోడీకి, కేంద్ర మంత్రులకు నోటీసులొచ్చాయని రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి సిద్ధా రాఘవరావు శనివారం ప్రకటనలో తెలిపారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న జగన్ దేశంలోనే అత్యధిక కేసులున్న విపక్ష నాయకుడిగా ఉన్నారన్నారు. అధికారులనే కాక విదేశీ కంపెనీలను సైతం మోసం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఇందూ ఐటి సెజ్‌లో మారిషస్‌కు చెందిన కరీస్సా ఇన్వెస్ట్‌మెంట్స్ ఎల్ ఎల్ సి రూ 115 కోట్లు పెట్టుబడిపెట్టి మోసపోయిందని తెలిపారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలుకోసం, కేంద్ర బడ్జెట్‌లో ఎపికి జరిగిన అన్యాయానికి నిరసనగా మార్చి 6న ఎపి ప్రత్యేక హెూదా, విభజన హామీల సాధన సమితి చేపట్టిన 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అందరూ ముక్తకంఠంతో నినదించాల్సిన అవసరం ఉందని, నాలుగేళ్లుగా మాయమాటలతో మోసం చేస్తున్న బిజెపి కపట నాటకాలపై సమరానికి ఆంధ్రులంతా ఐక్యంగా కదలాలని కోరారు. ప్రత్యేక తరగతి హోదా సాధించే వరకూ ఏకోన్ముఖంగా వరుస కార్యక్రమాలు, ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాలతో పాటు వివిధ వాపార, వాణిజ్య సంఘాలన్నీ ప్రత్యేక హోదా సాధనకై నడుంకట్టాలని పేర్కొన్నారు. రాష్ట్రానికి న్యాయం జరిగే వరకూ ఐక్య ఉద్యమాలు సాగాలని, చలో ఢిల్లీలో అన్ని వర్గాల ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'ఉపాధి'తో వలసలను ఆపాలి : వ్యకాస

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వ్యవసాయ కూలీలకు పనులు లేక లక్షల సంఖ్యలో వలసలు పోతున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం జరిగిన సంఘ సమావేశానికి ఆయన అధ్యక్షత వహిస్తూ రాష్ట్రంలో వలసలు ఆపాలంటే తక్షణమే ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 100 కేంద్రాల్లో భూపోరాటాలు జరుగుతున్నాయని తెలిపారు. పేదలు ఆక్రమించి సాగుచేస్తున్న ప్రభుత్వ బంజరులకు ప్రభుత్వం వెంటనే పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాల మంజూరు కోసం గత రాష్ట్రప్రభుత్వాలు అనేక జిల్లాల్లో భూసేకరణ చేసి అర్హులైన వారికి పంపిణీ చేయకుండా నిలిపివేసిందని తెలిపారు. పేదలు ఆక్రమించి గుడిసెలు వేసుకొని ఉద్యమం చేపడతామని రాష్ట్రప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉపాధి బకాయిలు చెల్లించలేదని, పోస్టాఫీసుల ద్వారా వేతనాలు చెల్లించాలని నాయకులు తెలిపారు. పశ్చిమ గోదావరి, కృష్ణ జిల్లాల్లో కాల్వల తవ్వకం, జెటిసిటి నిర్మాణం పేరుతో దళితులు సాగుచేసుకుంటున్న భూములను ప్రభుత్వం బలవం తంగా లాక్కుంటుందని, పట్టాభూములతో సమానంగా వీరికి కూడా నష్టపరిహారం చెల్లించాలని సమావేశం తీర్మానం చేసింది. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు కనీస వేతన చట్టం అమలు కావడం లేదని, కేరళ ప్రభుత్వం చెల్లిస్తున్న విధంగా వ్యవసాయ కార్మికులకు రోజు వేతనం రూ.600 ఉండేలా చట్ట సవరణ చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసింది.

గుంతకల్లు రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

హైకోర్టులో పిల్

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉన్న నేపథ్యంలో, గుంతకల్లులో రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. అనంతపురం జిల్లా గుంతకల్లులో రైల్వే డివిజన్ ఉందని, ఇక్కడ అవసరమైన భూమి కూడా ఉన్నందున రైల్వే జోన్‌ను ఏర్పాటు చేసేలా కేంద్రానికి ఆదేశాలివ్వాలని కోరుతూ గుంతకల్లుకు చెందిన శ్రీనివాస్‌చౌదరి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని వేశారు. ఏపి పునర్ విభజన చట్టం-2014లోని 93,94 సెక్షన్ల ప్రకారం రైల్వే డివిజన్ వెంటనే ఏర్పాటుకు కేంద్రం చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలన్నారు. చట్ట ప్రకారం ఆరు మాసాల్లో రైల్వే జోన్ ఏర్పాటు చేయకపోవడాన్ని రిట్‌లో ఎత్తిచూపారు. ఇందులో రైల్వే శాఖ కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ప్రతివాదులుగా చేశారు. 27న ఈ పిల్‌ను హైకోర్టు విచారించే అవకాశముంది.

ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్ట్

ప్రజాశక్తి-చిత్తూరు:
చిత్తూరు జిల్లాలో ఎర్రచందనం దొంగలు పట్టుబడ్డారు. వారి నుంచి నాలుగు ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు జిల్లా ఎర్ర వారి పాలెం మండలం మేదర పల్లి సమీపంలోగల అమ్మ చెరువు వద్ద పీలేరు రూరల్ సీఐ గారి ఆదేశాల మేరకు యర్రావారిపాలెం ఎస్సై ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టే చెరువు గ్రామానికి చెందిన ఎర్రయ్య ,శివ చంద్రగిరి మండలానికి చెందిన శ్రీరాములు మరియు రవిలను అరెస్టు చేసి వారి వద్ద సుమారు 1,75,000 విలువగల 70 కేజీ ల నాలుగు ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు.



ఆవిష్కరణ

తవనం చెంచయ్య జీవిత విశేషాల సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ శాసనసభ్యులు పాటూరురామయ్య, దళిత శోషణ్ ముక్తి మంచ్ జాతీయ కన్వీనర్ వి.శ్రీనివాసరావు తదితరులు

స్ఫూర్తిదాయకం తవనం జీవితం

మాజీ శాసనసభ్యులు పాటూరు రామయ్య
తవనం జీవిత విశేషాలతో సావనీర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్
వ్యవసాయ కార్మిక సంఘం నిర్మాత, ప్రజాసేవకులు తవనం చెంచయ్య ఆశయాలను నేటి యువతరం ముందుకు తీసుకెళ్ళాలని మాజీ శాసనసభ్యులు పాటూరు రామయ్య పిలుపునిచ్చారు. తవనం చెంచయ్య నాలుగో వర్ధంతి సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తవనం చెంచయ్య జీవిత విశేషాలతో కూడిన సావనీర్‌ను పాటూరురామయ్య ఆవిష్కరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జాలా అంజయ్య అధ్యక్షతన జరిగిన సభలో రామయ్య మాట్లాడారు. వివక్షకు గురైన దళిత కుటుంబం నుండి తవనం చెంచయ్య వచ్చారని గుర్తు చేశారు. కార్మిక ఉద్యమానికి నాయకత్వం వహించి అనేక ఉద్యమాలు చేశారని చెప్పారు. సిద్ధాంతాల సమస్యలు వచ్చినా, రాజకీయ ఒడిదుడుకులు వచ్చినా పరిస్థితులను గమనించి ముందుకు వెళ్ళేవారన్నారు. సమాజ మార్పు కోసం తీవ్ర కృషి చేసేవారని కొనియాడారు. చెంచయ్య ప్రజల మనిషి, నిరంతరం ప్రజలలో ఉండటమే ఆయన ఊపిరి అని దళిత శోషణ్ ముక్తి మంచ్ జాతీయ కన్వీనర్ వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. చెంచయ్య పేరు చెప్పకుండా జిల్లా రాజకీయ చరిత్ర లేదనే పరిస్థితికి తీసుకొచ్చారన్నారు. ఆయన చొరవను నేటి యువకార్యకర్తలు నేర్చుకోవాలనీ, కార్మిక సమస్యలపై నిర్మోహమాటంగా, సూటిగా అధికారులు, యాజమాన్యాల వద్ద చెప్పేవారనీ, పోరాటం చేసేవారని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సిద్దయ్య పేర్కొన్నారు. సిపిఎం తూర్పు కమిటీ జిల్లా కార్యదిర్శ పూనాటి ఆంజనేయులు, సిపిఎం మాజీ జిల్లా కార్యదర్శి పమిడి కోటయ్య, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి మాట్లాడారు.

ఎఫ్ఆర్‌డిఐ బిల్లుతో బ్యాంకులు దివాళా

- మార్చిలో పార్లమెంట్ వద్ద ఆందోళనలు
- బెఫీ జాతీయ ప్రధాన కార్యదర్శి బిశ్వాస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
కేంద్రప్రభుత్వం తీసుకురానున్న ఫైనాన్షియల్ రిజాల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్(ఎఫ్ఆర్‌డిఐ) బిల్లు వల్ల బ్యాంకులు నష్టపోతాయని, ప్రభుత్వ రంగ బ్యాంకులు దివాళా తీసే పరిస్థితి వస్తుందని బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి ప్రదీప్ బిశ్వాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లులను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 12వ జాతీయ సమావేశాలు శనివారం నుంచి విజయవాడలో ఎంబి విజ్ఞాన కేంద్రంలో ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా శనివారం ఎంబివికెలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు రుణాలు వసూలు చేసేందుకు అవసరమైన చట్టాలు చేసి బ్యాంకులను, బ్యాంకు ఖాతాదారులను రక్షించాల్సింది పోయి, దానికి విరుద్ధమైన ఎఫ్ఆర్‌డిఐ బిల్లుని తీసుకొస్తోందని తెలిపారు. ఈ బిల్లు వల్ల డిపాజిటర్లకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఆ భయంతో ప్రజలు ఇప్పటికే బ్యాంకుల్లో డబ్బులు దాచుకోవడం లేదని, ఉన్న వాటిని విత్ డ్రా చేసుకుంటున్నారని చెప్పారు. దివాళా తీసినా ప్రైవేట్ బ్యాంకుల ఖాతాదారులను ప్రభుత్వ రంగ బ్యాంకులు కాపాడాయని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో కొంతకాలంగా మొండిబాకీలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2017 డిసెంబర్ నాటికి రూ.10 లక్షల కోట్ల బకాయిలున్నాయని తెలిపారు. ఇది మొత్తం బ్యాంకు రుణాల్లో సుమారు 10 శాతమని చెప్పారు. మొండి బకాయిల్లో 80 శాతం పైగా కార్పొరేట్ కంపెనీలు చెల్లించాల్సినవేనని పేర్కొన్నారు. మొండిబాకాయిల లిస్టును సుప్రీంకోర్టు అడిగినా, పార్లమెంట్‌లో ప్రశ్నలు లేవనెత్తినా బయట పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించారు. మరోపక్క బకాయిల ఎగవేతదారులపై ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఎఫ్ఆర్‌డిఐ బిల్లును ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో మార్చిలో పార్లమెంట్ ఎదుట ఒక రోజు ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు కె కృష్ణన్, , డిప్యూటీ జనరల్ సెక్రటరీ రంగన్ రాజు, సలహాదారు తపాన్ దాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.ఏ గఫూర్



సమావేశానికి హాజరైన ప్రతినిధుల్లో ఒక భాగం

ఎఫ్ఆర్‌డిఐ బిల్లు శిక్షే : గఫూర్

ఎఫ్ఆర్‌డిఐ బిల్లు ప్రజలకు శిక్షేనని, పేదల సొమ్మును కార్పొరేట్ల పరం చేసేందుకే ఈ బిల్లును తీసుకొస్తున్నారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.గఫూర్ అన్నారు. ఎంబి విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 12వ జాతీయ మహాసభ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పేదల ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు పనిచేయడం లేదని విమర్శించారు. రాయితీల పేరుతో ప్రజాధనాన్ని ప్రయివేటు కంపెనీలకు కట్టబెడుతున్నారని, ప్రజల కష్టాలకు కారణాలు, వాటి పరిష్కార మార్గాలు ఏ ఒక్క ప్రభుత్వమూ ఆలోచించడం లేదని తెలిపారు. కార్మిక ఉద్యమాలతో పాటు జాతి ఐక్యత, ప్రాథమిక హక్కుల కోసం పోరాడాలని కోరారు.

ఎఫ్ఆర్‌డిఐ బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమాలు: వెంకట్రామయ్య

ఎఫ్ఆర్‌డిఐ బిల్లును వ్యతిరేకించాలని బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫీ) ఉపాధ్యక్షులు వెంకట్రామయ్య పిలుపునిచ్చారు. బ్యాంకు ఉద్యోగుల ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా మహాసభలో నిర్ణయాలు తీసుకోవాలన్నారు. అన్ని సంస్థలనూ ప్రయివేటీకరించడంలో భాగంగానే ఎఫ్ఆర్‌డిఐ బిల్లును తీసుకొచ్చారన్నారు. ఆర్బీఐ అధికారాలను కాలరాసే విధంగా ఈ బిల్లు ఉందని, అధికారం మొత్తం ఒక కమిషన్ చేతిలో పెట్టాలని చూస్తున్నారని తెలిపారు. ఐబిఇఎఫ్ ప్రధాన కార్యదర్శి సరంజిత్ గోష్ సభలో ముందుగా సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మహాసభల ప్రారంభ కార్యక్రమంలో ఐబిఇఎఫ్ గౌరవ సలహాదారు తపన్‌దాస్, ప్రధాన కార్యదర్శి బిశ్వాస్, సభాధ్యక్షులు కృష్ణన్, ఎల్ఐసి మహిళా కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు ఎం కామేశ్వరి, ఎపిఎంఎస్ఆర్‌యు ప్రధాన కార్యదర్శి యు.వి.కృష్ణయ్య, ఐసిఇఎల్ ఉపాధ్యక్షులు సిహెచ్ కళాధర్ పాల్గొన్నారు.

ఆర్‌టిసిలో నిలిచిన నియామకాలు

కండక్టర్లు, డ్రైవర్లు ఎంపికపై తొలగని నిషేధం
అద్దె బస్సు డ్రైవర్లకు టిమ్స్ - పదేళ్లుగా పెరగని బస్సులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
ఆర్‌టిసిలో కొత్త నియామకాలను నిలిపివేసి అన్ని వ్యవస్థలనూ ప్రయివేటీకరించే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆర్‌టిసి బస్సులు పెరగడం లేదు. 10 ఏళ్ల కిందట గుంటూరు రీజియన్‌లో 1050 బస్సులు ఉండగా ప్రస్తుతం ప్రయివేటు, ఆర్‌టిసి బస్సులు కలిపి 1025 ఉన్నాయి. వీటిల్లో జిల్లా మొత్తం మీద 285 అద్దె బస్సులు తిరుగుతున్నాయి. అద్దె బస్సుల పెరుగుదల వల్ల డ్రైవర్ల నియామకం నిలిచింది. అద్దె బస్సుల్లో కండక్టర్లు లేకుండా ప్రయివేటు బస్సు డ్రైవర్లకే టిక్కెట్ ఇష్యూ మిషన్ (టిమ్స్) అప్పగిస్తున్నారు. దీంతో ఆర్‌టిసి డ్రైవరు, కండక్టర్లు లేకుండా పలు సర్వీసులు నడుస్తున్నాయి. దీని వల్ల కొన్ని అక్రమాలు జరిగినా అడిగే పరిస్థితి లేదనే వాదన విన్పిస్తోంది. మరో వైపు కండక్టర్ల నియామకం నిలిపేసినా నాన్‌స్టాప్ సర్వీసులను పెంచుతున్నారు. నాన్‌స్టాప్ సర్వీసులు బస్టాండ్ తర్వాత స్టేజీ వద్ద టిక్కెట్లు ఇచ్చేందుకు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో రూ.5 వేల వేతనంతో యువతీ, యువకులను నియమిస్తున్నారు. కండక్టర్ల నియామకం పూర్తిగా నిలిపేశారు. నష్టాల నెపంతో గ్రామీణ సర్వీసులను ఇష్టానుసారంగా రద్దు చేస్తున్నారు. గుంటూరు రీజియన్ గత ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి రూ.52 కోట్ల నష్టాల్లో ఉందని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ.40 కోట్ల వరకూ నష్టాలొచ్చాయని అధికారులు చెబుతున్నారు. కొన్ని డిపోలు మాత్రం స్వల్పంగా లాభాల్లో ఉన్నాయి. ప్రస్తుతం 50 మంది డ్రైవర్లు, 35 మంది కండక్టర్లు అదనంగా ఉన్నారని అధికారులు తెలిపారు. బస్‌పాస్‌లు, రిజర్వేషన్ల టిక్కెట్లు జారీ అంతా ప్రయివేటు సంస్థలకు అప్పగించారు. ఆర్‌టిసిలో మినిస్టీరియల్ స్టాఫ్ నియామ కాలు నిలిచాయి. కండక్టర్లు, డ్రైవర్ల నియామకం నిలిపేసినా చాలా ప్రాంతాల్లో లాభాలు రావడం లేదు. కొత్త బస్సుల కొనుగోలు ఆగిపోయిందని, పాత బస్సులు దెబ్బ తింటే వాటి స్థానంలో కొత్తవి తీసుకురాకుండా అద్దె బస్సులను పెంచుకుంటూ పోతున్నారని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. నష్టాల నివారణ పేరుతో వీలైనన్ని సర్వీసులు తగ్గించడం మినహా ప్రజలకు అందుబాటులో సర్వీసులను పెంచడం, ఏ ప్రాంతంలో ఏ సమయంలో రద్దీ ఉంటుందో గుర్తించి ఆ మార్గంలో ఎక్కువ సర్వీసులను నడపడంపై ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడం లేదు. కేవలం కిలో మీటర్ల లక్ష్యం తప్ప ప్రయాణికులను ఎక్కువ మందిని ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించలేకపోతున్నారు. మరోవైపు ప్రత్యామ్నాయ రవాణా వ్యవస్థ బాగా అభివృద్ధి చెందడం, ప్రయివేటు వాహనాలు భారీగా పెరగడంతో ఆర్‌టిసి క్రమంగా తిరోగమనంలో పయనిస్తోంది. ప్రభుత్వమూ కొత్త బస్సుల కొనుగోలు, నియామకాలపై పట్టించుకోవడంతోపాటు ఆర్‌టిసి పరిరక్షణ చర్యలపై దృష్టి సారించడం లేదు.

అగ్ని ప్రమాదంలో గాయపడ్డ ముగ్గురు మృతి

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్ (విశాఖ)
విశాఖ జిల్లా అనకాపల్లి మండలం, రేబాక గ్రామంలోని లలితాంబిక టైర్ల కంపెనీలో గత మంగళవారం చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుల్లో ముగ్గురు మృతి చెందారు. లలితాంబిక ఇండస్ట్రీస్‌లో (టైర్ల కంపెనీ)లో టైర్ల నుండి చమురు ఉత్పత్తి చేసే ఈ కంపెనీలో ఈ నెల 20 వెల్డింగ్ పనులు చేస్తుండగా వచ్చే నిప్పు రవ్వలు పక్కనే ఉన్న చమురుపై పడడంతో ఒక్కసారిగా మంటలు వ్యాప్తించి పెద్దఎత్తున ఎగసిపడ్డాయి. దీంతో గాజువాక డ్రైవర్స్ కాలనీకి చెందిన వి.గోవింద్, టి.గోపి, రేబాకకు చెందిన సీయాద్రి శ్రీనివాసరావు, కె.మధు తీవ్రంగా గాయపడ్డారు. 90 శాతం శరీరం కాలిపోయి నలుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కెజిహెచ్‌కు తరలించి చికిత్స అందించినా పరిస్థితి విషమించి వి.గోవింద్ శుక్రవారం మృతి చెందాడు. టి.గోపి (20), రేబాక గ్రామానికి చెందిన సియాద్రి శ్రీను (45) శనివారం మరణించారు. సియాద్రి శ్రీను మృతి చెందడంతో రేబాక గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. శ్రీను ఆటో నడపడం ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు సరిపోక టైర్ల కంపెనీలోకి పనులకు వెళ్లగా ఇంతలోనే ప్రమాదం సంభవించి మృత్యువాత పడడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు.

మెట్రో ప్రాజెక్టుల్లో చెక్ ఇన్వెస్టర్లకు అవకాశం

ఎఎంఆర్‌సి ఎమ్‌డిని కోరిన చెక్ రాయబారి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ ప్రతినిధి
విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుల్లో చెక్ రిపబ్లిక్ ఇన్‌వెస్టర్లకు అవకాశం కల్పించాలని ఆ దేశ రాయబారి మిలాన్ హోవర్కు అమరావతి మెట్రో రైలు కార్పొరేషన్ (ఎఎంఆర్‌సి) ఎమ్‌డి రామకృష్ణారెడ్డిని కోరారు. మెట్రో ప్రాజెక్టులపై చర్చించేందుకు మిలాన్ హోవర్కు శనివారం ఢిల్లీ నుంచి విజయవాడ విచ్చేశారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ రోడ్డులోని ఎఎంఆర్‌సి భవనంలో మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణారెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మెట్రో ప్రాజెక్టుల వివరాలను రామకృష్ణారెడ్డి ఆయనకు వివరించారు. విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టు టెండర్ల గడువు ఈనెల 27తో ముగియనుందని తెలిపారు. ఈ టెండర్లలో అర్హత సాధించిన దేశీయ కంపెనీతో విదేశీ ఇన్‌వెస్టర్లు ఒప్పందం కుదుర్చుకునేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. మిలాన్ హోవర్కు సైతం మెట్రో రైలు, కోచ్‌ల తయారీలో చెక్ రిపబ్లిక్ విశిష్టత గురించి రామకృష్ణారెడ్డికి వివరించారు. 1.5 మిలియన్ జనాభా ఉన్న చెక్ రాజధాని ప్రేగ్‌కు, విజయవాడ నగరానికి సామీప్యత ఉందని, విజయవాడ మెట్రో ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణకు సంబంధించిన ఒప్పందాల్లోనూ తమదేశ ఇన్‌వెస్టర్లను పరిగణనలోకి తీసుకోవాలని మిలాన్ కోరినట్లు తెలిసింది. చెక్ రిపబ్లిక్ ఎకనమిక్ అసిస్టెంట్ మిలాన్ దోస్తల్ రాయబారి వెంట ఉన్నారు.



ఎఎంఆర్‌సి ఎమ్‌డి రామకృష్ణారెడ్డితో సమావేశమైన చెక్ రిపబ్లిక్ రాయబారి మినాన్ హోవర్ట్

వసూలయ్యేదెలా..!

రూ.988.40 కోట్లకు చేరిన ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థల బకాయిలు
అచేతన స్థితిలో ఎపిఇపిడిసిఎల్

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి
ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్)కు ప్రభుత్వమే పెద్ద భారంగా మారింది. ఇపిడిసిఎల్‌కు ప్రభుత్వం నుంచి సహకారమేమీ అందకపోగా ప్రభుత్వపరంగా చెల్లించాల్సిన బకాయిలనూ విడుదల చేయడం లేదు. ప్రభుత్వ శాఖ అధికారులను ఇపిడిసిఎల్ బకాయి చెల్లించాలని ఎన్నిసార్లు కోరినా నిధుల్లేవంటూ చేతులెత్తేస్తున్నారు. దీంతో ప్రభుత్వ శాఖలు, సంస్థలు, స్థానిక సంస్థల బకాయి క్రమంగా పెరుగుతూ చివరకు గతేడాది డిసెంబరు 31 నాటికి రూ.988.40 కోట్లకు చేరుకుంది. ఇపిడిసిఎల్ పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రభుత్వ శాఖల నిర్వహణ ఖర్చులను ఎప్పటికప్పుడు అవసరమైన మేరకు ప్రభుత్వం విడుదల చేయడం లేదు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచే సుమారు రూ.200 కోట్ల బకాయి రావాల్సి ఉన్నట్లు తెలిసింది. ఎస్‌సి, ఎస్‌టిలకు ఇచ్చే సబ్సిడీనీ ప్రభుత్వం చెల్లించడం లేదు. సాధారణ విద్యుత్ వినియోగదారుల నుంచి బకాయిల వసూళ్లలో పురోగతి ఉన్నప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల నుంచి వసూలు చేయడం విద్యుత్ శాఖ అధికారులకు పెద్ద సమస్యగా మారింది. విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించలేక, విద్యుత్ సరఫరా నిలిపివేయలేక మల్లగుల్లాలు పడుతున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి

ప్రజాశక్తి - తంబళ్ళపల్లె (చిత్తూరు)
విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి చెందిన ఘటన చిత్తూరు జిల్లాలోనితంబళ్లపల్లి మండలం ముద్దలదొడ్డిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భూమిరెడ్డి, మద్దిరెడ్డిలు గ్రామానికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలోని వ్యవసాయ బోరు వద్ద వేరుశనగ పంట వేశారు. పంట ఏపుగా పెరిగి దిగుబడి వచ్చే సమయంలో అడవిపందులు నాశనం చేస్తుండడంతో వాటిని అదుపు చేయడానికి విధిలేని పరిస్థితుల్లో స్టేవైర్‌తో పొలం చుట్టు కంచె వేసి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి అక్కమ్మగారిపల్లికి చెందిన రైతులు మేకల రామలింగారెడ్డి, రాజారెడ్డి, దొడ్డికాడపల్లెకు చెందిన దయ్యాల వెంకట రమణారెడ్డిలను అడవి జంతువులను బెదిరించడానికి రావాలని భూమిరెడ్డి పిలిచాడు. వీరు ముగ్గురూ మూడు కుక్కలతో రాత్రి పది గంటలకు వెళ్లారు. ఆ సమయంలో పొలం యజమాని లేకపోవడంతో రాజారెడ్డికి చెందిన కుక్క తొలుత ఇనుప స్టే వైరుకు తగిలి చనిపోయింది. గమనించిన రాజారెడ్డి చెప్పేలోపే రామలింగారెడ్డి, వెంకట రమణారెడ్డిలు మరోవైపు వెళ్లి విలవిలలాడుతూ చనిపోయారు. రాజారెడ్డి వారిని కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఇంతలోనే మరో రెండు కుక్కలు చనిపోయాయి. రాజారెడ్డి తేరుకుని షాక్‌నుంచి తేరుకుని గట్టిగాకేకలు వేయడంతో భూ యజమానులు వచ్చే సరికే రామలింగారెడ్డి, వెంకట రమణారెడ్డిలు మృతిచెందారు. విద్యుత్ షాక్‌తో రామలింగారెడ్డి చేతి వేళ్లు తెగిపడ్డాయి. రమణారెడ్డి ఎడమ భుజం, ఎడమ కాలు తెగి పోయాయి. కాలి చేతివేళ్లు తెగిపడి హృదయవిదారకరంగా తయారయ్యింది. ఎస్ఐ దిలీప్‌కుమార్, విఆర్ఓ ప్రభాకర్‌లు మృతదేహాలను పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను మదనపల్లికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

రైలు నుంచి జారిపడి ఇద్దరు పాస్టర్లు మృతి

వ్యక్తమవుతున్న అనుమానాలు

ప్రజాశక్తి-ఏలూరు సిటీ
పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు రూరల్ మండలం సత్రంపాడు పంచాయతీ సమీపంలో శనివారం కదులుతున్న రైలు నుంచి జారిపడి ఇద్దరు పాస్టర్లు మృతి చెందారు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. సిక్కిం రాష్ట్రం తూర్పు రాజ్యభవన్‌కు చెందిన సిల్వెస్టర్ లెప్చా, పశ్చిమబెంగాల్ రాష్ట్రం పగాగ్ గుంపాపోంగ్‌కు చెందిన ఆమోస్ లెప్చా బంధువులు. సిల్వెస్టర్‌కు బెంగళూరులోని ఓ చర్చిలో పాస్టర్‌గా నియామకానికి ఇంటర్వ్యూ నిమిత్తం లేఖ వచ్చింది. ఆయన తనకు తోడుగా ఆమోస్‌ను తీసుకుని కామాఖ్య - యశ్వంత్‌పూర్ స్పెషల్ రైలులో బెంగళూరుకు బయలుదేరారు. ఆ రైలు ఏలూరు సత్రంపాడు ప్రాంతానికి చేరుకునేసరికి వారిద్దరూ రైలు నుండి జారిపడిపోయారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ విషయాన్ని గమనించిన ట్రాక్‌మెన్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాల వద్ద లభ్యమైన ఆధార్‌కార్డుల ద్వారా వారి వివరాలు సేకరించి, బంధువులకు సమాచారం ఇచ్చారు. వారిద్దరూ ఒకేసారి రైలు నుంచి జారిపడి మృతి చెందడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏసీ స్పెషల్‌ట్రైన్‌లో రిజర్వేషన్ చేయించుకున్న వారిద్దరూ డోర్ వద్దకు ఎందుకు వచ్చారు? ఇద్దరూ ఒకేసారి రైలు నుంచి ఎలా పడిపోయారు? అనే అంశంపై విచారణ జరుపుతున్నారు. బోగీలో ఎవరితోనైనా ఘర్షణ వాతావరణం నెలకొందా? ఎవరైనా పథకం ప్రకారం వారిని రైలు నుంచి కిందకు తోసేశారా? అనే కోణంలో విచారణ చేపట్టామని, పూర్తి వివరాలు దర్యాప్తులో తేలతాయని రైల్వే పోలీసులు తెలిపారు.

వసతిగృహాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - యంత్రాంగం
పశ్చిమగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల వసతిగృహాల్లో విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. మొగల్తూరు మండలం కాళీపట్నం గురుకుల పాఠశాల వసతి గృహంలో విజిలెన్స్ డిఎస్‌పి రజనీ తనిఖీలు చేపట్టారు. రికార్డుల్లో వందమంది విద్యార్థులు ఉన్నట్లు గుర్తించారు. అక్కడ పరిశీలించగా, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని గుర్తించారు. భీమడోలు మండలం పొలసానిపల్లి, చింతలపూడిలో, మొగల్తూరు మండలం వేములదీవి గురుకుల పాఠశాల వసతిగృహాల్లో విజిలెన్స్ అధికారులు బృందాలుగా విడిపోయి ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో విద్యార్థుల సంఖ్యతోపాటు వసతిగృహాల్లో వారికి అందుతున్న సౌకర్యాలు, వారు పడుతున్న ఇబ్బందులను గుర్తించారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేవని, చాలావరకూ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని తనిఖీల్లో గుర్తించామని విజిలెన్స్ డిఎస్‌పి రజని తెలిపారు.

ప్రత్యేకం

కడప-బెంగళూరు రైల్వేలైన్ పూర్తయ్యేనా?

- రెండు బడ్జెట్లలో రూ.175 కోట్లతో సరి
- భూసేకరణ కమిటీల ఏర్పాటులో సర్కారు నిర్లక్ష్యం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి
కడప-బెంగళూరు రైల్వేలైన్ ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడం లేదు. దక్షిణ మధ్య రైల్వే, దక్షిణ, పశ్చిమ రైల్వేజోన్లు 2013 భూసేకరణ చట్టం ప్రకారం కమిటీల ఏర్పాటులో ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. ప్రస్తుతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఆశించిన మేరకు చొరవ చూపకపోవడంతో ఈ ప్రాజెక్టుకు రెండేళ్లుగా అత్తెసరు కేటాయింపులతోనే సరిపెడుతోంది. దీంతో రైల్వేలైన్ల పురోగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారైంది. 2017-18 బడ్జెట్‌లో రూ.175 కోట్లే కేటాయించింది. తాజాగా బడ్జెట్‌లోనూ రూ.175 కోట్లే కేటాయించడాన్ని పరిశీలిస్తే ఇప్పట్లో పూర్తి కావడం కష్టమేనని తెలుస్తోంది. మొదటిదశలో కడప నుంచి పెండ్లిమర్రి వరకు సుమారు 21 కి.మీ. వరకు 10 శాతం రైల్వేలైన్ పనులు పూర్తి చేసి డెమో రైలు ట్రయల్‌రన్ నిర్వహించారు. ఇంకా మిగిలిన 90 శాతం పనుల్ని పూర్తి చేయాల్సి ఉంది. 2018-19 బడ్జెట్లో నవ్యాంధ్ర రాజధానికి రైల్వేలైన్ ఊసే లేకపోవడం విస్మయానికి గురి చేసింది. సరిహద్దు పరిధిలోని కర్నాటక రాజధాని కడప-బెంగళూరు రైల్వేలైన్ పనులకు అత్తెసరు నిధులు కేటాయింపుల నేపథ్యంలో జిల్లావాసుల్లో ఆందోళన నెలకొంది. జిల్లాలోని పెండ్లిమర్రి నుంచి రాయచోటి, వాయల్పాడు, కర్నాటక రాష్ట్రంలోని మాడగట్ట నుంచి కోలార్ వరకు రెండు జోన్ల పరిధిలో భూసేకరణ చేయాల్సి రావడం, రాష్ట్ర ప్రభుత్వం రైల్వేలైన్ పూర్తికి 50 శాతం నిధులు కేటాయింపునకు చురుకుగా ముందుకు రాకపోవడంతో కేంద్రం వీటిపై నిర్లక్ష్యవైఖరిని అవలంభిస్తోంది. 2006లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ హయాంలో 50 శాతం ఖర్చు భరింపునకు రాష్ట్రం సిద్ధంగా ఉందని లేఖ రాయడంతో ఆ సమయంలో రైల్వేలైన్ పట్టాలెక్కింది. ఈ రైల్వేలైన్‌ను పూర్తి చేస్తే వాణిజ్య లావాదేవీలు ఊపందుకునే అవకాశం ఉంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వ్యాపారవర్గాలకు ప్రయాణ సదుపాయాల కొరతను అధిగమించే అవకాశం ఉంది. ఇటీవల రైల్వేబోర్డు ఎంపిలతో సమావేశం నేపథ్యంలో కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి పలుమార్లు ఈ సమస్యను దక్షిణ మధ్య రైల్వే బోర్డు జిఎం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆశించిన ప్రయోజనం లేకుండా పోయింది. నవ్యాంధ్ర రాజధాని విజయవాడ, సరిహద్దు సమీపంలోని కర్నాటక రాజధాని బెంగళూరుకు రైల్వే కనెక్టివిటీ లేకపోవడంతో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ఎండమావిని తలపిస్తోంది.



కడప- బెంగుళూరు రైల్వేలైన్‌లోని పెండ్లిమర్రి స్టేషన్

సంక్షిప్తం

రింగ్‌రోడ్డుకు నిధులు మంజూరు : నారాయణ

నెల్లూరు సిటీ : శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా రూరల్ మండలం, కోడూరుపాడు గ్రామంలో రింగు రోడ్డు ఏర్పాటుకు తక్షణమే రూ.2.5కోట్లు మంజూరు చేస్తున్నట్లు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. శనివారం ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులతో ఒకటో డివిజన్ కోడూరుపాడులో సుమారు రూ.7.73కోట్లతో రోడ్లు, డ్రెయిన్ తదితర మౌలిక వసతుల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఇప్పటి వరకు 50 ఏళ్లలో ఎప్పుడూ లేనంత విధంగా ఒకే ఏడాదిలో రూ.111కోట్లు సబ్‌ప్లాన్ నిధులతో దళితవాడల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు కేటాయించామన్నారు.

ఏనుగుల దాడిలో వ్యక్తి మృతి

శాంతిపురం: కర్నాటక - ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో రైతు వెంకటేషప్ప (52)ను ఏనుగులు తొక్కి చంపేశాయి. ఈ ఘటన బెల్లకోగిల గ్రామ సమీపంలో తిమ్మకుంట వద్ద శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కర్నాటక రాష్ట్రం జక్కార్‌సకుప్పం గ్రామానికి చెందిన రైతు వెంకటేషప్ప పొలానికి వచ్చాడు. శనివారం కర్నాటక సరిహద్దు ప్రాంతంలోకి తరలి వెళ్లిన ఏనుగులు పంటలతో పాటు రైతు వెంకటేషప్పను తొక్కి చంపేశాయి. అటవీ శాఖాధికారులు అప్రమత్తమై టపాకాయలు పేల్చి ఏనుగులను అడవుల్లోకి తరిమేశారు. అటవీ శాఖ క్షేత్రాధికారి కాళప్పనాయుడు, ఫారెస్టు బీట్ ఆఫీసర్ యుగంధర్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో వృద్ధురాలు సజీవ దహనం

కొత్తూరు: శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం పారాపురంలో శుక్రవారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో ఆ గ్రామానికి చెందిన ఆర్.శాంతమ్మ(90) సజీవ దహనమైంది. ఈ ప్రమాదంలో ఐదు పూరిళ్ల అగ్నికి ఆహుతయ్యాయి.

సంపాదకీయం

ప్రతి చిన్నారీ బతకాలి!

'నవ మాసములు భోజనము నీరమెరుగక/ పయనించు పురిటింటి బాటసారి/ చిక్కు చీకటి చిమ్ము జానెడు పొట్టలో/ నిద్రించి లేచిన నిర్గుణుండు/ నను చెక్కిళుల బోసినోటి నవ్వులలోన/ ముద్దులు చిత్రించు మోహనుండు' అంటాడు కవికోకిల జాషువా. నవజాత శిశువు గురించి ఆయన రాసిన పద్య పాదాలలోకి మనసు అప్రమేయంగా జొరబడిపోతుంది. మానవ ప్రయాణంలో భద్రతకు అత్యంత భరోసాయైన తల్లిగర్భంలోకి ప్రవేశిస్తుంది. అతి దారుణమైన నిర్లక్ష్యానికి గురయ్యే పసిపాపల హృదయఘోష విన్నప్పుడో, కన్నప్పుడో 'అక్షయంబైన మాత్రుక్షీర మధుదార/ లన్నబుగా తెచ్చుకున్న యతిథీ' అంటూ మదిలోకొచ్చి మనసును మెలిపెడుతుంది. మనసున్న మనిషి కోసం పసి హృదయాల మూగరోధన జాషువా 'శిశువు' కవితాన్వేషణ మనసులను పట్టి పిండుతుంది. బాల్యం ఒక వరం అంటారు. బాల్యం మధురమైనది అంటారు. తల్లి ఒడిలో నిశ్చింతగా గడపాల్సిన శైశవం చావుగీతం ఆలపిస్తోంది. ఘనీభవించిన చీకటి ముద్దగా మారుతోంది. 'ఇక్కడ చెట్టు చిగర్చడానికి భయపడుతుంది/ పువ్వు వికసించడానికి అనుమానిస్తుంది/ పెదవి నవ్వడానికి సంశయిస్తుంది/ అంధత్వం కోసం తపస్సు చేసే/ నా నేత్రాంచలాల ముందు/ ఒక సుందర స్వప్నం మేనకయై నర్తించబోతుంది/ అయినా/ ఇక్కడ బాల్యం/ వధ్యశిల ముందు తలవంచిన మూగజీవం' అన్న కవి శిఖామణి మాటలు మన దేశంలో నవజాత శిశువుల దుస్థితికి అద్దం పడుతున్నది. మనుష ధర్మం ఛిద్రమైన ఈ సమాజంలోకి రావాలంటేనే శిశువు అనుమానిస్తున్నదట. వచ్చినా ఆ పెదవి నవ్వడానికీ సంశయిస్తున్నదట. ఈ లోకంలో జరిగే అకృత్యాలను చూసే ధైర్యం లేక ఆ శిశువు అంధత్వం కోసం తపస్సు చేస్తున్నదని కవి భావన.

నవజాత శిశు మరణాల సంఖ్య ప్రపంచంలోనే మన దేశంలో అత్యధికంగా ఉన్నట్టు యునిసెఫ్ తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఏడాదికి ఆరు లక్షల మంది చిన్నారులకు పుట్టిన 28 రోజులకే నూరేళ్లు నిండుతున్నాయి. వీటిలో ఎక్కువ భాగం మరణాలు నివారించగలిగేవి, వైద్యపరంగా చికిత్స చేయగలిగినవేనని యునిసెఫ్ గుర్తించింది. ఈ మరణాల్లో 80శాతం ఎటువంటి తీవ్రమైన కారణాలతో సంభవించినవి కావట. అయితే... దేశంలో ఐదేళ్లలోపు చిన్నారుల్లో మరణాల రేటు తగ్గిందని ఆ అధ్యయనం పేర్కొంది. 'దేశంలో శిశు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గినప్పటికీ, ప్రతి ఏడాదీ చనిపోతున్న శిశువుల సంఖ్య ఆమోదయోగ్యం కానిది. ప్రతి ఏడాదీ సుమారుగా 6 లక్షల మంది నవజాత మరణాలు భారతదేశంలో సంభవిస్తున్నాయి' అని యునిసెఫ్ తెలిపింది. 'ప్రతి చిన్నారీ బతకాలి' పేరుతో యునిసెఫ్ నిర్వహించిన ఈ అధ్యయనం ఇటీవల విడుదలైంది. 184 దేశాల్లో ప్రతి వెయ్యి జననాల్లో 24.4 మరణాల రేటుతో భారత్ 31వ ర్యాంకులో వుంది. ప్రపంచవ్యాప్తంగా నెలరోజుల లోపు చిన్నారుల్లో మరణాల రేటు ప్రతి వెయ్యిమందిలో 19గా నమోదైనట్టు నివేదిక తెలిపింది. 'చనిపోయిన పసికందుల్లో.. 80 శాతం కంటే ఎక్కువ మంది నెలలు నిండకుండానే పుట్టడం, డెలివరీ సమయంలో సమస్యలు, సెప్సిస్, న్యుమోనియా తదితర అంటువ్యాధులు సోకి మరణించార'నేది యునిసెఫ్ అధ్యయనం. పోషకాహార నివేదిక -2017 ప్రకారం... దేశంలోని 51 శాతం మంది మహిళలు రక్త హీనతతో బాధపడుతున్నారు. ఈ విషయంలోనూ ప్రపంచ దేశాల్లో భారత్ తొలిస్థానాల్లో నిలిచింది. 'జీవించే హక్కు బీజప్రాయంలోనే/ సజీవ సమాధి దృశ్యం .../ గోవులు వర్ధిల్లే గోతంత్ర రాజ్యంలో/ శైశవ గీతం ఇక ఓ శవాల నిట్టూర్పు' అని ఓ కవయిత్రి వాపోయినట్లుగా ఈ శిశు మరణాలు ఆందోళన కలిగించేవే.

మరీ ముఖ్యంగా... నవజాత శిశు మరణాలలో ఆడ శిశు మరణాలు అత్యధికం. ఈ ఆధునిక యుగంలోనూ మన దేశంలో లింగ వివక్షత తొలగలకపోవడం దారుణం. అమ్మ గర్భంలోనూ రక్షణ మృగ్యం. 'మాతృమూర్తి గర్భగోళంలో/ భద్రంగా పెరుగుతున్న నా జాడ తెలిసి/ నన్ను ముక్కముక్కలుగ చేసి/ పెంటకుప్పలో విసిరిన నాడు/ వాడి రాలిపోయిన చిరునవ్వును నేను', 'నేను గండాలు దాటి/ పుట్టి నేలమీద పడగానె/ 'అయ్యా! ఆడబిడ్డా.. అంటూ/ నా వెంట పడి వేధించిన నాడు-/ భయంతో గడ్డకట్టిన చిరునవ్వును నేను' అని తన 'మళ్లీ మళ్లీ పుడతా ఆడదానిగా..' కవితలో డాక్టర్ వాసా ప్రభావతి అంటారు. ప్రతి అమ్మా ఒకప్పటి ఆడశిశువు. ఆమె పుట్టుకలోనే అమ్మ వుంది. ఆమె ఎదుగుదలపై మానవ జాతి ఆధారపడివుంది. ఎన్ని అవమానాలు ఎదురైనా, ఎంత వివక్షతకు గురైనా అన్ని దశలనూ అధిగమించి తన జన్మకు సార్థకత చేకూరుస్తుంది. కాబట్టే ఈ సృష్టి మనగలుగుతోంది. ప్రతి ఆడశిశువు సురక్షితంగా వుండాలన్నా, మానవ సమాజం మమతల పుట్టినిల్లు కావాలన్నా - జన్మించిన ప్రతి ఆడశిశువు జీవించాలి. అలాకాకుండా... ఆ శిశువును పురిట్లోనే చిదిమేస్తే భావి తరానికి ఓ మాతృమూర్తిని దూరం చేసినట్లే. 'పాపం, పుణ్యం, ప్రపంచ మార్గం/ కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలు...' అన్నింటినీ పక్కకు నెట్టి 'ఈలలు వేస్తూ ఎగురుతు పోయే...' అని మహాకవి శ్రీశ్రీ వర్ణించిన అద్భుత శైశవాన్ని చూడగలిగితే.. ఇక్కడ చెట్టు చిగుర్చడానికి భయపడదు. పువ్వు వికసించడానికి అనుమానించదు. పెదవి నవ్వడానికి సంశయించదు.

ఇదీ విషయం



కాషాయపు కళ్ళల్లో
కపట నీతి కురుస్తోంది...
సీమ జనం గుండెల్లో
మరో చిచ్చు పెడుతోంది!

కుక్కలు చింపిన విస్తరి
కావాలట దేశం...
పాలించాల్సిన చేతులు
చేస్తున్నవి మోసం!

- కొల్లూరు వెంకట్

దళితులపై దాడులు - పోలీస్ వైఖరి

విశ్లేషణ



వి శ్రీనివాసరావు

గత కొద్ది నెలలుగా రాష్ట్రంలో దళితులపై దాడులు పెరుగుతున్నాయి. విజయనగరం జిల్లా ముద్దువలస, విశాఖ జిల్లా జెర్రిపోతుల పాలెం, తూర్పు గోదావరి జిల్లా సుధాపాలెం, పశ్చిమ గోదావరి జిల్లా గరగపర్రు, ప్రకాశం జిల్లా దేవరాపల్లి, కర్నూలు జిల్లా నక్కలదిన్నె, చిత్తూరు జిల్లా పచ్చికాపల్లం.. తాజాగా గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు, చిత్తూరు జిల్లా కూరాకులపల్లి ఇలా చెప్పుకుంటూ పోతే చాలా గ్రామాలు మనకు కనిపిస్తాయి. దళితులపై దాడి ఒక సామాజిక సమస్య. దాన్ని లా అండ్ ఆర్డర్ సమస్యగా చూడటంలోనే పోలీసు వ్యవస్థ వైఫల్యం వుంది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రజా ప్రతినిధులు అగ్ర కులాలకు అండగా ఉన్నారు. దాదాపు అన్ని గ్రామాల్లో కూడా సంఘటనలు జరుగుతున్న సమయంలోనే బాధితులు పోలీసులకి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సంఘటన జరుగుతున్న ప్రాంతానికి చేరుకుంటున్న పోలీసులు దాడిని నివారించి బాధితులను రక్షించటానికి బదులుగా వీడియోలు తీస్తూ ప్రేక్షక పాత్ర పోషించారు. ఈ వీడియోలను కూడా పాక్షిక దృక్పథంతో చిత్రీకరిస్తున్నారు. ఎక్కడన్నా దళితులు దాడిని ప్రతిఘటిస్తుంటే దానిని మాత్రమే చూపిస్తూ వారిపై కౌంటర్ కేసులు బుక్ చేస్తున్నారు. లేదంటే తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. ఆ తర్వాత బాధితులను బలవంతపెట్టి రాజీలను కుదిర్చే ప్రయత్నం చేస్తున్నారు.

చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులే పెత్తందార్ల, అధికార పార్టీ వత్తిళ్ళకు లొంగి చట్టాన్ని ధిక్కరించటం ఆందోళనకరమైన విషయం. కొన్ని చోట్ల పోలీసు అధికారులే కుల దురహంకారానికి లోనవుతున్నారు, మరి కొన్ని చోట్ల అవినీతికి పాల్పడి లొంగిపోతున్నారు. ఈ మొత్తం ఘటనల్లో ఒకటి రెండు చోట్ల మాత్రమే నిజాయితీగా చిత్తశుద్ధితో వ్యవహరించారు, బాధితులకు అండగా నిలబడ్డారు. ఈ గ్రామాలన్నింటిలోనూ బాధితుల నుండి పోలీసులపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. తమకు రక్షణ కల్పించటానికి బదులు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి జరిగిన తర్వాత, దాదాపు ప్రతి గ్రామంలో 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30ని ప్రకటిస్తున్నారు. ఊళ్లో నుంచి బాధితులను బయటకు పోనివ్వటంలేదు. ఫిర్యాదు స్వీకరించినా వెంటనే రిజిష్టర్ చేయట్లేదు. వారి మద్దతుదారులను, లాయర్లను కూడా కలుసుకోనివ్వటం లేదు. పెదగొట్టిపాడులో లాయర్ని కలవటానికి వెళుతున్న ఒక యువకుడిని పట్టుకొని నువ్వొక్కడివి పోతే రక్షణ ఉండదని చెప్పి పోలీసు వాహనంలో ఎక్కించుకొని స్థానిక శాసనసభ్యుని ఇంటికి తీసుకుని వెళ్ళి బెదిరించి రాజీ కుదిర్చారు. ఇది దాదాపు పోలీస్ కిడ్నాపింగే! కూరాకులపల్లెలో బాధితురాలిని స్థానిక ఎస్సై మాట్లాడనివ్వలేదు, తన బాధని వ్యక్తం చేయనియ్యలేదు. పైగా రాజీకి ఒప్పుకోకపోతే, మీకే శిక్షలు పడ్తాయని బెదిరించాడు. బాధితుల చేత అగ్ర కుల స్త్రీల కాళ్ళు పట్టించాలని చూశాడు. దాన్ని వాళ్లు తిరస్కరించారు. కాళ్లు పట్టుకున్న తర్వాత వీపుపై చెప్పులతో కొట్టటం అక్కడ ఆనవాయితీ అని ఇప్పుడు చెబుతున్నారు. అలా గతంలో చాలా సార్లు జరిగింది. చట్టాన్ని కాకుండా కుల దురహంకారుల నియమ నిబంధనలనే పోలీసులే అమలు పరుస్తున్నారు. పెదగొట్టిపాడు ఘటనలకు నిరసనగా గుంటూరులో ప్రదర్శనకు వచ్చిన మహిళలను పోలీసులు పేర్లు, అడ్రస్సులు అడిగి భయభ్రాంతులకు గురిచేయాలని చూశారు. దాన్ని ప్రశ్నించినందుకు అరెస్టు చేశారు. పౌరుల వ్యక్తిగత ప్రైవసీకి భంగం కలిగించడం కూడా చట్ట విరుద్ధమే. ఇలాంటి చర్యలు దేనికి దారి తీస్తాయి? ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక చట్టం 2015 చాప్టర్ 4(ఏ) ప్రకారం బాధితులకు, సాక్షులకు హక్కులున్నాయి. పాయింట్ 12 ప్రకారం బాధితులు లేదా వారిపై ఆధారపడినవారు స్వచ్ఛంద సంస్థల, సామాజిక కార్యకర్తల లేదా న్యాయవాదుల సహాయం తీసుకోవచ్చు. కానీ చాలా చోట్ల పోలీసులు దీనిని అనుమతించట్లేదు. ఒంటరిగా భయోత్పాతంతో బతుకుతున్న దళితులను పలకరించి ధైర్యం చెప్పటానికి వెళ్తున్న నాయకులను ముందస్తుగానే అరెస్ట్ చేస్తున్నారు. దాదాపుగా ఎవరూ ఆ గ్రామాలలోకి వెళ్ళకుండా సీజ్ చేస్తున్నారు. మరో వైపు అగ్ర కులాలకు చెందిన నిందితులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. వారిని అరెస్ట్ చేయమన్నా ఖాతరు చేయట్లేదు.

పెదగొట్టిపాడు గ్రామంలో, 'మా ఊరు ప్రశాంతంగా ఉంది పలకరింపులకు ఎవ్వరూ రానక్కరలేదు' అనే బ్యానరును పోలీసులే కట్టారు. ఇందులో గ్రామ ప్రజలంటే ఎవరు? దాడి చేసిన వారా లేక దాడికి గురయినవారా? పోలీసుల దృష్టిలో ఇద్దరూ ఒకటేనా? లేదా గ్రామస్తుల పేరుతో దాడి చేసిన వారి తరపున కట్టారా? పెదగొట్టిపాడు, గరగపర్రు, దేవరాపల్లి గ్రామాలకు పలకరింపుకు వెళ్ళిన నాయకులపై కేసులు పెట్టారు. దళితులను మానసికంగా దెబ్బకొట్టే చర్య ఇది. మరోవైపు అగ్రకులాలకు ఈ చట్టాలేవీ వర్తించడం లేదు. ఇదే చట్టం ప్రకారం సాక్షులకు భద్రత కల్పించాలి. వారి పేర్లు కూడా రహస్యంగా వుంచాలి. వారి సాక్ష్యాన్ని రికార్డు చేయడానికి ప్రయాణ భత్యం ఇవ్వాలి. పోలీసులు దేన్నీ అమలు చేయడం లేదు. ఇలాంటి చర్యల వల్ల శాంతి భద్రతలు అదుపులో వుంటాయని పోలీసులు భ్రమ పడుతున్నారు. పిల్లినైనా నాలుగు గోడల మధ్య బంధించి కొడితే తిరగబడుతుందని సామెత. సామాజిక కార్యకర్తలు వెళ్ళి వారిని చైతన్య పరిస్తే వారి ఆందోళనకు ఒక రూపం వస్తుంది. అది సమస్య పరిష్కారానికి దోహదపడుతుంది. దాన్ని అనుమతించక పోతే అరాచకం ప్రబలుతుంది. పోలీసు చర్యలు దానికి దోహద పడతాయి. నేడు నిరంకుశ రాజ్యాలలో జరుగుతున్నదదే. ఒక రకంగా పోలీసుల వైఖరే శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తోంది. ఇంతవరకు రాష్ట్రంలో బాధితులు తిరగబడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన ఘటన ఒక్కటి కూడా లేదు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్న పెత్తందార్లపై ఏ చర్యలూ లేవు. ఈ ఘటనలన్నింటిలోనూ చట్టవిరుద్ధంగా వ్యవహరించిన ఏ

ప్రజల్లో వచ్చే అసంతృప్తిని ఎలా అణగదొక్కాలి, ఉద్యమాలను ఎలా నీరుగార్చాలి, ఉద్యమకారులను ఎలా ప్రజల నుండి వేరు చేయాలి వంటి విషయాలలో ప్రపంచ బ్యాంకు, అమెరికా సీఐఏ వంటి వారి వద్ద పోలీసులకు శిక్షణను ఇప్పిస్తున్నారు తప్ప, ప్రజలతో ఎలా మెలగాలి, బాధితులకు అండగా ఎలా ఉండాలి, వారికి ధైర్యాన్ని ఎలా ఇవ్వాలి అనే అంశాలు పోలీసులకు పట్టవు... పోలీసు స్టేషన్లను ఆధునీకరించుకుంటే చాలదు. ఆధునిక భావాల్ని కూడా వంటపట్టించుకోవాలి.



ఒక్క పోలీసు అధికారి మీద చర్య తీసుకున్న దాఖలాలు లేవు. ఇక దళితులకు ఏ రకంగా ఆత్మ స్థయిర్యాన్ని కలిగించగలరు? కొన్ని చోట్ల దాడులకు గురయిన దళిత బాధితులకు, దాడి చేసిన పెత్తందార్లకు రాజీ కుదిర్చే బ్రోకరేజీ పని కూడా పోలీసులే చేస్తున్నారు. చిన్న చిన్న తప్పులకు కూడా కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పే పోలీసులు దళితుల విషయంలో భిన్నంగా ప్రవర్తిస్తున్నారు. వారు రాజీకి రాకపోతే ఎదురు కేసులు పెట్టి వేధిస్తున్నారు. దాడి చేసిన వారిని వదిలివేసి దాడికి గురైన వారిని అరెస్టు చేసి జైల్లో పెడుతున్నారు. ఎస్సీఎస్టీ అత్యాచార చట్టం 2015 సెక్షన్ 4 పోలీసుల విధి నిర్వహణ గురించి పేర్కొంటుంది. దాడికి గురైన వారిని వేధించడం చట్టరీత్యా నేరం. ఎదురు కేసులు పెట్టడం దీని కిందకే వస్తుంది. దళితులపై దాడి జరిగిన సందర్భంలో సకాలంలో స్పందించి రక్షణ చర్యలు తీసుకోని పోలీసులు శిక్షార్హులు. సబ్ సెక్షన్ 2 ప్రకారం వారు కూడా ముద్దాయిలే. ఉద్దేశ్యపూర్వకంగా విధి నిర్వహణలో అలక్ష్యం చేసిన అధికారికి ఆరు నెలలు తక్కువ కాకుండా ఏడాది వరకు శిక్ష విధించాలని చట్టం చెబుతుంది. చట్టాలను కఠినతరం చేసినా పోలీసు వ్యవస్థ మౌలిక వైఖరిలో పెద్ద మార్పేమీ లేదు. అందుకే చాలా తక్కువ కేసుల్లోనే శిక్షలు పడుతున్నాయి. అందుకు పోలీసులు సిగ్గుపడాలి.

ఫిబ్రవరి 23వ తేదీ గుంటూరులో సభ జరుపుకోవటానికి పోలీసుల అనుమతి నిరాకరించారు. దీనికి వారు చెప్పిన కారణాలు చాలా హాస్యాస్పదంగా ఉన్నాయి. వారి ప్రకటన చూస్తే దళితులను, దళిత సంఘాలను వారు ఉగ్రవాదుల్లా భావిస్తున్నట్లు కనిపిస్తుంది. సభ జరుపుకునే ప్రాంతం చాలా రద్దీగా ఉంటుందని దాని వలన ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి నగరం స్థంబించిపోతుందని చెప్పారు. ఇదే నిజమయితే గుంటూరులో ఇక ఏ సభ పెట్టుకోవటానికి వీలు లేదు. ఆఖరికి ముఖ్యమంత్రి సభ అయినా సరే. పోలీసులు దీనికి కట్టుబడి ఉంటారో లేదో చూడాలి. రెండవది- నాయకులు ప్రసంగాలతో ప్రజలను రెచ్చగొడతారని, దీని వల్ల శాంతి భద్రతల సమస్య వస్తుందని చెప్పారు. ఈ సభలో పాల్గొనే నాయకులు ఎవరి వల్లనయినా గతంలో అలాంటి సందర్భం ఎదురయ్యుంటే పోలీసులు చెప్పాలి. అయినా, నాయకులు రెచ్చగొడితే ప్రజలు రెచ్చిపోయే పనే అయితే ఈపాటికి విప్లవాలే వచ్చి ఉండాలి. రెచ్చగొడితే ప్రజలు రెచ్చిపోరు. అన్యాయం జరిగితే ఆవేశపడతారు. అన్యాయం జరగకుండా చూస్తే ఆవేశాలు రావు. అన్యాయాన్ని అరికట్టటానికి బదులు అన్యాయం చేసే వారికి పోలీసుల వైఖరి తోడ్పడుతున్నది. ప్రజలు ప్రశ్నించక పోయినా, లేదా వారి చైతన్యాన్ని అణగదొక్కినా అన్యాయం చేసే వారు బలపడతారు. దాని వల్లే చట్టాలకు ప్రమాదం, శాంతి భద్రతలకు ప్రమాదం ఏర్పడుతుంది. అణిచివేతను ప్రశ్నించకుండా ఉంటే ఊళ్ళు ప్రశాంతంగా ఉంటాయని పోలీసుల సిద్ధాంతం. ఇది ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం, ఫ్యూడల్ శక్తులకు ఊతమిచ్చేది. అన్యాయానికి బేడీలు వేసి అరికడితే ప్రజలు సుఖంగా ఉంటారు. శాంతి భద్రతలు అదుపులో ఉంటాయి. ఇది చారిత్రికంగా రుజువయిన సత్యం.

రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం ఎలా కలుగుతోంది? శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ప్రజల సమస్యల్ని పరిష్కరిస్తే అంతా సజావుగా వుంటుంది. దానికి బదులుగా ప్రజల అసమ్మతిని నిర్బంధంతో అణచి వేయాలని చూస్తోంది. దాని వల్లే శాంతి భద్రతల సమస్య తలెత్తుతోంది. అరెస్టులకు నిరసనగా తిరిగి రాష్ట్రమంతా ఆందోళనలు సాగుతున్నాయి. ఇలా సాగి సాగి ప్రజలు అలసిపోతారని వారనుకుంటున్నారు. కాని ప్రజల్లో దాని వల్ల ఇంకా పట్టుదల పెరుగుతోంది. శాంతియుతంగా ఆందోళనలను అనుమతించిన చోట, పోలీసుల జోక్యం తక్కువగా వున్నచోట, సమస్య త్వరగా పరిష్కారమై పరిస్థితి ప్రశాంతంగా వుంటోంది. అన్ని చోట్లా ఇదే అనుభవం. ఇప్పుడు గరగపర్రు, దేవరాపల్లి, పెదగొట్టిపాడు ఇలా ఎక్కడైనా ఆందోళనలపై నిషేధాజ్ఞలు ఎత్తివేసిన చోట ఎక్కడా శాంతి భద్రతల సమస్య తలెత్తలేదు. పోలీసులు నేర్చుకోడానికి ఈ అనుభవాలు చాలవా? ప్రత్యేక హోదా సమస్యపై రాష్ట్ర బంద్‌లో కారణం ఏదైనా పోలీసులు తటస్థంగా వున్నారు. ఏం జరిగింది? ప్రశాంతంగా బంద్ జరిగింది. అదే పోలీసులు విజృంభించి వుంటే శాంతి భద్రతల సమస్య తలెత్తి వుండేది. ఈ అనుభవాల నుండి పాలకులు పాఠం నేర్చుకోరా? దళితులపై జరుగుతున్న దాడుల్లో మన రాష్ట్రం దేశంలో నాలుగవ స్థానంలో ఉంది. అత్యంత వెనుకబడిన ఫ్యూడల్ వ్యవస్థలు బలంగా ఉన్న బీహార్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఉండటంపై పోలీసు వ్యవస్థ ఆత్మ విమర్శ చేసుకోవాలి. కులం పేరుతో సాటి మనుషులపై క్రూరంగా దాడి చేస్తుంటే నవ్యాంధ్రప్రదేశ్ నిర్మించడం సాధ్యమా? అని ప్రశ్నించుకోవాలి. పోలీసు రెవెన్యూ వ్యవస్థ నిష్పక్షపాతంగా వ్యవహరించకుండా దాడికి గురవుతున్న దళితులకు న్యాయం జరగదు. పోలీసు వ్యవస్థ ప్రక్షాళనకు ఉన్నతాధికారులు నడుం కట్టాలి. పోలీసు వ్యవస్థలో పరివర్తన తీసుకురావటానికి ప్రత్యేకమైన శిక్షణను ఇవ్వాలి. ప్రజల్లో వచ్చే అసంతృప్తిని ఎలా అణగదొక్కాలి, ఉద్యమాలను ఎలా నీరుగార్చాలి, ఉద్యమకారులను ఎలా ప్రజల నుండి వేరు చేయాలి వంటి విషయాలలో ప్రపంచ బ్యాంకు, అమెరికా సీఐఏ వంటి వారి వద్ద పోలీసులకు శిక్షణను ఇప్పిస్తున్నారు తప్ప, ప్రజలతో ఎలా మెలగాలి, బాధితులకు అండగా ఎలా ఉండాలి, వారికి ధైర్యాన్ని ఎలా ఇవ్వాలి అనే అంశాలు పోలీసులకు పట్టవు. కాలం మారుతున్నా ఆధునిక శిక్షణ ఇస్తున్నా బ్రిటన్ కాలం నాటి మాన్యువల్ పీడ వదల్లేదు. ఈ స్థితి నుండి పోలీసు వ్యవస్థ బయట పడాలి. పోలీసులకు కూడా విధి విధానాలున్నాయి. ప్రజలతో ఎలా మెలగాలో కూడా మాన్యువల్స్ పేర్కొంటున్నాయి, పోలీసులకు అధికారాలు మాత్రమే కాదు బాధ్యతలు కూడా ఉన్నాయి. పోలీసు స్టేషన్లను ఆధునీకరించుకుంటే చాలదు. ఆధునిక భావాల్ని కూడా వంటపట్టించుకోవాలి. ప్రజా ఉద్యమాలతో పుట్టుకొస్తున్న నూతన చైతన్యమైనా వారిలో మార్పు తెస్తుందేమో చూడాలి.

(రచయిత సిపిఎం కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు)

జన వాక్యం

ఆరోపణలు తగదు

ఈ మధ్య రాజకీయ నాయకుల ఆరోపణలు, వ్యాఖ్యలు హుందాతనం వీడి, బాధ్యతా రహితంగా వుంటున్నాయి. చట్టసభల సాక్షిగా ఒకరిపై ఒకరు బహిరంగ నిందారోపణలు చేసుకోవడం సర్వసాధారణం. అయితే ప్రస్తుతం అవి శృతిమించుతున్నాయి. నాయకులను దాటి అధికారుల వరకు కొనసాగుతున్నాయి. వాస్తవికాంశాలను వదిలేసి వ్యక్తిగత ఆరోపణలు, దూషణలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ విధంగా చేయడం వల్ల సదరు నాయకులపై, వారి పార్టీలపై ప్రజలకు ఏవగింపు కలగక మానదు. అంతేకాక ఆ అధికారులపై ప్రజల్లో తీవ్రస్థాయి వ్యతిరేకత ఏర్పడే ప్రమాదముంది. అందుకే నాయకులు ఆచితూచి మాట్లాడటం మంచిది.

టి సురేష్, మెయిల్ ద్వారా

విశ్వాసం కల్పించాలి

మనకు తలపోటు వస్తే మందు వేసుకుంటాం. దాని ద్వారా నొప్పిని పోగొట్టుకోవడానికి ప్రయత్నిస్తాం. అంతేకాని వ్యాధిని మరింత ఎక్కువ చేసుకోం. కానీ కాశ్మీర్ విషయంలో కేంద్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. వాస్తవానికి మోడీ అధికారంలోకొచ్చిన దగ్గర నుండి కాశ్మీర్లో హింస పెరిగిపోయింది. ఉగ్రవాదుల దాడుల్లో మన సైనికులు ఎంతో మంది మరణిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడి ప్రజలు తీవ్ర ఆందోళనలో వున్నారు. అభద్రతలో జీవిస్తున్నారు. వారికి భరోసా ఇవ్వాల్సింది పాలకులే. కాశ్మీర్ ప్రశాంతతను కాపాడాల్సింది ప్రభుత్వాలే. అటువంటి విశ్వాసం నింపితేనే కాశ్మీర్ అల్లర్లు సద్దుమణుగుతాయేమో! కానీ కేంద్రం ఆ దిశగా ప్రయత్నిస్తున్నట్లుగా కనబడటం లేదు. ఇప్పటికైనా ఈ ధోరణికి స్వస్తి పలికి కాశ్మీర్‌లో శాంతి భద్రతలను కాపాడాలి.

రావు కొల్లాబత్తుల, కాకినాడ.

భయం నీడలో పరీక్షల పరుగు!



కంచల జయరాజ్

పరీక్షల సీజన్ ఆరంభమైంది. విద్యార్థులనూ వారి తల్లిదండ్రులనూ ఆందోళనకు దించేందుకు ప్రభుత్వం శతవిధాలుగా ప్రయత్నిస్తోంది. ప్రశాంతంగా పరీక్షలు రాయించే చర్యలు కాకుండా, విద్యార్థుల్ని గందరగోళంలోకి నెట్టే చర్యలు చేపట్టేలా విద్యాశాఖ విధానాలు ఉంటున్నాయి. ఏడాది అంతా నిర్లక్ష్యం వహించిన విద్యాశాఖా మంత్రి, ఉన్నతాధికారులు పరీక్షల సమయంలో కొత్త విధానాలు అంటూ ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి కూడా వీలు లేని వాతావరణం కల్పిస్తున్నారు. కార్పొరేట్ శక్తుల ఆగడాలను మరింత ప్రోత్సహించడానికి తప్ప విద్యాశాఖ తీసుకునే చర్యల వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. విద్యాశాఖ గతంతో పోలిస్తే ఇటీవల కాలంలో అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ విద్యా సంస్థల్ని పరిరక్షించే విషయంలో అవలంబించే విధానాలు తీవ్ర విమర్శలకు తావిస్తున్నాయి. నిండు ప్రాణాలు బలవుతున్నా.... యథేచ్ఛగా కార్పొరేట్ విద్యాసంస్థలు దండుకుంటున్నా.. పేదలకు పాఠాలు చెప్పే విద్యా సంస్థలు మూతపడుతున్నా.. వేటినీ విద్యాశాఖ సీరియస్‌గా తీసుకోవడం లేదు. గ్రేడింగ్, జంబ్లింగ్ విధానాలతో ఏడాదికో కొత్త పల్లవి అందుకుంటూ విద్యార్థులతో ఆడుకుంటోంది. విద్యాశాఖలో చేయాల్సిన సంస్కరణలను విస్మరించి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ప్రయోగాలు చేస్తోంది. ఏడాదంతా నిశ్చేష్టంగా ఉండి, పరీక్షల సమయంలో మాత్రం పని చేస్తుంది అనిపించుకోవాలనే ప్రయోగాలకు సిద్ధపడుతోంది. స్థాయికి మించిన సిలబస్‌లు రేయింబవళ్లు చదువులు, అరకొర సౌకర్యాలు, నైపుణ్యం లేని అధ్యాపకులు, జైళ్లను తలపించే హాస్టళ్ల మధ్య పసి హృదయాలు తల్లడిల్లిపోతున్నాయి. తరగతి గదిలో చదివిన చదువుకూ, పరీక్ష హాలులో రాసే దానికీ ఎలాంటి సంబంధం ఉండటం లేదు. చదివేటప్పుడు భయపడుతూ, పరీక్ష రాసేటప్పుడు భయపడుతూ నిత్యం భయం నీడలోనే బతకాల్సిన విపత్కర పరిస్థితులు కల్పిస్తున్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించమనే



సంస్కరణలు తేవడం అంటే సీసీ కెమెరాలు పెట్టడం, జంబ్లింగ్ పెట్టడం, నిమిషం ఆలస్యం అయినా పరీక్షకు అనుమతించక పోవడం కాదు. విద్యార్థి మనోవికాసం పెంచేలా, ఐక్యూ స్థాయి ఇనుమడించేలా పరీక్షలు ఉండాలి. పరీక్షల్ని సంతోషంగా రాసే వాతావరణం కల్పించాలి. భయంతో రాసేలా కాదు.

ప్రకటనలు గుప్పిస్తున్నారు. మనకున్న సామాజిక, ఆర్థిక, రవాణా పరిస్థితుల నేపథ్యాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ఈ నిబంధన పెట్టడంలో అర్థం లేదు. ఇవన్నీ విద్యాశాఖ వైఫల్యాలుగానే గుర్తించాలి. విద్యాశాఖలో సంస్కరణలు తీసుకొస్తున్నారంటే జీవితానికి పనికొచ్చే చదువులు చెబుతారని అనుకున్నారు. విద్యార్థుల మానసిక స్థాయిని పెంచే సిలబస్‌ను రూపొందించి విద్యాబుద్ధులు చెబుతారని ఆశించారు. ఆత్మహత్యలు లేని విద్యావిధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తారని భావించారు. కానీ విద్యార్థుల్నే బలిపశువులుగా చేయడానికి సంబంధిత శాఖ పూనుకోవడం విచారకరం.

ప్రయివేటు మోజులో ప్రయోగాలు!

విద్యను కార్పొరేటీకరణ చేసిన ప్రభుత్వం విద్యార్థులకు నిత్యం నరకం చూపిస్తోంది. విద్యపై చేసే ఖర్చును కూడా దండగమారినదిగా భావించే పాలకులు ఉన్నంత కాలం నాణ్యమైన విద్య సామాన్యులకు దూరంగానే జరుగుతుంది. ఫలితంగానే కార్పొరేట్ శక్తులు విచ్చలవిడిగా విద్యను వ్యాపారం చేస్తున్నాయి. ఇపుడు మనకున్న పరీక్షల విధానంపై ఎపుడూ సమీక్ష చేసింది లేదు. మూడు గంటల సమయంలో 100 మార్కులకు సమాధానాలు రాయాలి. అన్నీ ప్రశ్న, సమాధానాలే ఉంటాయి. ఏడాది పాటు చదివిన చదువును మూడు గంటల్లోగా రాసి మార్కులు సంపాదించాలి. వాస్తవానికి ప్రభుత్వ విద్యాసంస్థలు మినహా ప్రయివేటు విద్యాసంస్థల్లో ఎక్కువ శాతం ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యాంశాలను బోధించవు. ఎవరి సిలబస్ వారికి ఉంటుంది. అంతా ఎంసెట్ ఓరియంటేషన్‌లోనే సిలబస్‌ను రూపొందించి చదివించడం ఆనవాయితీ. డిసెంబరు వరకూ ఎంసెట్, ఐఐటి వంటి సిలబస్‌ను చదివి రెండు నెలలు మాత్రమే ప్రభుత్వం నిర్దేశించిన సిలబస్ చదువుతారు. ముఖ్యంగా ఇంగ్లీషు, తెలుగు, సంస్కృతం వంటివి బోధించడం గానీ, చదవడం గానీ ఏమీ ఉండదు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ల్యాబ్‌లు ఉండవు. కానీ 30కి 30 మార్కులు మాత్రం వస్తాయి. దీని గురించి మాట్లాడేవారు ఉండరు. జంబ్లింగ్ పేరిట జరిగే అక్రమాలు, అవినీతి పెరిగిందే తప్ప తగ్గలేదు. జంబ్లింగ్ పెట్టినా ఏ కాలేజీలో కావాలంటే ఆ కాలేజీలో తమ విద్యార్థి ఉండేలా కార్పొరేట్ సంస్థలు చూసుకోగలవు. నూటికి నూరు శాతం మార్కులు వచ్చేలా చూసుకోగలవు. ఇక సంస్కరణలు చేపట్టామని చెప్పడం ఎవరికోసమో అర్థం కాదు. ప్రభుత్వం తీసుకున్న ఎలాంటి చర్య అయినా సామాన్యులకు ఉపయోగపడేలా ఉండాలి. విద్యాశాఖ చేపట్టే సంస్కరణలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే పేద విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండాలి. కానీ ఇపుడు అలా ఉండటం లేదు. ఇది భావితరాలకు తీరని నష్టమే చేస్తుంది.

విద్యా ప్రమాణాలు పతనం!

ప్రభుత్వ విధానాలే విద్యా ప్రమాణాలను పతనం దిశగా తీసుకెళుతున్నాయి. ఇపుడు మొక్కుబడి చదువులు తప్ప, జీవితానికి ఉపయోగపడే చదువులు లేవు. ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ చదివించినా సరే ఆఖరుకు మోడల్ పేపర్లు, ముఖ్యమైన ప్రశ్నలతోనే పరీక్షలకు వెళ్లాల్సి రావడానికి కారణం ఎవరు? ఏప్రిల్‌లో రాయాల్సిన పరీక్షలను ఫిబ్రవరిలోనే జరపడానికి కారణం ఏంటి? ఏడాది పాటు చదివిన చదువును మూడు గంటల్లోనే తేల్చేసే విద్యావిధానం అమలు ఎంతకాలం చేస్తారు? ఐఐటి, ఎంసెట్ ప్రవేశ పరీక్షల్లో మూడు గంటలకు 160 బిట్లకు సమాధానం రాయాల్సి ఉంటుంది. ఇది ఎంతటి తెలివిగలవారికైనా సాధ్యమయ్యే పని కాదు. కానీ విద్యార్థులకు తప్పడం లేదు. ఇంటర్‌లో చేరిన రోజు నుంచే ఐఐటి కోసం రేపే పరీక్ష అన్నట్లుగా 160 బిట్లు రాయించే విధానం అమలు చేస్తున్నారు. దీనివల్ల ఎంతో మంది విద్యార్థులు మానసికంగా కుంగిపోతున్నారు. జాతీయ స్థాయిలో పోటీని తట్టుకోవాలంటే ఇలా చదవాల్సిందే అంటున్నారే తప్ప, దానికి తగిన వాతావరణం, ఆరంభం నుంచీ అమలు చేయడం లేదు. సిబిఎస్‌సి సిలబస్ చదివిన వారికీ, స్టేట్ సిలబస్ చదివిన వారికీ మధ్య చాలా తేడా ఉంటుంది. కానీ అందరినీ ఒకే గాటన కట్టేసి రుబ్బేయడం విద్యాసంస్థల్లో ఆనవాయితీ అయ్యింది. ముందుగా పరీక్షలు పెట్టడం, సెలవులు లేకుండా రుబ్బేయడం, హడావుడిగా ఫలితాలు ఇచ్చేయడం వల్ల ఏదో సాధించామని విద్యాశాఖ సంబర పడుతోంది. కానీ ఇది మంచి విధానం కాదు. ఏప్రిల్‌లో పరీక్షలు పెట్టి, జూన్‌లో విద్యాసంస్థలు తెరచి, దసరా, సంక్రాంతికి, వేసవి సెలవులు ఇచ్చే విధానానికి ఏనాడో స్వస్తి పలికారు. ఇపుడంతా యాంత్రిక విద్యాబోధన, బలవంతపు తరగతులు జరుగుతున్నాయి. దీనివల్ల విద్యార్థులకు మార్కులు వస్తాయేమో గానీ, విజ్ఞానం రాదు. జీవితానికి ఉపయోగపడే లక్షణాలు అలవడవు. సంస్కరణలు తేవడం అంటే సీసీ కెమెరాలు పెట్టడం, జంబ్లింగ్ పెట్టడం, నిమిషం ఆలస్యం అయినా పరీక్షకు అనుమతించక పోవడం కాదు. విద్యార్థి మనోవికాసం పెంచేలా, ఐక్యూ స్థాయి ఇనుమడించేలా పరీక్షలు ఉండాలి. పరీక్షల్ని సంతోషంగా రాసే వాతావరణం కల్పించాలి. భయంతో రాసేలా కాదు. ఈమాత్రం సంస్కరణలు తేలేని విద్యాశాఖ ఉండి ఉపయోగం ఏంటి?

(రచయిత 10 టీవీ, డిప్యూటీ ఇన్‌పుట్ ఎడిటర్, సెల్ : 8498084059)

jeevanapageps@gmail.com





కొందరు అంతే.. వారు నడుస్తున్న దారిలో.. రెల్లుగడ్డి సైతం విచ్చుకుని.. కాసిన్ని మల్లెలు పూచేలా చేస్తారు. అలా వారు ప్రయాణించే దారిలో ఏదో మహత్తర ఆశయం దాగి ఉంటేనే.. ఆ పూలు మరికొందరికోసం పరిమళిస్తాయి. ఆనక.. ఇంకొందరి గొంతులో చేరి.. జనగీతమై పలకరిస్తాయి. ఇంకా ఇంకా.. విచ్చుకొంటూ గొంతెత్తి విరుచుకుపడే పాటలవుతాయి. అలాంటి పాటల బాటే జగన్. ప్రజాఉద్యమాలతో ఏమాత్రం పరిచయం ఉన్నా.. జగన్ పాటల విరుపు గురించి ప్రత్యేకించి పరిచయం అక్కరలేదు. జగన్ పాట అంటే ప్రజానాట్యమండలిలో జగమెరిగిన పాట. దశాబ్దాలుగా పెళపెళమంటూ.. సాగుతున్న పాట. అరవై ఏళ్ళ వొడిలోనే.. అంతే వాడిగా, వేడిగా రగులుతున్న పాట. జగన్ అలియాస్ ఆకురాతి జగన్మోహనరావు పాట వెనుక ఉన్న కథలో తెలుసుకోదగ్గ ఉత్సాహపు సవ్వడులు చాలానే ఉన్నాయి. పదండి డప్పు దరువు సాక్షిగా అరవై ఎనిమిదేళ్ళ పడుచుకుర్రాడైన జగన్ పాటను పలకరిద్దాం!!

జనం మెచ్చిన జగన్ పాట



ఎర్రజెండా రెపరెపలాడిన ఏ క్షణమైనా అతడి పాట.. ఒక సెలయేరవుతుంది. వ్యవస్థీకృత లోపాలను ఎత్తిచూపే ప్రశ్నగా.. అణగారినవర్గపు వాణిగా, చైతన్యంగా.. గొంతెత్తి నినదిస్తుంది. అది నాలుగురోడ్ల కూడలైనా.. లక్షలాది జనసమూహపు వేదికైనా.. ఆ పాట.. ఉవ్వెత్తున ఎగసిపడాల్సిందే. అతడిపాటలో బక్కచిక్కిన రైతుంటాడు. అతడి పాటలో దగాపడ్డ అక్కలు, చెల్లెమ్మలూ కనపడతారు.. అతడి పాటలో దళితవాడలు ఉంటాయి. అతడి పాటలో పాలక నియంతృత్వపు పోకడల్ని ఎండగట్టే కరదీపికలూ ఉంటాయి. మొత్తంగా అతడిపాట ఎర్రని జెండా ఎత్తుకున్న జనం గొంతుక. అందుకే అతగాడు జనం పాటయ్యాడు. ప్రజానాట్యమండలి జగన్ అయ్యాడు.

ఇదీ.. జగన్ పాటకథ

ముందే చెప్పుకున్నట్టు.. జగన్ పాటగాడు. ఈ రోజుల్లో పాటంటే సినిమా పాట. రియాల్టీషోల్లో మాత్రమే కనిపించే, వినిపించే పాట. సెలబ్రిటీ స్టేటస్‌తో.. జిగేల్‌మనేదే పాట. విమానాల్లో విదేశాలు తిరుగుతూ డాలర్లు తెచ్చిపెట్టేదే పాట... అని కొందరి నమ్మకం. కానీ కొందరి పాట అలా ఉండదు.



వందనాలివి నీకు.. ఓఎర్రజెండా!
ఎగరాలీ నీవెపుడు మా కలలు పండా!!

అంటూ.. అతి సామాన్యంగా ఎక్కడో.. ఒకచోట వినపడుతుంది. వాణిజ్య సముదాయాల్లో కనపడకుండా కావాలనే తప్పించుకుని తిరుగుతుంది. కానీ, జనం ఘోష వింటే మాత్రం.. ఎక్కడున్నా.. డప్పుకొట్టి మరీ.. చెలరేగిపోతుంది. అలరిస్తుంది. ఆవేశపడుతుంది. విన్నవాళ్ళనూ అంతే ఆవేశపడేలా చేస్తుంది. కన్నీరు పెట్టిస్తుంది. చాలారోజులు మనల్ని వెంటాడేలా చేస్తుంది. అలాంటి పాటతోనే గత అరవై ఏళ్ళుగా సావాసం చేస్తున్నాడు జగన్. అదెలా సాధ్యమయ్యా.. అసలు నీ పాటల కథేంటీ అన్నప్పుడు.. చెప్తా .. అంటూ చూపుడు వేలు గుండ్రంగా తిప్పుతూ..గతంలోకి తొంగిచూస్తాడు... పాట కోసమే పుట్టిన ఓ చిన్నపిల్లాడిలా.. అప్పుడెప్పుడో తిరిగిన గతుకుల రోడ్లను వెతుక్కుంటూ.. ఎంతో ఉత్సాహంగా.

దివిసీమలో పుట్టి

'నేను 1950 దివిసీమలోని కాజాలో పుట్టాను. నాన్న పేరు తులసీదాస్.. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో చురుగ్గా ఉండేవారు. తెలంగాణా సాయుధ పోరాట సమయంలో కొరియర్‌గానూ పనిచేశారాయన. ఆలాంటి నేపథ్యంలో కళాకారుల దళాలు మా ఇంటికి



వస్తూపోతుండేవి. అప్పట్లో ప్రజాపోరాట నేపథ్యంగల ఏ సందర్భం వచ్చినా.. బుర్రకథ గానాలే ఎక్కువగా ప్రదర్శించేవారు. ముఖ్యంగా ప్రజాకళాకారులు వీధినాటకాలు, బుర్రకథలు ఆసరాగానే జనాల్లోకి వెళ్ళేవారు. అలా నాన్న సాన్నిహిత్యంలో అవన్నీ చూస్తూ పెరిగిన నేను.. పన్నెండో సంవత్సరంలోనే గురువు లేకుండానే, వినికిడి జ్ఞానంతో నాకు నేను స్వయంగా బుర్రకథలు చెప్పేలా నేర్చేసుకున్నాను. నేను తొలిసారిగా చెప్పింది 'అల్లూరి సీతారామరాజు' బుర్రకథ. అప్పట్లో మాఊరు పేరుతో 'కాజా బుర్రకథ దళం' అంటే తెలుగు రాష్ట్రాల్లో పెద్దపేరు. పెద్దదళానికి సమాంతరంగా మా వయసు పిల్లలమూ ఓ దళంగా ఏర్పడి.. కథలు చెప్పేవాళ్ళం. ఆ సమయంలో ఉద్యమాల కారణంగా అరెస్టుల భయంతో పెద్దదళంలోని ప్రధాన కళాకారుడు అజ్ఞాతంలోకి వెళ్ళిపోవడంతో.. ఆపద్ధర్మంగా నాతో కథలు చెప్పించేవారు. అలా.. బుర్రకథ అనేది.. నా కళా జీవితంలో ఓ మైలురాయిలా నిలిచిపోయింది. 'కాజా బుర్రకథ దళం'లో ప్రధాన కథకుడిగా తిరగని ఊరులేదు. అలా దాదాపు నాలుగవేల బుర్రకథ ప్రదర్శనలు చేశాను' అంటూ తానెలా కళాకారుడిగా మారిందీ.. కథలు కథలుగా చెప్పుకొచ్చారు జగన్.



'బుర్రకథ అనేది ఓ కథాగానం.. వర్తమాన అంశాలని సైతం.. అప్పటికప్పుడు అల్లుకోగల సౌలభ్యం ఉంది. అందువల్ల.. అప్పటికప్పుడు.. నాటి సామాజిక పరిస్థితులు, పార్టీ ఆశయ, సిద్ధాంతాలకు అనుగుణంగా జనాల్లోకి మా బుర్రకథలు వెళ్ళేవి. ప్రగతిశీల వస్తునేపథ్యంతో మా 'కాజా బుర్రకథ దళం' ప్రదర్శనలు చేస్తున్నాగానీ.. సంప్రదాయ పందిళ్ళలోనూ మమ్మల్ని ఆహ్వానించి.. ప్రదర్శనలు చేయమని కోరేవారు. ఎక్కడైనా.. జనాన్ని చైతన్యవంతుల్ని చేయడమే.. లక్ష్యంగా మా కథలు సాగేవి' అంటూ అప్పటి రోజుల్ని గుర్తుచేసుకున్నారు జగన్.



కథై, పాటై.. గానమై!

'స్వతహాగా బుర్రకథ కళాకారుడిని. వేల ప్రదర్శనల అనుభవం. ఇలా జనప్రవంతిలో ప్రజాకళాకారుడిగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం.. పెద్దల నుంచి అనేక విషయాలు నేర్చుకోవడం.. తెలియంది తెలుసుకుంటూ వెళుతున్న క్రమంలో 1990లో పూర్తికాలం కార్యకర్తగా తీసుకున్నారు. బుర్రకథకు గానమే ఆయువుపట్టు. నా పట్టు పాటనే. దీంతో ప్రజానాట్యమండలి శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా పాటలు, ఇతర కళారూపాలపై శ్రద్ధ పెట్టాల్సి వచ్చింది. అలా నాటి బుర్రకథాగాన అనుభవం.. అనివార్యంగా పాటై.. విస్తరించిన గానమై, జనచైతన్యగీతమై.. నాలో ఇమిడిపోయింది. ఇలా కాలక్రమంలో ప్రజానాట్యమండలి.. నాకొక చిరునామాగా మారిపోయింది. నా పూర్తిపేరు జగన్మోహనరావు.. అయినా.. 'ప్రజానాట్యమండలి జగన్' అనే జనాలు పిలుస్తారు. నన్ను ఇప్పటిదాకా పూర్తి పేరుతో పిలిచింది మానాన్న ఒక్కడే" అంటూ



ప్రజానాట్యమండలితోగల సుదీర్ఘమైన అనుబంధాన్ని, ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటారు జగన్.

'ఏమయ్యా.. పాటలు అదరగొట్టేస్తున్నావ్.. సినిమాల్లో పాడతావా?" అని తెలిసిన సినిమావాళ్ళు అడిగినా.. అంతే వినయంగా.. "నాకు సినిమాల్లో పాడ్డం కంటే.. జనాల్లో పాడితేనే కిక్కుసార్..!" అంటూ అందివచ్చిన వాణిజ్యపరమైన అవకాశాలను సున్నితంగా వదలుకున్న సందర్భాలూ ఉన్నాయి. నిజమే.. జనంకోసం పాడే పాటలో.. ఏదో అనుబంధం ఉంటుంది. ఆ అనుబంధం పెనవేసుకుపోయాక జీవితకాలమంతా ఆ బంధం కొనసాగాల్సిందే. అలా కొనసాగబట్టే తనపాట చాలామందినీ పాటల జగత్తులోకి దింపింది. ఆయన బాటను, పాటను అనుసరించేలా చేసింది. ఎంతోమంది శిష్యగణాన్ని తయారుచేసింది.

ఎర్రని పాటతో జగన్‌ది విరామమెరుగని ప్రయాణం. పాటకోసం ఆకలి పస్తుల్ని సైతం కళ్ళల్లో కనిపించకుండా.. జనాల్లోకి పరుగెత్తిన సందర్భాలూ ఉన్నాయి. అవన్నీ మరచిపోయేలా చేసిన తృప్తికర సందర్భాలూ ఉన్నాయి. జగన్ అంటే నిన్నటి తరంనాటి పాట.. ఇప్పటికీ నిత్యనూతనమై మారుమోగుతున్న పాట. అరవైఏళ్ళు దాటినా.. ఎలాంటి వణుకూ గొంతులో కనపడని పాట. ఇదీ జగన్ పాట అనే ముద్ర కలిగిన పాట.. జనం మెచ్చే పాట.

సంభాషణ : గంగాధర్ వీర్ల

అన్నమయ్య.. జనంపాట

అన్నమయ్య కీర్తనల్లో భక్తిరసమే కాదు.. సమసమాజం కోసం పరితపించిన సంకీర్తనలూ ఉన్నాయి. అవన్నీ.. మతాలకు అతీతంగా పాడుకుంటే తప్పులేదు. అందుకే ప్రజానాట్యమండలి నిర్వహణలో ప్రస్తుతం తిరుపతిలో 'అన్నమయ్య జానపద విజ్ఞాన కళాపీఠం' అనే పేరుతో వృత్తికళాకారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. వృత్తి, ఔత్సాహిక కళాకారులు, అలాగే చెక్కభజన, కోలాటం వంటి కళల్ని మరింత మెరుగు పరచుకునేలా, కళాకారుల్ని తీర్చిదిద్దడం ఈ శిక్షణా శిబిరాల ముఖ్య ఉద్దేశ్యం. దీంతో మరుగున పడిపోతున్న చెక్కభజన, కోలాటం వంటి అనేక జానపద కళారూపాలకు ఎక్కడో ఒకచోట ఉపాధి అవకాశాలు దొరుకుతాయి.

\- జగన్

ఫోన్: 9705750825

జీవన సౌరభం

మనసు చెప్పినట్టు మనం వినడం కాదు.. మనం చెప్పినట్టు మనసు వినేలా చేసుకోవాలి.

మీ కోసం

గోళ్ళు పెలుసుబారి, విరిగిపోతున్నప్పుడు రాత్రి నిద్రపోయే ముందు కొంచెం నువ్వులనూనె రాసుకుంటే ఫలితం ఉంటుంది.





జీవన చిత్రం

ఫొటో : రమణ

ఆమె.. ఒక స్ఫూర్తి!



జీవితంలో కష్టాలు, ఒడుదుడుకులనేవి సహజం. వాటన్నింటినీ అధిగమిస్తేనే అది పరిపూర్ణ జీవితం అవుతుంది. కొంతమంది చిన్న చిన్న విషయాలకే భయపడి వారి జీవితాలను అర్ధాంతరంగా ముగిస్తుంటారు. మరికొందరు ఎన్ని కష్టాలు ఎదురైనా వాటితో పోటీపడి గెలిచి మరీ జీవితాన్ని ఆస్వాదిస్తుంటారు. ఎందరికో ప్రేరణగా నిలుస్తారు. అలాంటివారిలో ఒకరైన మాల్వికా అయ్యర్ గురించే మనమిప్పుడు మాట్లాడుకుంటున్నాం. తన ఆత్మస్థయిర్యంతో ఎందరికో ప్రేరణగా నిలుస్తున్న ఆమె జీవితం గురించి తెలుసుకుందాం!

తమిళనాడులోని కుంభకోణంలో పుట్టారు మాల్వికా అయ్యర్. ప్రస్తుతం ఆమె వయసు 28 సంవత్సరాలు. ఓ ప్రమాదంలో తన రెండుచేతులనూ పోగొట్టుకున్నారు. ప్రమాదం జరిగేనాటికి ఆమె వయస్సు 13ఏళ్లు. ఇంటికి దగ్గరలోని గ్యారెజ్ దగ్గర ఆడుకుంటుంటే పక్కనే ఉన్న మందుగుండు ఫ్యాక్టరీ నుంచి ఓ గ్రనైడ్ వచ్చి పడింది. దానిని తెలియక పట్టుకుంది. అది ఒక్కసారిగా పేలిపోయింది. ఆ ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఆమెను హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్లు ఆమెను ప్రాణాలతో బతికించారుగానీ, తన రెండు చేతులనూ కోల్పోయింది. కాళ్లకూ గాయాలయ్యాయి. మొదటి ఆరునెలలు వీల్‌ఛైర్‌కే పరిమితమైంది. నడిచేందుకు వీలుగా మొదట్లో ఐరన్ రాడ్లు పెట్టారు. 18 నెలలు హాస్పటల్‌లోనే గడిపింది. సర్జరీ చేశారు. సర్జరీ తర్వాత నడవడం ప్రారంభించింది. ప్రొస్తెటిక్ చేతుల సహాయంతో తన పనులు తనే చేసుకోవడం ప్రారంభించింది. స్నేహితులు పదో తరగతి పరీక్షల కోసం సిద్ధమవుతున్నారని తెలుసుకుంది. తనూ పరీక్షలకు హాజరవ్వాలని నిర్ణయించుకుని, చదవడం మొదలుపెట్టింది. ఎంతో కష్టపడి చదివింది. ఓ రైటర్ సహాయంతో బోర్డుఎగ్జామ్స్ రాసింది. ఆమె రాష్ట్రస్థాయి ర్యాంకర్ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇది ఆమె మొదటి విజయం. అప్పటినుంచి ఇక ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. అర్థశాస్త్రంలో గ్రాడ్యుయేషన్ చేసింది. దాని తర్వాత సోషల్‌వర్క్‌లో మాస్టర్స్ పూర్తిచేసింది. "మొదట్లో ఎప్పుడూ నన్ను నేను కవర్ చేసుకోని ఉండేదాన్ని. నాకు జరిగిన ప్రమాదం గురించి ఎవరితోనూ మాట్లాడేదాన్ని కాదు. నా కుటుంబం నాకు అండగా ఉంది. వారు నాపై నమ్మకం ఉంచారు. నా ప్రతి విజయాన్నీ వారు సెలబ్రేట్ చేసుకున్నారు. వారిని చూశాక నాలో మరింత ధైర్యం వచ్చింది. నేను నాలానే ఉండాలని నిర్ణయించుకున్నా" అని అంటున్నారు మాల్వికా.

మొదట్లో ఆమె ఓ కథక్ నర్తకి. కానీ, ఇప్పుడు అంత బాగా డ్యాన్స్ చేయలేదు. ఎందుకంటే, డ్యాన్సులో చేతులతో మూమెంట్స్ ఎక్కువగా ఉంటాయి. మొదట్లో టైపింగ్ బాగా చేసేది. కానీ, ఇప్పుడు చేయడం లేదు. ఫ్యాషన్ డిజైనర్ అవ్వాలని కలలు కనింది. ఒక్కొక్కసారి వీటన్నింటినీ తలుచుకుని చాలా బాధపడేది. కానీ, తనకు తాను ధైర్యం చెప్పుకునేది. ఇప్పుడు తనకు చేయడానికి వీలయ్యేవాటినే తన ఫ్యాషన్‌గా మలుచుకుంది. అలా వికలాంగుల గురించి చాలా పరిశోధించింది. ఏ వికలాంగునికీ ఎదుటివారు వారు దయతో చూడడం ఇష్టపడరని అంటారామె. 2012లో ఫేస్‌బుక్ పేజ్‌లో తనగురించి ఓ పోస్ట్ చేసింది. అప్పట్లో ఆ వీడియో చాలా వైరల్ అయ్యింది. దాని తర్వాత టెడ్ఎక్స్ టాక్ షోలో మాట్లాడారు.

అలా ప్రాచుర్యంలోకి వచ్చిన మాల్వికకు యూనెటెడ్ నేషన్ హెడ్‌క్వార్టర్స్‌లో మాట్లాడమని ఆహ్వానం అందింది. అలా ఆమె ప్రపంచంలో ఇప్పటికి 300లకుపైగా ఉపన్యాసాలు ఇచ్చారు. వరల్డ్ ఎకనామిక్స్ ఫోరమ్‌లో ఇండియా ఎకనామిక్ సమిట్ భాగంగా మాట్లాడారు. అన్నింటినీ అధిగమించి ఎందరికో ప్రేరణగా నిలుస్తున్నారు. వికలాంగులపై వారికి ఉన్న ఆలోచనను మార్చేందుకు నిత్యం కృషి చేస్తున్నారు. "ఆత్మవిశ్వాసం మన వెంటే ఉంటే.. ఎన్ని ఆటంకాలు వచ్చినా ధైర్యంగా నిలబడగలుగుతాం" అని అంటూ ఆచరణలో నిరూపించారు మాల్వికా. ★



తెలుగులో 'మనీ ట్యాప్'

హైదరాబాద్ : యాప్ ఆధారిత క్రెడిట్ లైన్ 'మనీ ట్యాప్' ను తెలుగులో ఆవిష్కరిస్తున్నట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో హైదరాబాద్, సికింద్రాబాద్, విశాఖపట్నం, విజయవాడ ప్రాంత వాసుల కోసం ఈ సౌలభ్యం అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లో తమ సత్తా చాటాలన్న ప్రణాళికల్లో భాగంగా ఈ చర్య తీసుకున్నట్లు వెల్లడించింది. దేశ వ్యాప్తంగా రూ.300 కోట్ల రుణాలు మంజూరు చేయాలని నిర్దేశించుకున్నట్లు పేర్కొంది.

ముగిసిన బయో ఏసియా..

హైదరాబాద్‌లో మూడు రోజులు పాటు జరిగిన 15వ ఎడిషన్ బయో ఏసియా 2018 సదస్సు శనివారంతో ముగిసింది. చివరి రోజు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభూ, తెలంగాణ ఐటి శాఖ మంత్రి కె తారక రామారావు పాల్గొని మాట్లాడారు. దీనికి 52 దేశాల నుంచి 1,757 మంది ప్రతినిధులు, 100 మంది కార్పొరేట్లు హాజరయ్యారు.



'ఎంజిఎంఐ' ఫౌండేషన్ డే..

మైనింగ్, జియోలాజికల్ అండ్ మెట్రోలాజికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎంజిఎంఐ) శనివారం హైదరాబాద్‌లో 16వ ఫౌండేషన్ లెక్షర్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో ఐఐసిటి డైరెక్టర్ ఎస్ చంద్ర శేఖర్, ఎన్ఎండిసి డైరెక్టర్లు ఎన్‌కె నందా, పికె సత్‌పతి మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందు నుంచి ఎంజిఎంఐ గనుల రంగంలో వినీసీ సేవలందిస్తుందన్నారు.



బ్యాంకుల ప్రైవేటీకరణ
సులభం కాదు

- పిఎన్‌బి స్కామ్‌లో నియంత్రణ సంస్థలు విఫలం
- మంత్రి అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించడం అంత సులభం కాదని ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. అదే విధంగా బ్యాంకులకు అప్పులు ఎగవేసిన వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చ రించారు. పిఎన్‌బి కుంభకోణాన్ని గుర్తించ డంలో బ్యాంకింగ్, నియంత్రణ సంస్థలు విఫలం అయ్యాయన్నారు. పిఎస్‌బిలను ప్రైవేటి కరించాలంటే రాజకీయ మద్దతుతో పాటు చట్టాల్లో మార్పులు అవసరం అన్నారు. ఎకనామిక్స్ టైమ్స్ శనివారం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో మంత్రి మాట్లాడుతూ పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ అక్రమ లావాదేవీలు చోటు చేసుకున్న తర్వాత చాలా మంది బ్యాంకుల ప్రయివేటీకరణపై మాట్లాడుతున్నారన్నారు. కాని బ్యాంకుల ప్రైవేటీకరణ చాలా పెద్ద సవాల్‌తో కూడుకున్నదని అన్నారు. ఈ చర్యకు రాజకీయ మద్దతు లభించదని, దీంతో ప్రైవేటీకరణ సాధ్యపడదన్నారు. బ్యాంకు లను దశల వారిగా ప్రయివేటీకరించాలని ఫిక్కీ ప్రెసిడెంట్ రషీద్ షా అన్నారు. తొలుత రెండు, మూడు ప్రభుత్వ విత్త సంస్థలను ఆ విధంగా మార్చాలన్నారు.

ఆడిటర్ల మొక్కుబడి..

పిఎన్‌బిలో చోటు చేసుకున్న కుంభకోణాన్ని గుర్తించడంలో నియంత్రణ సంస్థలు విఫలం అయ్యాయని మంత్రి అన్నారు. గత ఏడు సంవత్సరాలుగా ఒక బ్యాంకులో మోసం జరుగుతుంటే కనీసం ఒక్క ఉద్యోగి కూడా హెచ్చరించ లేదన్నారు. ఆడిటర్లు మొక్కుబడిగా తమ విధులు నిర్వర్తించారని పేర్కొన్నారు. బ్యాంకింగ్ మేనేజ్‌మెంట్ దీనిపై దృష్టి సారించకపోవడం ఆందోళనకు గురి చేస్తోందన్నారు. బ్యాంకులకు రుణాలు ఎగవేసిన వాళ్లను ప్రభుత్వం ఎంతమాత్రం విడిచిపెట్టబోదని పునరుద్ఘాటించారు. ఎగవేతదారులను పట్టుకొని కఠినంగా శిక్షిస్తామన్నారు. మోసాలు జరగకుండా ఎప్పటికప్పుడు బ్యాంకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకులకు రుణాలు ఎగవేసే వారిని కఠినంగా శిక్షించేందుకు అవసరమైతే చట్టంలో కొన్ని మార్పులు చేసేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

మేక్ ఇన్ ఇండియాకు బీటలు

- తయారీలో 87వేల ఉద్యోగాలు ఫట్
- కీలక రంగాల ప్రగతి అంతంతే..
- లేబర్ బ్యూరో రిపోర్టు వెల్లడి



ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

ప్రధానీ నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మేక్ ఇన్ ఇండియాలో పెద్ద పురోగతి ఏమీ లేదు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది ఉద్యోగాలు సృష్టిస్తున్నామని పదే పదే పేర్కొంటున్న పాలక వర్గాల ప్రకటనలకు భిన్నమైన ఫలితాలు రావడమే ఇందుకు నిదర్శనం. కొత్త ఉద్యోగాల సృష్టి ఏమో కాని ఉన్న ఉద్యోగాలకు భద్రత లేకుండా పోయిందని ప్రభుత్వం తాజాగా వెల్లడించిన ఉపాధి త్రైమాసిక సర్వేలో వెల్లడయ్యింది. దీంతో దేశంలో నిరుద్యోగం భారీగా పెరిగిపోతోందని ఈ గణంకాలతో స్పష్టమవుతోంది. 2017 ఏప్రిల్ నుంచి జూన్ కాలంలో ఎనిమిది కీలక రంగాల్లో నికరంగా 64,000 ఉద్యోగాలు వచ్చాయి. అయితే ఇంతకంటే ఆందోళన చెందాల్సిన అంశం మరొక్కటి ఉంది. ఇదే కాలంలో తయారీ రంగంలో 87,000 ఉద్యోగాలు పోవడం గమనార్హం. దీంతో మేక్ ఇన్ ఇండియా నెరవేరని కళగానే మిగిలిపోనుంది. ఈ సర్వేలో భాగంగా దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని 11,179 యూనిట్ల నుంచి సమాచారం సేకరించారు.

లేబర్ బ్యూరో రూపొందించిన ఈ త్రైమాసిక సర్వే ప్రకారం 2017 ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో విద్యా, వైద్య రంగాల్లో మాత్రం 1.3 లక్షల ఉద్యోగాలు నమోదయ్యాయి. మరో ఆరు రంగాలు అయినటువంటి తయారీ, నిర్మాణ, వాణిజ్య, ట్రాన్స్‌పోర్టు, వసతి, ఐటి లేదా బిపిఓ రంగాల్లో 66,000 ఉద్యోగాలు ఊడ్చుకు పోయాయి. విద్యా రంగం మాత్రం అత్యధికంగా 99,000 ఉద్యోగాలను కల్పించింది. వైద్య రంగం 31,000 ఉద్యోగాలు అందించింది. ఏప్రిల్ 2016 నుంచి ఈ సర్వేను నిర్వహిస్తున్నారు. ఇందులో రెగ్యూలర్, దినసరి ఉద్యోగాలతో పాటు స్వయం ఉపాధిని కూడా పరిగణలోకి తీసుకుంటున్నారు.

వార్షిక వృద్ధి 2% లోపే..

ఉద్యోగాల కల్పనలో ఏడాదికి సగటున 2 శాతం పెరుగుదల మాత్రమే ఉందని అంచనా. ఈ ఎనిమిది రంగాల్లో 2016 ఏప్రిల్ నుంచి నికరంగా 4.8 లక్షల ఉద్యోగాలు లభ్యమ య్యాయి. ఇందులో సగం వరకు విద్యా రంగం నుంచే 1.7 లక్షలు సృష్టించబడ్డాయి. వైద్య రంగంలో లక్ష ఉద్యో గాలు వచ్చాయి. కాగా ఈ సర్వే మొదల యినప్పటి నుంచి 15 నెలల కాలంలో ఉద్యోగాల కల్పనలో 2.3 శాతం పెరుగుదల ఉంది. వార్షిక వృద్ధి రేటు 1.8 శాతంగా నమోదయ్యింది.

టాప్‌లో మహిళలు..

కొత్తగా వచ్చిన ఉద్యోగాల్లో మహిళల భాగస్వామ్యం భారీగా పెరగడం హర్షించదగ్గ విషయం. కొత్త ఉద్యోగాల సాధనలో పురుషుల కంటే స్త్రీలు టాప్‌లో ఉన్నారు. విద్యా రంగంలో 2017 ఏప్రిల్-జూన్ కాలంలో సృష్టించబడిన 64వేల ఉద్యోగాల్లో 51,000 ఉద్యోగాలను మహిళలు పొందగా, 13,000 ఉద్యోగాలు పురుషులకు లభించాయి. ఈ సర్వే ప్రారంభమైన 15 నెలల కాలంలో స్థూలంగా మహిళ ఉద్యోగుల సంఖ్య 2.1 లక్షలు పెరిగింది. పురుష ఉద్యోగుల్లో 2.7 లక్షల పెరుగుదల ఉంది. ప్రతీ ఏడాది కొత్తగా వస్తున్న యువతకు ఈ ఉద్యోగాల పెరుగుదల ఏ మూలకు సరిపోదని నిపుణులు పేర్కొంటున్నారు. నిరుద్యోగిత రేటును తగ్గించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ముఖ్యంగా తయారీ రంగంలో అత్యధిక ఉద్యోగాలు సృష్టించబడితేనే ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందన్నారు.

వొడాఫోన్ బంఫర్ ఆఫర్

న్యూఢిల్లీ : టెలికం రంగంలో నెలకొన్న తీవ్రపోటీ నేపథ్యంలో వొడాఫోన్ ఇండియా మరో బంఫర్ ఆఫర్ ప్రకటించింది. ముఖ్యంగా జియోకు ధీటుగా రూ.799కే రోజుకు 4.5జిబి డేటాను ఆఫర్ చేయనున్నట్లు వొడా ప్రకటిం చింది. ఈ ప్లాన్ గడువు 28 రోజులుగా నిర్ణ యించింది. అదే విధంగా అపరిమిత లోకల్, ఎస్‌టిడి కాల్స్, రోమింగ్స్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు ఉచితంగా అందిస్తుంది. అదే విధంగా రూ.549 ఆఫర్‌లో రోజుకు 3.5జిబి డేటాను అందిస్తున్నట్లు తెలిపింది.

5జి నెట్‌వర్క్‌పై సామ్‌సంగ్ దృష్టి




న్యూఢిల్లీ : టెలికం రంగంలో తదుపరి తరం 5జి సేవలపై సామ్‌సంగ్ దృష్టి పెట్టింది. ప్రముఖ చిప్‌సెట్ తయారీ సంస్థ క్వాల్కమ్‌తో కలిసి 5జి నెట్‌వర్క్‌పై పనిచేసే చిప్‌సెట్‌లను తయారు చేయనున్నట్లు సామ్‌సంగ్ తెలిపింది. రెండు సంస్థలు కలిసి ఎక్స్‌ట్రీమ్ అల్ట్రా వైలెట్(ఇయువి)లిథోగ్రఫీ ప్రాసెస్ టెక్నాలజీని అభివద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందించు కున్నాయి. ఇందులో భాగంగా క్వాల్కమ్ స్నాప్ డ్రాగన్ 5జి మొబైల్ చిప్‌సెట్‌ను సామ్‌సంగ్ 7నానోమీటర్‌లో పవర్‌ప్లస్ ఇయువిని తయారు చేయనున్నాయి. ఈ మధ్యకాలంలోనే భారతీ ఎయిర్‌టెల్, టెక్నాలజీ సంస్థ హువాయ్ భారత్‌లో తొలిసారిగా 5జి నెట్‌వర్క్‌ను పరీక్షించిన విషయం తెలిసిందే.



కె.ఎస్ లక్ష్మణరావు,
శాసనమండలి మాజీ సభ్యులు
సెల్ : 9440262072

మూర్త ప్రచాలక దశకాలం

డీఎస్సీ ప్రిపరేషన్ (చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగి)



1. అనువంశికంగా సంక్రమించిన ప్రోక్షణాలకు అనుగుణంగా, పరిసరాల నుంచి సంప్రాప్తించిన ఆర్జిత లక్షణాల పర్యవసానంగా వ్యక్తి చూపే ప్రవర్తనల శాస్త్రం
ఎ. మనోవిజ్ఞాన శాస్త్రం
బి. విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం
సి. అనుప్రయుక్త మనోవిజ్ఞాన శాస్త్రం
డి. పారిశ్రామిక మనోవిజ్ఞాన శాస్త్రం

2. కిందివానిలో తరగతిగదికి సంబంధించి సరికాని వాక్యం ఏది?
ఎ. తరగతిలో చదివే విద్యార్థులందరూ ఒకేలా ఉండరు
బి. తరగతిలో చాలామంది సగటు విద్యార్థులుగానే ఉంటారు
సి. తరగతిలో చదివే విద్యార్థులందరూ ఒకేలా ఉంటారు
డి. కొందరు పిల్లలు సామాన్యులకంటే భిన్నంగా ఉంటారు

3. జె.పి చాప్లిన్ రచించిన పుస్తకం
ఎ. ప్రిన్సిపల్స్ ఆఫ్ సైకాలజీ
బి. డిక్షనరీ ఆఫ్ సైకాలజీ
సి. ఎడ్యుకేషనల్ డిటర్మినిజమ్
డి. డెమోక్రసీ అండ్ ఎడ్యుకేషన్

4. స్నెలెన్స్ పరీక్ష అనేది
ఎ. దూరదృష్టికి సంబంధించింది
బి. హ్రస్వదృష్టికి సంబంధించింది
సి. వినికిడి లోపానికి చెందింది
డి. భాషణ లోపానికి చెందింది

5. యత్నదోష సిద్ధాంతానికి మరోపేరు
ఎ. ఉద్దీపన - ప్రతిస్పందన సిద్ధాంతం
బి. ప్రతిస్పందన- ఉద్దీపన సిద్ధాంతం
సి. ఉద్దీపన - ఉద్దీపన సిద్ధాంతం
డి. ప్రతిస్పందన - ప్రతిస్పందన సిద్ధాంతం

6. పూర్వ కౌమార దశకాలం
ఎ. 13 సంవత్సరాల నుంచి 17 సంవత్సరాల వరకూ
బి. ఆరు సంవత్సరాల నుంచి 10 సంవత్సరాల వరకూ
సి. 17, 18 సంవత్సరాల నుంచి 21 సంవత్సరాల వరకూ
డి. 40 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వరకూ

7. పొదుపు గణనసూత్రం
ఎ. 100 అసలు ప్రయత్నాలు - పునరభ్యసన ప్రయత్నాలు/ అసలు ప్రయత్నాలు
బి. 100 అసలు ప్రయత్నాలు + పునరభ్యసన ప్రయత్నాలు/ అసలు ప్రయత్నాలు
సి. 100 అసలు ప్రయత్నాలు - పునరభ్యసన ప్రయత్నాలు/ పునరభ్యసన ప్రయత్నాలు
డి. 100 అసలు ప్రయత్నాలు + పునరభ్యసన ప్రయత్నాలు/ పునరభ్యసన ప్రయత్నాలు

8. మనస్సులో కోపం ఉన్న ప్రేమను ప్రదర్శించడం ఏ రక్షక తంత్రం?
ఎ. ప్రతిచర్యను రూపొందించడం
బి. ఉప సంహార
సి. ఉదాత్తీకరణం
డి. తాదాత్మీకరణం

9. సహజ ప్రేరణ కాక వేరొక అసహజ, కృత్రిమ ప్రేరణ కూడా ఒకే విధంగా ప్రతిస్పందన కలిగించిన ఆ అసహజ ప్రేరణ
ఎ. నిబంధిత ప్రేరణ
బి. నిబంధిత ప్రతిస్పందన
సి. నిబంధిత ఉద్దీపన
డి. నిర్బంధిత ఉద్దీపన

10. కిందివానిలో మందకొడిగా అభ్యసించేవారికి చెందని అంశం
ఎ. వీరు పాఠశాలలకు సక్రమంగా హాజరుకారు
బి. వీరు ప్రజ్ఞలో సరిహద్దులో ఉంటారు
సి. వీరు అభ్యసించాలంటే విషయాన్ని పదేపదే పునరుక్తి చేయాలి
డి. వీరికి కొద్దిగా బుద్ధిమాంద్యత ఉండవచ్చు

11. మూర్త ప్రచాలక దశకాలం
ఎ. పుట్టినప్పటి నుంచి రెండు సంవత్సరాల వరకూ
బి. రెండు సంవత్సరాల నుంచి ఏడు సంవత్సరాల వరకూ
సి. ఏడు సంవత్సరాల నుంచి 12 సంవత్సరాల వరకూ
డి. 12 సంవత్సరాల నుంచి

12. బోధన అంటే
ఎ. తన భావాలను ఇతరుల్లో కల్పించడం
బి. మానసిక చర్య
సి. విషయజ్ఞానాన్ని అందించడం, మూల్యాంకన చర్య
డి. ఏదీకాదు

13. సాధన ప్రేరణను మాపనంచేసే మాపనులు
ఎ. సాధన ప్రేరణ మాపనులు
బి. థీమాటిక్ ఎప్పర్‌సెప్షన్ పరీక్ష వంటి సాధనాలు
సి. డిఎటి
డి. ఎ, బి

14. విద్యా మానసిక శాస్త్రీయాధ్యయన పద్ధతులలో ఉత్తమమైనదేది?
ఎ. పరిశీలనం బి. సమావేశ సంభాషణం
సి. ప్రశ్నావళి డి. ప్రయోగాత్మకం

15. సంతృప్తి సాధించడానికి సూత్రం
ఎ. సంతృప్తి సాధించిన విజయాలు / కోర్కెలు
బి. సంతృప్తి కోర్కెలు / సాధించిన విజయాలు
సి. సంతృప్తి కోర్కెలు / సాధించిన విజయాలు 100
డి. సంతృప్తి సాధించిన విజయాలు / కోర్కెలు 100

16. అభ్యసనం నెమ్మదిగా జరుగుతూ ఇంకా ప్రగతి పూజ్యమై అభ్యసనం గతిలేక నిలిచిపోయినట్లు ఉండే రేఖాచిత్రభాగం
ఎ. త్వరితప్రగతి స్థితి
బి. ప్రగతి లేని స్థితి
సి. పీఠభూమి దశ
డి. పీఠభూమి తరవాత దశ

17. ఒక తండ్రి తాను ఐఏఎస్ అధికారి కాలేకపోయినా తన కుమారుడు గానీ, కుమార్తెగానీ దానిని సాధిస్తే, తానే దానిని సాధించినట్లు సంతృప్తి చెందడం.
ఎ. పరిహారం
బి. స్వైరకల్పన
సి. ప్రతిగమనం
డి. తాదాత్మీకరణం

18. విద్యార్థులకు తమ ఉపాధ్యాయునిలో విశ్వాసం ఎప్పుడు కలుగుతుంది ?
ఎ. బోధనా సమయంలో ఏ పుస్తకమునూ ఉపయోగించనప్పుడు
బి. నల్లబల్లను ఎక్కువగా ఉపయోగించినప్పుడు
సి. నిర్ణీత సిలబస్‌నే అనుసరించినప్పుడు
డి. టెక్స్ట్‌బుక్‌ను ఉపయోగించినప్పుడు

19. నిశితమైన పరిశీలనా దృష్టివల్లనే అభ్యసనం సిద్ధించే అభ్యసనం
ఎ. పరిశీలనా అభ్యసనం
బి. కార్యసాధక అభ్యసనం
సి. యత్నదోష అభ్యసనం
డి. నిర్బంధనా అభ్యసనం

20. జన్మభూమి కార్యక్రమాలలో ప్రజలను పాల్గొనేట్లు చేయడం మంచిపద్ధతి ఏది?
ఎ. విద్యాకమిటీ సమావేశాలు నిర్వహించడం
బి. గ్రామసభలు నిర్వహించడం ద్వారా
సి. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను ఏర్పరచుకోవడం ద్వారా
డి. విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులకు లేఖలు పంపడం ద్వారా

21. వ్యక్తిలో కదలిక లేదా చలనం కలగజేసే వ్యక్తిని ఒక చర్యకు పూనుకొనేటట్లు ప్రేరేపించే శక్తి
ఎ. ఆలోచన బి. సృజనాత్మకత
సి. సహజాతాలు డి. ప్రేరణ

22. "శిశువుల్లో మానసిక, భౌతిక పరిపక్వత చెందేకొద్దీ భావ ప్రకటనలలో పరిపక్వత ఏర్పడుతుంది. భావోద్రేకాలు కొంత అదుపులో తొందరపాటు లేకుండా ప్రకటించడం జరుగుతుంది" అని నిర్వచించినవారు
ఎ. వాట్సన్ బి. గాల్టన్
సి. జెర్సీల్డ్ డి. సోడక్

23. మందకొడి నిబంధనానికి ఉదాహరణ
ఎ. పావ్‌లోవ్ కుక్కపై చేసిన ప్రయోగం
బి. థార్న్‌డైక్ పిల్లిపై చేసిన ప్రయోగం
సి. వాట్సన్ చేసిన ఆల్బర్ట్ ప్రయోగం
డి. కోహెలర్ చింపాంజీపై చేసిన ప్రయోగం

24. సంస్కృత భాషా ప్రావీణ్యం భౌతికచర్య అయిన 'ఈత నేర్చుకోవడానికి కానీ లేదా వేరొక మానసిక చర్య అయిన కంప్యూటర్ నేర్చుకోవడం కానీ ఏ విధంగానూ సహకరించదు' ఇది ఏ రకమైన బదలాయింపు?
ఎ. అనుకూల బదలాయింపు
బి. ప్రతికూల బదలాయింపు
సి. శూన్య బదలాయింపు
డి. ద్విపార్శ్వ బదలాయింపు

25. గాల్టన్ రచించిన గ్రంథం
ఎ. ఇన్క్వరీ ఇన్‌టూ హ్యూమన్ ఫ్యాకల్టీ అండ్ ఇట్స్ డెవలప్‌మెంట్
బి. డెమోక్రసీ అండ్ ఎడ్యుకేషన్
సి. యాన్ ఇంటర్‌ప్రిటేషన్ ఆఫ్ డ్రీమ్స్
డి. ఆన్ మెమరీ

26. 'సమస్యాపూరిత విద్యార్థికి సంబంధించి సమగ్ర విచారణ జరిపి, ఆ వ్యక్తి సమస్యను నివారించేందుకు ఉపయోగపడే పద్ధతే వ్యక్తి చరిత్ర అధ్యయన పద్ధతి' అని పేర్కొన్నవారు
ఎ. క్రో అండ్ క్రో
బి. పీల్
సి. బోనీ అండ్ హలపిల్
డి. స్కిన్నర్

27. రీడింగ్ కాంప్రహెన్షన్ అనగా..
ఎ. అర్థంచేసుకొని చదవడం
బి. కొంతభాగాన్నే చదవడం
సి. అక్కడక్కడ చదవడం
డి. అర్థం కాకపోయినా చదవడం

28. గ్రామీణ ప్రాంతాల్లో పలువురు విద్యార్థులు బడి మానేయడానికి కారణం
ఎ. పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా లేకపోవడం
బి. విద్యార్థులు పేదరికం వల్ల పనికి వెళ్లడం
సి. తల్లిదండ్రులకు పనిలో పిల్లలు సాయపడడం
డి. పనులకాలంలో సెలవులు లేకపోవడం

29. ఏ వ్యక్తి అయితే పరిసరాల్లోని ఉద్దీపనలను పరికించి చూస్తాడో ఆ వ్యక్తికి సంబంధించిన లక్షణాలు
ఎ. స్వీయరూప కారకాలు లేదా అంతర్గత కారకాలు
బి. వస్తురూప కారకాలు లేదా బాహ్యరూప కారకాలు
సి. ఏకవస్తు కారకాలు
డి. స్వరూప కారకాలు

30. 1916లో మూడు సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వారికోసం తయారుచేసిన ప్రజ్ఞామాపని
ఎ. బినే - సైమన్ ప్రజ్ఞామాపని
బి. స్టాన్‌ఫర్డ్ - బినే ప్రజ్ఞామాపని
సి. గిల్‌ఫర్డ్ ప్రజ్ఞామాపని
డి. స్టాన్‌ఫర్డ్ ప్రజ్ఞామాపని

సమాధానాలు : 1.ఎ, 2.సి, 3.బి, 4.ఎ, 5.ఎ, 6.ఎ, 7.ఎ, 8.ఎ, 9.ఎ, 10.ఎ, 11.సి, 12.సి, 13.డి, 14.డి, 15.ఎ, 16.బి, 17.డి, 18.సి, 19.ఎ, 20.బి, 21.డి, 22.సి, 23.సి, 24.సి, 25.ఎ, 26.సి, 27.ఎ, 28.సి, 29.ఎ, 30.బి.

ఉద్యోగాలు

ఎన్‌బీసీసీ (ఇండియా) లిమిటెడ్‌లో 145 ఖాళీలు

న్యూఢిల్లీలోని నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఎన్‌బీసీసీ) ఇండియా లిమిటెడ్... వివిధ విభాగాల్లోని 145 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు: జనరల్ మేనేజర్ (జీఎం)-2 (సివిల్), అడిషినల్ జనరల్ మేనేజర్ (ఏడీజీఎం)-7 (సివిల్-5 + లా-1 + ఫైనాన్స్-1), డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీవైజీఎం)-16 (సివిల్-10 + ఫైనాన్స్-6), ప్రాజెక్ట్ మేనేజర్ (పీఎం)-16 (సివిల్), మేనేజర్-6 (ఫైనాన్స్-4 + ఇన్వెస్టర్ రిలేషన్స్-1 + ఆర్కిటెక్ట్ అండ్ ప్లానింగ్-1), డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ (డీవైపీఎం)-25 (సివిల్-19 + ఫైనాన్స్-5 + ఆర్కిటెక్ట్ అండ్ ప్లానింగ్-1), సీనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ (ఎస్ఆర్‌పీఈ)-26 (సివిల్-20 + ఎలక్ట్రికల్-4 + ఐటీ-2), సీనియర్ ఎగ్జిక్యూటివ్-1 (ఆర్కిటెక్ట్ అండ్ ప్లానింగ్), అసిస్టెంట్ మేనేజర్ (ఏఎం)-11 (కంపెనీ సెక్రటరీ-2 + ఫైనాన్స్-4 + హెచ్ఆర్ఎం-4 + ఇన్వెస్టర్ రిలేషన్స్-1), మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఎంటీ)-4 (ఫైనాన్స్), ఎగ్జిక్యూటివ్ (గ్రాఫిక్/ క్రియేటివ్ డిజైనర్)-1, జూనియర్ ఇంజనీర్ (జేఈ)-26 (సివిల్-20 + ఎలక్ట్రికల్-3 + ఐటీ-2 + మెకానికల్-1), సీనియర్ స్టెనోగ్రాఫర్-1, ఆఫీస్ అసిస్టెంట్ గ్రేడ్ (3)-3.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
దరఖాస్తు చివరి తేదీ: వెబ్‌సైట్‌లో దరఖాస్తు స్వీకరణ ప్రారంభమైన రోజు నుంచి 30 రోజుల వరకు.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్: www.nbccindia.com

రూసా ఎస్‌పిడిగా హరి ప్రసాద్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రూసా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎస్‌పిడి)గా ఐఎఎస్ అధికారి కూనపరెడ్డి హరిప్రసాద్ శనివారం నియమితులయ్యారు. ఉన్నత విద్య నాణ్యతను మెరుగుపర్చేందుకు సర్వ శిక్షా అభియాన్ మాదిరి కేంద్ర ప్రభుత్వం రూసాను ఏర్పాటు చేసింది. మెదక్, కొత్తపల్లి, షిల్లాంగ్, విజయవాడ, గుంటూరు, విశాఖ, హైదరాబాద్‌లలో వివిధ హోదాల్లో హరి ప్రసాద్ పని చేశారు. ఎపిలో ఉన్నత విద్య అభివృద్ధికి కృషి చేస్తానని హరి ప్రసాద్ తెలిపారు.

అగ్నిప్రమాదం

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో శనివారం సాయంత్రం 5వ నెంబర్ జెట్టీలో లంగరేసి ఉన్న మెకనైజ్డ్ బోటులో గ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో కార్పెంటర్‌గా పనిచేస్తున్న పొట్టి చిన్ని మృతి చెందాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.



బిజెపి రాయలసీమకు చేసిందేమిటో చెప్పాలి

సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు డిమాండ్

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

నాలుగేళ్లలో బిజెపి ప్రభుత్వం రాయలసీమకు చేసిందేమిటో చెప్పాలని సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం కర్నూలులో బిజెపి నేతలు సమావేశం ఏర్పాటు చేసుకుని డిక్లరేషన్ విడుదల చేయడాన్ని ఆయన గుర్తు చేశారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు, రాజ్యసభలో ఇచ్చిన హామీలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాలుగేళ్ల విస్మరించిందన్న విషయాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పుడు ఉన్న ఫలంగా రాయలసీమ డిక్లరేషన్ విడుదల చేసి కొత్త నాటకానికి తెరలేపారని ఎద్దేవ చేశారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని ప్రకటించి, ఏడాదికి రూ.50 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఇది వెనుకబడిన ప్రాంత ప్రజలను అవమానించడమేనని పేర్కొన్నారు. పార్లమెంటులో మూడవ వంతు మెజార్టీ ఉన్న బిజెపి నాలుగేళ్లలో ఏమి చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడుతున్న కొత్త నాటకమని తెలిపారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా, ప్యాకేజీ అంశాలపై మార్చి 5, 6 తేదీల్లో పార్లమెంటు ఎదుట పది వామపక్ష పార్టీలు ఆందోళనకు సిద్ధపడ్డాయని తెలిపారు. ఇప్పటికైనా చిత్తశుద్ధి ఉంటే బిజెపి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మార్చి 15 నుంచి ఆక్వా ఎక్స్ ఇండియా సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ

ఆక్వా రంగ ఎగుమతులు, సాంకేతిక పరిజ్ఞానం కోసం మార్చి 15, 16, 17 తేదీల్లో ఆక్వా ఎక్స్ ఇండియా - 2018 పేరుతో సదస్సు నిర్వహిస్తున్నామని డెల్టా ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.రామచంద్రరాజు తెలిపారు. మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 15న నోబుల్ అవార్డు గ్రహీత విజయగుప్తా సదస్సు ప్రారంభిస్తారని చెప్పారు. ప్రపంచంలోని 11 దేశాలు, రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. రైతులు పండించే పంట ఎగుమతులు, ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానం తదితర విషయాలపై శాస్త్రవేత్తలు, అధికారులు సదస్సులో ప్రసంగిస్తారని చెప్పారు. దేశవ్యాప్తంగా 40-60 శాతం ఆక్వా సాగవుతుందని తెలిపారు. ప్రపంచంలో అత్యధిక ఆక్వా సాగు చైనా తర్వాత మన దేశానిదేనని అన్నారు. రాష్ట్రంలో ఇటీవల ఆక్వా సాగు 3.50 లక్షల హెక్టార్ల నుంచి ఆరు లక్షలకు పెరిగిందన్నారు. తలసరి 20 కేజీలు ప్రతి మనిషి ఆక్వా ఉత్పత్తులు తినాల్సి ఉండగా, మన ప్రాంతంలో మూడున్నర కేజీలు మాత్రమే తింటున్నారని తెలిపారు. మత్స్యశాఖ రిటైర్డు డిప్యూటీ డైరెక్టర్ పి.రామ్మోహనరావు, ఎడిలు జి.వెంకట్రావు, పి.మధులత మాట్లాడుతూ ఆంధ్రా, తెలంగాణా ప్రభుత్వాలు, మత్స్యశాఖ ఆధ్వర్యాన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. 300కిపైగా ప్రదర్శనలు, 14 అంశాలలో సదస్సులు జరుగుతాయన్నారు. కొత్త ఉత్పత్తులను శాస్త్రవేత్తలు ఆవిష్కరిస్తారని అన్నారు. రాష్ట్రంలో చేపలు, రొయ్యల రైతులకు సంబంధించిన సందేహాలను అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తలు నివృత్తి చేస్తారని తెలిపారు.

'విద్యుత్' కార్మికుల నిరసనల హోరు

- అరకు, కాకినాడలో కుటుంబ సభ్యులతో నిరసన
- కర్నూలులో భిక్షాటన, తిరుపతిలో ఎమ్మెల్యే ఇంటి ముట్టడి



నెల్లూరులో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-యంత్రాంగం

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు ఆందోళన తీవ్రరూపం దాల్చింది. శనివారం విశాఖపట్నం జిల్లా అరకు, తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో కార్మికుల కుటుంబ సభ్యులతో నిరసన తెలిపారు. తిరుపతిలో టిడిపి ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో మోకాళ్లపై నడిచారు.. గుంటూరులో అర్ధనగ్న ప్రదర్శన, కర్నూలులో భిక్షాటన చేశారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు మద్దతుగా వారి కుటుంబాలు విశాఖ జిల్లా అరకు లోయలో ఆందోళనకు దిగాయి. పిల్లలు సైతం ఈ ఆందోళనలో పాల్గొన్నారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె విజయనగరం జిల్లాలో నాలుగో రోజుకు చేరింది. ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద చీపుర్లతో రోడ్లను ఊడుస్తూ నిరసన తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు సబ్‌స్టేషన్ వద్ద, గోదారి గట్టున ఉన్న విద్యుత్ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన శిబిరాలు కొనసాగుతున్నాయి. కాకినాడ కలెక్టరేట్ వద్ద కార్మికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సమ్మెలో పాల్గొన్నారు. సమ్మెకు సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు జి.బేబిరాణి, వైసిపి కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కురసాల కన్నబాబు, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలివెల్ల శ్రీనివాసరావు, ప్రజాసంఘాలు మద్దతు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. తణుకులో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రాజమహేంద్రవరం గోదావరి గట్టున ఉన్న విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం వద్ద విద్యుత్ జెఎసి రాష్ట్ర నాయకులు బాలకాశీ కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నంలో సమ్మె ఉధృతమవుతోంది. ఐదు రోజులుగా చేస్తున్న సమ్మెకు ప్రభుత్వం స్పందించక పోవడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు సిహెచ్.బాబూరావు కార్మికులను పరామర్శించి మద్దతు తెలిపారు. గుంటూరు జిల్లా పొన్నూరు రోడ్డులోని సబ్‌స్టేషన్ నుంచి బస్టాండ్ సమీపంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వరకూ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. నరసరావుపేటలో ధర్నా చేశారు. 0విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు తిరుపతి టిడిపి ఎమ్మెల్యే సుగుణమ్మ ఇంటిని ముట్టడించారు. మంత్రుల కార్యక్రమాలనూ అడ్డుకుంటామని, ప్రజాప్రతినిధులు తమ సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే వరకూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళీ హెచ్చరించారు. దాదాపు గంటన్నర సేపు కార్మికులు ముట్టడించి తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే సుగుణమ్మ తెలిపారు. మార్చిలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. కర్నూలు జిల్లాలో నాలుగో రోజు దీక్షలు చేశారు. కార్మికులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. వైసిపి పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎస్.రాధాకృష్ణ మద్దతు తెలిపారు. అనంతపురం జిల్లాలో దీక్షలు కొనసాగుతున్నాయి. నగరంలో ర్యాలీ నిర్వహించారు. చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ సమ్మెకు మద్దతుగా 25న పట్టణ, మండల కేంద్రాల్లో ఆందోళనలు చేస్తున్నట్లు సిపిఎం ఉత్తర ప్రాంత జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ప్రకటించారు.



పాదయాత్రలో బత్తాయి రసం తాగుతున్న వైఎస్ జగన్

సమాన పనికి సమాన వేతనం

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జగన్ హామీ

ప్రజాశక్తి-కనిగిరి టౌన్

వచ్చే ఎన్నికల్లో తనకు అధికారమిస్తే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో పాటు సమాన పనికి సమాన వేతనం అందేలా చర్యలు చేపడతానని వైఎస్ఆర్‌సిపి అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి హామీ నిచ్చారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా శనివారం ప్రకాశం జిల్లా కనిగిరి పెద్ద చర్చిసెంటర్ కూడలిలో జరిగిన బహిరంగసభలో మాట్లాడారు. వృద్ధులకు రూ 2వేలు ఫించన్‌ను ఇస్తానన్నారు. వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి పశ్చిమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తానని చెప్పారు. ప్రజలకు ప్రయోజనకరమైన ఒక ప్రాజెక్ట్‌ను కూడా జిల్లాలో పూర్తిచేయకపోవటం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్‌కు శ్రీకారం చుట్టారని, జిల్లాలోని గుండ్లకమ్మ, రామతీర్థం జలాశయాలకు శంకుస్థాపన చేసి పూర్తిచేసి ప్రజల దాహార్తి తీర్చారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఓటుకు రూ.3వేలు ఇస్తానని చంద్రబాబు చెబుతాడనీ, కాదు రూ.5వేలివ్వాలని అడిగి మరీ తీసుకోవాలనీ, ఆ డబ్బు కూడా ప్రజల వద్దనుంచి లూటీ చేసిందేనని చెప్పారు.ముస్లిం సోదరులు టోపి ,శాలువాతో జగన్‌ను సన్మానించారు. బహిరంగ సభ ముగింపు సమయంలో వచ్చే ఎన్నికల్లో విజయం నీదే అన్న సంకేతం వెలువరించేలా బుర్రా యువసేన నాయకులు అందజేసిన రాజసం ఉట్టిపడే తలపాగా, వెండి కత్తిని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రామధుసూదన్‌యాదవ్‌కు బహుకరించి ప్రజలకు అభివాదం చేయించారు. పట్టణంలోని పామూరుబస్టాండ్, కందుకూరు రోడ్, ఒంగోలురోడ్డు మార్గాలు జనసంద్రమయ్యాయి.

హోదా ఇవ్వని పార్టీలను ఊడ్చేస్తాం

డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వని పార్టీలను ఊడ్చేస్తామని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ), భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీలన నాయకులు పేర్కొన్నారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లో రెండు సంఘాల ఆధ్వర్యంలో శనివారం పొడవాటి యాప్రాన్ వేసుకొని, రోడ్డు ఊడ్చూతూ నిరసన తెలిపారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం సూర్యారావు మాట్లాడుతూ అధికారం చెపట్టిన ఆరు నెలల్లో రైల్వేజోన్ ఇవ్వాలని విభజనచట్టంలో ఉందని, నాలుగేళ్లలో ఎందుకు ఇవ్వలేదని అన్నారు. సెంట్రల్ వర్శిటీ, గిరిజన యూనివర్శిటీ నిర్మాణం జరగాలంటే కేంద్రంలో యూనివర్శిటీ చట్టాలను సవరించాలని, కేంద్రం ఇప్పటి వరకూ ఆ పని చేయలేదని అన్నారు. హోదా సంజీవిని కాదని, ప్యాకేజీయే ముద్దని అన్న ప్రభుత్వమే ఇప్పుడు మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధమని అంటోందని తెలిపారు. టిడిపి, బిజెపి రాష్ట్ర ప్రజానీకాన్ని నాలుగేళ్ల నుంచి పీడిస్తున్నాయని, స్వాతంత్ర్య పోరాటం ప్రజలదని, బ్రిటీష్ వాళ్లలా ప్రజలను దోచుకుంది టిడిపి, బిజెపి అని అన్నారు. ఇప్పటికైనా బిజెపి, టిడిపి చేసిన మోసాన్ని గుర్తించి హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వై రాము మాట్లాడుతూ హోదా ఇస్తామని చెప్పిన పార్టీలే ఇప్పుడు మోసం చేస్తున్నాయన్నారు. యూనివర్శిటీలకు రూ.9006 కోట్లు ఇవ్వాల్సిఉండగా నాలుగేళ్లలో రూ.421 కోట్లే ఇచ్చారని తెలిపారు. కడప ఉక్కు, పోర్టు, పరిశ్రమలు లేక రాష్ట్రంలో నిరుద్యోగం విలయతాండం చేస్తోందని, దీనికి బిజెపి, టిడిపిలే కారణమని అన్నారు. కార్యక్రమానికి కె రమేష్ అధ్యక్షత వహించగా, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు జి రామన్న, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు టి ప్రవీణ్, శివ, కిరణ్, సుబ్రమణ్యం, నిజాం, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశోక్, నాయకులు ఏసుబాబు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

రానున్నది పోరాటాల కాలమే

సింహాద్రి శివారెడ్డి ప్రథమ వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు



సింహాద్రి శివారెడ్డి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న మధు, తదితరులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

సంపన్నులకు దోచిపెట్టడమే పనిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్న క్రమంలో రానున్నదంతా కమ్యూనిస్టులకు పోరాటాల కాలమేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు సింహాద్రి శివారెడ్డి ప్రథమ వర్ధంతి సభ గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజలో శనివారం రాత్రి నిర్వహించారు. సభకు సిపిఎం మండల కార్యదర్శి వై.గంగాధరరావు అధ్యక్షత వహించారు. మధు మాట్లాడుతూ శివారెడ్డి జీవితం అందరికీ ఆదర్శనీయమని చెప్పారు. దేశంలో సహజ వనరులన్నీ నేడు కొల్లగొట్ట బడుతున్నాయని, అధికారంలోకి వచ్చిన కొద్ది కాలానికే సంపన్నులకు పాలకులు ఊడిగం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో రైతులకు మద్దతు ధర కల్పిస్తానని, వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తానని వాగ్దానం చేసిన మోడీ ప్రజలపై భారాలను ఎలా వేశారో అందరూ చూశారని పేర్కొన్నారు. నోట్ల రద్దు, జిఎస్‌టి వల్ల ప్రజల పడిన బాధలను గుర్తు చేశారు. కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన బడా పెట్టుబడిదారులు దేశం విడిచి వెళ్తుంటే పాలకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలో టిడిపి వంతపాడుతోందని, ప్యాకేజీనే ముద్దని రాష్ట్రాన్ని దగా చేసిన చంద్రబాబు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. దళితులు, మైనార్టీలపై రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా దాడులు పెరిగాయని ఆవేదన వెలిబుచ్చారు. జిల్లాలోని పెదగొట్టిపాడులో దళితులపై దాడి ఘటనలో టిడిపి పెత్తందార్ల పక్షానే నిలుస్తోందని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించే పోరాటంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మార్చి 3న చలో గుంటూరును నిర్వహించి తీరతామని స్పష్టం చేశారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య, గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు మాట్లాడారు. ముందుగా సింహాద్రి శివారెడ్డి చిత్రపటానికి పూలమాలలేసి నివాళు లర్పించారు. ప్రజానాట్య మండలి కళాకారులు విప్లవ గీతాలను ఆలపించారు.



కాకినాడ కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించిన మాలమహానాడు నాయకులు

దళితులపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు మండలం మగటపల్లిలో దళిత యువకుడిపై దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మాలమహానాడు, సమతా సైనిక్‌దళ్ ఆధ్వర్యాన తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద శనివారం రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. నిందితులను అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు కలవల కృష్ణమూర్తి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లపు వేణు, జిల్లా అధ్యక్షులు ఏనుగుపల్లి కృష్ణ, కలవల కృష్ణమూర్తి మాట్లాడారు. దళిత యువకుడు చిల్లే శ్రీరాం దుర్గాప్రసాద్‌ను తీవ్రంగా కొట్టి గాయపర్చిన నిందితులను ఇప్పటికీ అరెస్టు చేయకపోవడం సిగ్గు చేటన్నారు. అధికార పార్టీ నేత అనుచరులు కావడం వల్లే పోలీసులు అలసత్వం వహిస్తున్నారని విమర్శించారు. తక్షణం నిందితులను అరెస్టు చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం జెసి డాక్టర్ ఎ.మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని జెసి హామీ ఇచ్చారు. నగర అధ్యక్షులు కాకిలేటి రవీంద్ర, రాష్ట్ర కార్యదర్శి కుంచంగి రఘు, యూత్ అధ్యక్షులు బోని సూర్య ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వాలి

సెయింట్ జోసఫ్ కాలేజీ ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా

ప్రజాశక్తి - కడపఅర్బన్

విద్యార్థులను మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైయివేట్, కార్పొరేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సెయింట్ జోసఫ్ జూనియర్ కాలేజీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను మానసికంగా ఇబ్బందులుకు గురిచేస్తున్నాయని విమర్శించారు. పరీక్షలు దగ్గరపడుతోన్న సమయంలో విద్యార్థులపై ఫీజు ఒత్తిడి ఎక్కువైందని పేర్కొన్నారు. ఎటువంటి షరతులు లేకుండా విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయాన్ని ఆర్ఐఒ దృష్టికి తీసుకెళ్లిన ఫలితలేకుండా పోయిదని విమర్శించారు. ఆర్ఐఒ కార్పొరేట్, ప్రైయివేట్ యాజమాన్యాలకు అమ్ముడు పోయారని విమర్శించారు.

ప్రజ్ఞ

జవాబులు

1. 15శాతానికి
2. 81
3. న్యూజిలాండ్ (89), డెన్మార్క్(88).
4. ఖలిస్తాన్ ఉగ్రవాది జస్పాల్ అత్వాల్
5. నూకల నరేందర్‌రెడ్డి

ప్రత్యేక హోదా మన హక్కు

రౌండ్‌టేబుల్ సమావేశాల్లో వక్తలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రత్యేక హోదా, విభజన చట్టం అమలు, రాష్ట్రానికి బిజెపి, టిడిపి చేసిన అన్యాయంపై మార్చి 6న చలో ఢిల్లీ జయప్రదం చేయాలని, ప్రత్యేక హోదా మన హక్కు అనే నినాదం ఢిల్లీ వరకూ మారుమోగేలా చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక హోదాపై రౌండ్ టేబుల్ సమావేశాలు శనివారం నిర్వహించారు. రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాలులో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. మార్చి 2,3 తేదీల్లో రాజమహేంద్రవరం కోటగుమ్మం సెంటర్లో వామపక్షాల ఆధ్వర్యాన నిర్వహించనున్న నిరసన రిలే దీక్షల్లో అన్ని పార్టీలు, సంస్థలు, ప్రజాసంఘాలు పాల్గొనాలని సమావేశం తీర్మానించింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మిడియం బాబూరావు మాట్లాడుతూ వచ్చేనెల 6న ఛలో ఢిల్లీ కార్యక్రమానికి అందరూ తరలిరావాలని కోరారు. హోదా కోసం ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేయాలన్నారు. అన్ని వర్గాల ప్రజల్లో చర్చ జరగాలన్నారు. మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని, దీనిని సాధించేందుకు అన్ని పార్టీలు కలిసిరావాలని కోరారు.

మాజీ ఎంఎల్ఎ, వైసిపి నాయకులు రౌతు సూర్యప్రకాశరావు, సిపిఐ నగర కార్యదర్శి నల్లా రామారావు, రాజమహేంద్రవరం ఆలోచనా వేదిక నాయకుడు పి.సతీష్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, సిపిఐఎంఎల్ నాయకుడు రమణ తదితరులు మాట్లాడారు. ప్రత్యేక హోదాపై విజయవాడ ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నగర నాయకుల ఆధ్వర్యాన సదస్సు నిర్వహించారు. సదస్సుకు మాజీ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, పూర్వ విద్యార్థి సంఘం నాయకుడు దోనేపూడి కాశీనాథ్ హాజరై మాట్లాడారు. అన్నారు.

రౌండ్‌టేబుల్

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటీకరిస్తే ప్రతిఘటనే..

రౌండ్‌టేబుల్ సమావేశంలో సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు జి.బేబిరాణి

ప్రజాశక్తి - కాకినాడ

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటీకరిస్తే ప్రతిఘటన తప్పదని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు జి.బేబిరాణి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి మార్చి 1న చలో విజయవాడకు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ సిఐటియు కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం నాయకులు సువర్ణ అధ్యక్షతన శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జి.బేబిరాణి, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు జోగా అప్పారావు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేట్ సంస్థలకు అప్పగించొద్దన్నారు. క్లస్టర్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.5 వేలు ఇవ్వాలని, బిల్లులు, వేతనాలు ప్రతినెలా 5వ తేదీలోగా చెల్లించాలన్నారు. మెనూ ఛార్జీలు రూ.10కి పెంచాలని, ఉద్యోగభద్రత కల్పించి గుర్తింపు కార్డులివ్వాలని అన్నారు. పథకం అమలుకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు బేబిరాణి

హైస్కూల్‌లో పనిచేస్తున్న వారికి వేతనం నిర్ణయించి అమలుచేయాలన్నారు.

ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మార్చి 1న విజయవాడ ఇబ్రహీంపట్నం అడ్డరోడ్డు వద్ద కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో అంగన్‌వాడీ, ఆశ యూనియన్ నాయకులు డి.బేబి, సిహెచ్ పద్మ, తాళ్లరేవు సిఐటియు కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, ఐద్వా జిల్లా కార్యదర్శి సిహెచ్.రమణి, టిఎన్‌టియుసి జిల్లా నాయకులు సాయిబాబు, భోజనం పథకం యూనియన్ జిల్లా నాయకురాలు ఆర్.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి కళా వెంకటరావు

ప్రజాశక్తి - రాజాం (శ్రీకాకుళం)



మంత్రి కళావెంకటరావుకు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి కిమిడి కళా వెంకటరావు సిఐటియు ప్రతినిధి బృందానికి హామీనిచ్చారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై శ్రీకాకుళం జిల్లా రాజాంలోని మంత్రి కళా వెంకటరావు క్యాంపు కార్యాలయంలో సిఐటియు నాయకులు శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ట్రాన్స్‌కోలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 20 నుంచి సమ్మె చేపడుతున్నారని, విద్యుత్‌శాఖ మంత్రిగా జోక్యం చేసుకొని వాటిని పరిష్కరించాలని కోరారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి, నేరుగా జీతాలు చెల్లించాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాను ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు ఫోన్‌లో మంత్రితో మాట్లాడి సమస్యలను వివరించారు. వీటిపై మంత్రి స్పందిస్తూ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో న్యాయం చేయడానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసు, డి.గోవిందరావు, ఉపాధ్యక్షులు బి.కృష్ణమూర్తి, రాజాం డివిజన్ కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తినాయుడు ఉన్నారు.

మరోసారి పాక్ కాల్పులు

తిప్పికొడుతున్న భారత దళాలు

శ్రీనగర్ : జమ్ము-కాశ్మీర్‌లో భారత సరిహద్దు వెంబడి పాకిస్తాన్ సైన్యం కాల్పుల ఉల్లంఘనకు పాల్పడుతూనే ఉంది. తాజాగా శనివారం యురి ప్రాంతంలోని సరిహద్దు నియంత్రణా రేఖ వద్ద గల భారత శిబిరాలపై పాక్ సైనిక బృందాలు కాల్పులు జరిపినట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. ఈ కాల్పులలో ఎవరికి గాయాలు కాలేదని తెలిపారు. ఉత్తర కాశ్మీర్‌లో బారాముల్లా సెక్టార్‌లోని సైనిక శిబిరాలపై శనివారం ఉదయం 11:50 గంటలకు అకస్మాత్తుగా పాకిస్తాన్ బృందాలు కాల్పులు జరిపినట్లు ఆర్మీ అధికారులు పేర్కొన్నారు. ఈ కాల్పులను భారత దళాలు సమర్ధవంతంగా తిప్పికొడుతోందని అధికారులు పేర్కొన్నారు.

ఆందోళన
సిపిఎం కార్యకర్తలపై తృణమూల్ కాంగ్రెస్ అరాచక దాడులను నిరసిస్తూ డిపిఎల్ ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు



తృణమూల్ గూండాల అరాచక దాడులను తిప్పికొట్టిన సిపిఎం కార్యకర్తలు


ప్రజాశక్తి ప్రతినిధి - కొల్‌కతా : తృణమూల్ కాంగ్రెస్ గుండాలు చేసిన దాడిని సిపిఎం కార్యకర్తలు తిప్పికొట్టిన సంఘటన ఇది. పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్ గ్రామస్తుల నివాసాలకు కొద్ది రోజుల క్రితం దుర్గాపూర్ ప్రాజెక్ట్స్ లిమిటెట్ (డిపిఎల్) సంస్థ పెద్ద మొత్తంలో సెక్యూర్టీ డిపాజిట్‌ను, విద్యుత్ టారిఫ్‌ను విధించడంతో మినహాయింపు కోరుతూ సిపిఎం నాయకత్వం అధికారులతో చర్చించింది. అయితే డిపిఎల్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడానికి నిరాకరించింది. దీని ఫలితంగా డిపిఎల్ కార్యాలయం ఎదుట శనివారం ర్యాలీ నిర్వహించాలని సిపిఎం నిర్ణయించింది. దుర్గాపూర్ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. ఇంతలో తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన గూండాలు అక్కడకు చేరుకుని ఎమ్మెల్యే సంతోష్ దేవ్‌రాయ్‌పై ప్రత్యక్ష దాడికి దిగారు. దేవ్‌రాయ్ కిందపడిపోగా, ర్యాలీలో పాల్గొన్న వారిపై ఆయుధాలతో, ఐరన్ రాడ్లతో, కర్రలతో దాడికి చేశారు. ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలందరూ ఆ దాడిని ప్రతిఘటించారు. దీంతో దుండగులు అక్కడ నుంచి పారిపోయారు. ఈ దాడిలో ఆరుగురు సిపిఎం కార్యకర్తలు గాయపడ్డారు. ఈ ఘటనకు నిరసనగా దుర్గాపూర్‌లోని పలు ప్రాంతాలలో సిపిఎం ర్యాలీలు నిర్వహించింది.

రూ.523 కోట్ల విలువైన నిరవ్ మోడి ఆస్తులు జప్తు : ఇడి

న్యూఢిల్లీ : వజ్రాల వ్యాపారి నిరవ్ మోడికి చెందిన 21 ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) శనివారం జప్తు చేసింది. ఫ్లాట్‌లు, ఫామ్ హౌస్‌లతో సహా మొత్తం రూ.523 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసిందని సంబంధిత అధికారులు వెల్లడించినట్లు ప్రముఖ వార్తా సంస్థ పేర్కొంది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఆస్తులను జప్తు చేసినట్లు తెలిపింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)ని రూ.11,400 కోట్ల మేర నిరవ్ మోడి మోసగించిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి నిరవ్ మోడికి చెందిన పలు ఆస్తులను ఇడి జప్తుచేసింది. ఆస్తుల జప్తుకు సంబంధించి మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇడి తెలిపింది. రూ.81.16 కోట్లు విలువైన పెంట్‌హౌస్‌ను, రూ.15.45 కోట్లు విలువైన ఫ్లాట్‌ను కూడా జప్తు చేసినట్లు పేర్కొంది. ముంబయిలోని వర్లి ప్రాంతంలో ఉన్న సముద్ర మహల్ అపార్ట్‌మెంట్స్ కూడా జప్తు చేసిన వాటిలో వుంది. "నిరవ్ మోడి, ఆయన కంపెనీలకు చెందిన రూ.523.72 కోట్లు మార్కెట్ విలువ కలిగిన 21 చరాస్తులను తాత్కాలికంగా జప్తు చేశాం. ఇందులో నివాసయోగ్యమైన ఆస్తులు6, కంపెనీకి సంబంధించిన కార్యాలయాలను నిర్వహిసున్న స్థలాలు 10, పూనెలోని రెండు ఫ్లాట్‌లు, ఒక సోలార్ పవర్ ప్లాంట్, అలిబగ్‌లోని ఒక ఫామ్‌హౌస్, అహ్మద్‌నగర్ జిల్లాలోని కర్జాత్‌లో ఉన్న 135 ఎకరాల భూమిని జప్తు చేశాం." ఇడి తెలిపింది.

'జీతాలివ్వలేను, ఖాతాలన్నీ సీజ్ చేశారు '

ఉద్యోగులకు చోక్సీ లేఖ



న్యూఢిల్లీ : ఇడి అధికారులు బ్యాంక్ ఖాతాలను సీజ్ చేయడంతో తాను ఉద్యోగులకు జీతాలివ్వలేనని, పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ చోక్సీ శనివారం కంపెనీ ఉద్యోగులకు రాసిన లేఖలో వెల్లడించారు. తమపై, కంపెనీలపై అన్యాయంగా కేసులు పెట్టారని, దీంతో ఉద్యోగులకు జీతాలు చెల్లించలేమని, వారు వేరే ఉద్యోగాలను వెతుక్కోవాల్సి వుంటుందని లేఖలో పేర్కొన్నారు. తమ బ్యాంకు ఖాతాలను, ఆస్తులను సీజ్ చేయడంతో తాము జీతాలు చెల్లించడం కష్టతరమౌతుందని తెలిపారు. ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నీరవ్ మోడీ కూడా తమ ఉద్యోగులకు ఇదేవిధంగా లేఖలు రాసిన సంగతి తెలిసిందే. తాను ఎటువంటి అన్యాయానికి పాల్పడలేదని, త్వరలోనే నిజం నిర్ధారణ అవుతుందని చోక్సీ తమ న్యాయవాది సంజయ్‌కు పంపిన ఈ మెయిల్‌ను ఆయన శుక్రవారం మీడియాకు బహిర్గతం చేశారు. తమపై జరుగుతున్న నేరారోపణలు, విచారణలు, మీడియాలో, రాజకీయాల నిర్ణయాలతో తాను, తమ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నామని తెలిపారు. కాగా, చోక్సీతో తాను నిరంతరం మాట్లాడుతున్నానని, అయితే ఎక్కడున్నది తెలియదని న్యాయవాది పేర్కొన్నారు.

గుజరాత్ ఫలితంపై ఇసికి హైకోర్టు నోటీసు

అహ్మదాబాద్ : అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు సంబంధించి ఎన్నికల కమిషన్‌కు, బిజెపి నేతలకు, ఇతరులకు గుజరాత్ హై కోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఇటీవల రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేతలు దాఖలు చేసిన నాలుగు వేరువేరు పిటిషన్లపై హై కోర్టు నోటీసులు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై పిటిషన్ దాఖలు చేసిన వారిలో ధీరజ్‌లాల్ కూడా ఉన్నారు. ప్రస్తుత రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి సౌరభ్ పటేల్‌పై 906 ఓట్ల తేడాతో ఆయన ఓడిపోయారు. ధీరజ్‌తో పాటు 20 మంది కాంగ్రెస్ నేతలు పిటిషన్లు వేశారు. ఓటు నిర్ధారణ రశీదు యంత్రాలు (వివిపిఎటి) ఓట్లను లెక్కించి ఇవిఎం ఫలితాలను సమీక్షించాలంటూ ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కాంగ్రెస్ నేతలు హైకోర్టును కోరారు.

ఓరియంటల్ బ్యాంక్‌కు మరో నగల వ్యాపారి 'కుచ్చుటోపీ'

మొదటి పేజీ తరువాయి

కంపెనీ వజ్రాలు, బంగారం, వెండి నగలను తయారు చేసే వ్యాపారం చేస్తోంది. ఈ మోసానికి సంబంధించి దాదాపు ఆరు నెలల క్రితమే ఓబిసి సిబిఐకి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు చేసిన ఆరు నెలల తరువాత సిబిఐ కేసు నమోదు చేసింది. ద్వారకా దాస్ సేథ్ కంపెనీ డైరెక్టర్లుగా ఉన్న సభ్య సేథ్, రీటా సేథ్, కృష్ణ కుమార్ సింగ్, రవిసింగ్‌లపై సిబిఐ కేసు నమోదు చేసింది. వీరికి చెందిన రెండో కంపెనీ ద్వారకా దాస్ సేథ్ సెజ్ ఇన్‌కార్పొరేషన్‌ను కూడా ఈ కేసులో చేర్చింది. ఈ మోసానికి సంబంధించి అంతర్గత విచారణలో నిందితులు విదేశాలు పారిపోయినట్లు తేలడంతో ఓబిసి 2017లో సిబిఐని ఆశ్రయించింది. లెటర్స్ ఆఫ్ క్రెడిట్‌పై ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ కంపెనీ రుణాలు తీసుకున్నదని ఓబిసి తన ఫిర్యాదులో పేర్కొంది. 2007-2012 సంవత్సరాల మధ్య బంగారు నగల ఎగుమతి, దిగుమతి కోసం ఇతర మార్గాలలో కూడా రుణాలు తీసుకున్నట్లు ఓబిసి తెలిపింది. కాని వాటిని తిరిగి చెల్లించడంలో విఫలమవ్వడంతో ఆ రుణాలను 2014లో నిరర్థక ఆస్తులుగా ప్రకటించారు.

మోడి "జన్‌ధన్ లూట్ యోజన"లో

మరో స్కామ్

రాహుల్ ఘాటు విమర్శలు



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి మోడీ ప్రవేశపెట్టిన 'జన్‌ధన్ లూట్ యోజన' పథకంలో మరో స్కామ్ చోటు చేసుకున్నదని కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ ఘాటుగా విమర్శించారు. ఢిల్లీకి చెందిన మరో వజ్రాల నగల వ్యాపారి ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఒబిసి)ని మోసగించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వజ్రాల వ్యాపారి నీరవ్ మోడి, లిక్కర్ దిగ్గజం విజయ్ మాల్యా తరహాలో ఓబిసి కేసులోనూ నిందితుడు కనిపించకుండా పోయాడని, ఇదంతా మోడీ సర్కార్ చలువేనని ఆరోపించారు. తాజా కేసులో కూడా నీరవ్ మోడి తరహాలోనే నకిలీ 'లెటర్స్ ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎల్‌ఓయు)' రూపంలోనే నిందితులు మోసానికి పాల్పడ్డారని రాహుల్ ట్వీట్ చేశారు. 'మోడి ప్రవేశపెట్టిన జనధన్ లూట్ యోజనలో ఫలితంగా మరో స్కామ్ చోటు చేసుకుంది. ఢిల్లీకి చెందిన నగల వ్యాపారి రూ.390 కోట్లు రుణాలు ఎగవేశాడు. నిరవ్‌మోడి కేసులో జరిగిన మోసమే ఇక్కడ జరిగింది. అవి నకిలీ ఎల్‌ఓయులు. మాల్యా, నిరవ్ తరహాలోనే ప్రభుత్వం చూస్తుండగానే ఈ వ్యాపారి కూడా పరారయ్యాడు' అని రాహుల్ ట్వీట్ చేశారు. కర్ణాటకలోని ఎన్నికల ప్రచార సభలో రాహుల్ ప్రసంగిస్తూ ..ప్రభుత్వ కనుసన్నల్లో బ్యాంకు నుంచి డబ్బును ఎలా తీసుకెళ్తున్నారో మోడీ వివరించాలని డిమాండ్ చేశారు. 'రూ.22 వేల కోట్ల మోసం జరిగింది, నిరవ్ మోడి భారత్ బ్యాంకుల నుంచి రూ.22 వేల కోట్లను తీసుకుని పారిపోయాడు. మోడీ మాత్రం చర్యలు తీసుకుంటామని చెబుతారు' అని రాహుల్ ర్యాలీకి హాజరైన ప్రజలనుద్దేశించి అన్నారు. "చర్యలు తీసుకుంటారు సరే! నరేంద్ర మోడీ ప్రభుత్వ కనుసన్నలలో దేశంలోని బ్యాంకుల నుంచి రూ.22 వేల కోట్లను నిరవ్ మోడి ఎలా తీసుకెళ్ళారో మొదటగా వివరించండి మోడీ జీ" అని రాహుల్ వ్యాఖ్యానించారు.



అమ్మ స్కూటర్ల లబ్ధిదారులకు తాళాలు అందజేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, చిత్రంలో సిఎం పళనిస్వామి ప్రభృతులు

తమిళనాడులో

అమ్మ స్కూటర్లు

చెన్నై: మహిళా ఉద్యోగులకు సబ్సిడీ స్కూటర్ల పథకాన్ని దేశ ప్రధాని నరేంద్రమోడీ తమిళనాడులో శనివారం ప్రారంభించారు. తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం సమక్షంలో మాజీ సీఎం జయలలిత 70వ జయంతి రోజున ఈ పథకం ప్రారంభమైంది. ఐదుగురు లబ్ధిదారులకు 50శాతం మేర రాయితీ(దాదాపు 25వేల రూపాయలు)తో ఐదు స్కూటర్ల తాళం చెవిలు, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌లను అందజేసి పథకాన్ని ప్రధాని ఆరంభించారు. దీంతో పాటు 70లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్నీ మోడీ ప్రారంభించారు. సుప్రీంకోర్టు ఆదేశానుసారం కావేరీ మేనేజ్‌మెంట్ బోర్డు, కావేరీ వాటర్ రెగ్యులేటరీ కమిటీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం పళనిస్వామి మోడీని కోరారు. ప్రధాని మొదలు పెట్టిన 70లక్షల మొక్కలు నాటే కార్యక్రమం ఏడాది పొడుగునా కొనసాగుతుందని తెలిపారు. ప్రధాని ధైర్యంగా దేశానికి నాయకత్వం వహిస్తున్నారని పన్నీర్‌సెల్వం పేర్కొన్నారు.

నేషనల్ హెరాల్డ్ ఎడిటర్ ఇన్ చీఫ్ నీలబ్ మిశ్రా మృతి

చెన్నై : నేషనల్ హెరాల్డ్ పత్రిక ఎడిటర్ ఇన్ చీఫ్ నీలబ్ మిశ్రా (57)శనివారం చెన్నైలో మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధులతో నగరంలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యులు లివర్ మార్పిడికి సంబంధించిన శస్త్ర చికిత్స చేయడానికి ముందే ఆయనకు పలు అవయవాలు దెబ్బతిన్నాయి. ఆయన తన బంధువులు, మిత్రులు, కామ్రేడ్ల సమక్షంలోనే తుదిశ్వాస విడిచారని నేషనల్ హెరాల్డ్ పేర్కొన్నట్లు ప్రముఖ ఆంగ్ల పత్రిక వెల్లడించింది. నేషనల్ హెరాల్డ్ వార్తా పత్రికను నీలబ్‌మిశ్రా 2017లో న్యూస్ వెబ్‌సైట్‌గా మార్చారు. మాజీ ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ 1938లో నేషనల్ హెరాల్డ్ పత్రికను లక్నోలో ప్రారంభించారు. ఆర్థిక ఇబ్బందులతో 2009లో మూతపడింది. పత్రిక పునఃప్రారంభంలో భాగంగా 2017 జూన్‌లో కాంగ్రెస్ పార్టీ బెంగళూరులో స్మారక ఎడిషన్‌ను విడుదల చేసింది. మిశ్రా మృతికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సంతాపం తెలిపారు. ఎడిటర్లకే ఎడిటర్ నీలబ్ మిశ్రా అంటూ ట్వీట్ చేశారు.

బహుమతి పార్సిల్ పేలి వరుని మృతి

వధువు పరిస్థితి విషమం

భువనేశ్వర్ : నూతన వధూవరులకు పెళ్లి కానుకగా వచ్చిన గిఫ్ట్ బాక్స్ పేలి వరుడు అక్కడిక్కడే మృతి చెందగా, వధువుకి తీవ్ర గాయాలైన ఘటన శనివారం ఒడిస్సాలోని బోలాన్‌గిరి జిల్లాలో సంభవించింది. ఈ ప్రమాదంలో 85 సంవత్సరాల మహిళ కూడా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం సౌమ్యా శేఖర్ సాహు, రీమాలకు ఫిబ్రవరి 18న వివాహమైంది. మరుసటిరోజున రిసెప్షన్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన బహుమతులను శనివారం వారు తెరిచి చూస్తుండగా, వాటిలో ఒక గిఫ్ట్ బాక్స్‌ను ఓపెన్ చేయగానే పేలిపోయింది. దీంతో వారిని హుటాహుటీన స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే సాహు, అతని నాయనమ్మ జెమ్మణి సాహు మృతి చెందినట్లు ప్రకటించారు. సాహు భార్య రీమా ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కాగా, ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

పాఠశాలలోకి దూసుకెళ్లిన కారు

9 మంది విద్యార్థులు మృతి

పాట్నా : కారు అదుపు తప్పి పాఠశాలలోకి దూసుకెళ్లడంతో తొమ్మిది మంది విద్యార్థులు మృతి చెందిన ఘటన శనివారం బీహార్‌లోని ముజఫర్ పూర్‌లో చోటుచేసుకుంది. మరో 20మందికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. మీనాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇంటికి బయలుదేరుతుండగా, ఒక కారు అదుపు తప్పి పాఠశాలలోకి దూసుకువచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది అక్కడికక్కడే మృతి చెందారని అన్నారు. తీవ్ర గాయాలైన వారిని స్థానిక మెడికల్ కాలేజి ఆస్పత్రికి తరలించామని, వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. కాగా, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ బాధిత కుటుంబాలకు రూ.4లక్షల నష్టపరిహారాన్ని ప్రకటించారు.

మానసిక వికలాంగునిపై దాడి ఘటనలో నివేదిక కోరిన కేంద్రం

రూ.10 లక్షలు పరిహారం ప్రకటించిన కేరళ సిఎం

తిరువనంతపురం : మానసిక వికలాంగుడైన గిరిజన యువకుడిపై దాడి ఘటనకు సంబంధించి కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని నివేదిక పంపాల్సిందిగా శనివారం కేంద్రం ఆదేశించింది. ఈఘటనపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని నివేదిక అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించాలని కోరినట్లు కేంద్ర గిరి జన వ్యవహారాలశాఖ మంత్రి జుయల్ ఓరమ్ తెలిపారు. మానసిక వికలాంగుడైన గిరిజన యువకుడు మధుపై శనివారం కొందరు యువకులు ఆహారాన్ని దొంగి లిస్తున్నాడన్న కారణంతో దాడి చేశారు. దాడిని నిరోధించడానికి బదులుగా సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. అనంతరం పోలీసులు అతనిని ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. దాడి కారణంగా అతనికి తల, వీపు భాగాల్లో బలమైన గాయాలయ్యాయని, దీంతో అతను మృతి చెందినట్లు పోస్ట్ మార్టమ్ నివేదికలో రుజువైంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపై నివేదికను ఇవ్వాల్సిందిగా కేంద్రం కోరింది. మరోవైపు బాధితుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.పదిలక్షల రూపాయల పరిహారం ప్రకటించింది.

ఇసి అనర్హత 'వేటు'పై 'ఆప్' ఎమ్మెల్యేల పిటీషన్ ఉపసంహరణ

న్యూఢిల్లీ : ఎన్నికల కమిషన్ అనర్హులుగా ప్రకటించిన ఢిల్లీ అసెంబ్లీకి చెందిన 20 మంది ఆప్ ఎమ్మెల్యేలు, దాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో తాము దాఖలు చేసిన పిటిషన్‌ను శనివారం ఉపసంహరించుకున్నారు. లాభదాయక పదవుల్లో ఉన్నారంటూ 20 మంది ఆప్ ఎమ్మెల్యేలను ఎన్నికల కమిషన్ అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. గత ఏడాది మార్చి నుండి సెప్టెంబర్ వరకు ఆప్ ఎమ్మెల్యేలు జంట పదవుల ద్వారా లబ్ధి పొందారని తమ వద్ద ఆధారాలున్నాయని ఎన్నికల కమిషన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేలు పార్లమెంటరీ కార్యదర్శులుగా కూడా బాధ్యతలు నిర్వహించారని, అది నిబంధనావళికి విరుద్ధమని ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఎమ్మెల్యేలందరూ పార్లమెంటు కార్యదర్శులుగా పదవులు చేపట్టారని, అందుచేత వారిని అనర్హులుగా ప్రకటిస్తున్నామని ఎన్నికల కమిషన్ ప్రకటించిన మరునాడే రాష్ట్రపతి కూడా దీనికి ఆమోదం తెలిపారు. దీంతో ఆప్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు.

పదుల సంఖ్యలో రోహింగ్యా గ్రామాలు నేలమట్టం

మయన్మార్ ప్రభుత్వం దుశ్చర్య

హింస సాక్ష్యాధారాలు రూపుమాపేందుకేనంటున్న మానవ హక్కుల సంస్థలు

మా సంస్కృతిని నాశనం చేశారని రోహింగ్యాల ఆందోళన



నెపిడా : డజన్ల కొద్దీ రోహింగ్యా గ్రామాలను మయన్మార్ ప్రభుత్వం ధ్వంసం చేసిందని ఉపగ్రహ చిత్రాల ద్వారా తెలుస్తోంది. ఉత్తర రాఖినె రాష్ట్రంలో గతంలో రోహింగ్యాలు నివసించిన పలు గ్రామాలు ఖాళీగా వున్నాయి. ఆ గ్రామాలన్నీ పూర్తిగా నేలమట్టమైనట్లు ఆ చిత్రాల ద్వారా వెల్లడవుతోంది. ఆ గ్రామాల్లోని భవనాలు, పొలాలు, చెట్లు అన్నిటినీ ధ్వంసం చేశారు. కొలరాడోకి చెందిన డిజిటల్ గ్లోబ్ ఈ చిత్రాలను మీడియాకు విడుదల చేసింది. గతంలో జరిగిన దానికన్నా ఎక్కువగా ఈ విధ్వంసం వున్నట్లు వెల్లడవుతోంది. గతేడాది ఆగస్టులో ఉత్తర రాఖినె రాష్ట్రంలో చెలరేగిన హింసాకాండతో లక్షలాదిమంది రోహింగ్యా ముస్లింలు బంగ్లాదేశ్‌కు పారిపోయారు. కాగా ఈ ప్రాంతాన్నంతటినీ పునర్నిర్మించేందుకే గ్రామాలను ధ్వంసం చేశామని ప్రభుత్వం చెబుతోంది. అయితే గతంలో హింస, అల్లర్లు, ఘర్షణలు చోటు చేసుకున్న ప్రాంతాలనే ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా నాశనం చేసిందని, ఆ హింసపై అక్కడ దర్యాప్తు జరిగేలోగా సాక్ష్యాధారాలను సమూలంగా నిర్మూలించేందుకే ఈ చర్య తీసుకుందని మానవ హక్కుల గ్రూపులు పేర్కొంటున్నాయి. బుల్‌డోజర్లు, ఇతర యంత్రాలతో 28 గ్రామాలను నేలమట్టం చేశారు. మంగ్డా చుట్టుపక్కల 50కిలోమీటర్ల పరిధిలో డిసెంబరు, ఫిబ్రవరి మాసాల మధ్య ఈ విధ్వంసం చోటు చేసుకుంది. అలా చదును చేసిన ప్రాంతాల్లో కొన్ని చోట్ల కొత్త భవనాలు, నిర్మాణాలు, హెలిపాడ్లు కనిపిస్తున్నాయి. అయితే ఇప్పటివరకు 55 గ్రామాలు నేలమట్టమయ్యాయని మానవ హక్కుల పర్యవేక్షణా సంస్థ తెలిపింది. అక్కడ చెట్లుచేమలు లేవు, భవనాలు లేవు, ప్రతీదాన్ని తుడిచిపెట్టేశారు. ఇవన్నీ కూడా నేరం జరిగిన ప్రాంతాలు కావడంతో ప్రస్తుత పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని మానవ హక్కుల నిపుణులు పేర్కొన్నారు. ఇది న్యాయాన్ని అడ్డుకోవడమే కాగలదని వ్యాఖ్యానించారు. కాగా తమ సంస్కృతిని నాశనం చేశారని రోహింగ్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ మిగిలిన వాటిని నాశనం చేసి తిరిగి మయన్మార్‌కు రాకుండా చేశారని విమర్శిస్తున్నారు.

ప్రత్యేకం

కాగితాల మీదే పెట్టుబడులు

సదస్సుల ఫలితం అంతంత మాత్రమే

న్యూఢిల్లీ : పెట్టుబడుల సదస్సుల్లో కుదుర్చు కుంటున్న ఎంఓయులు, పారిశ్రామిక వేత్తలు ఇస్తున్న హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ ఏడాది శీతాకాంలో 'మేగ్నటిక్ మహారాష్ట్ర, యుపి ఇన్వెస్టర్స్ సమ్మిట్ (పవరింగ్ ఎ న్యూ ఇండియా), బెంగాల్ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్, ఎపి పార్టనర్‌షిప్ సమ్మిట్, ఒడిషా స్టార్టప్ సమ్మిట్ ఇలా వరుసగా ఉన్నత స్థాయిలో జరిగిన కార్యక్రమాలు వార్తల్లో పతాక శీర్షికలకెక్కాయి. ప్రజలను ఆకర్షించాయి. ఈ సదస్సుల్లో కార్పొరేట్ నేతలు ప్రధాని మోడీ లేదా ఆయా రాష్ట్ర ముఖ్యమంత్రుల సమక్షంలో తమ పెట్టుబడుల లక్ష్యాలను ప్రకటించారు. కొత్తగా రానున్న ఉద్యోగాల సంఖ్యను వెల్లడిస్తూ యువతను ఊరించారు. రాజకీయ నేతల, శక్తుల దార్శనికత, వారి ఉత్తేజం, ఉత్సాహన్ని ప్రదర్శిం చేలా, భవిష్యత్తు అంతా ఆనందమయంగా వుంటుందన్న హామీలతో మొత్తంగా రంగుల దృశ్యాన్ని ప్రజల కళ్ళ ముందు ఆవిష్కరించారు. ఫిబ్రవరి 19, 20 తేదీల్లో జరిగిన మాగ్నటిక్ మహారాష్ట్ర సదస్సులో రు.16లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు వస్తాయని పారిశ్రామికవేత్తలు ప్రకటించారు. కొత్తగా 36.77 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తా మని హామీ ఇచ్చారు. 21, 22 తేదీల్లో జరిగిన యుపి సదస్సులో రు.4.28లక్షల కోట్ల మేరకు పెట్టుబడులకు, 40లక్షల ఉద్యోగాలకు హామీలు



వెల్లువెత్తాయి. అంతకుముందు జనవరి 16, 17 తేదీల్లో జరిగిన బెంగాల్ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో రు.22లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చేస్తున్నాయని ప్రకటించారు. 20లక్షల ఉద్యోగాలు సిద్ధంగా వుంటాయని చెప్పారు.

గతేడాది రీసర్జెంట్ రాజస్థాన్, హేపినింగ్ హర్యానా, మూమెంట్ జార్ఖండ్ సదస్సులు జరిగిన విషయాన్ని కూడా ఇక్కడ గుర్తుంచుకోవాలి. బిజెపి పలు రాష్ట్రాల్లో గెలిచిన తర్వాత దేశవ్యాప్తంగా మోడీ గుజరాత్ నమూనా అమలు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2003 నుండి ఇప్పటివరకు గుజరాత్‌లో ఇటువంటి సదస్సులు ఎనిమిది జరిగాయి. అందులో చివరిది గతేడాది జరిగింది. ఆ సదస్సులో రు.30 లక్షల కోట్ల మేరకు పెట్టుబడుల హామీలు వచ్చాయి. పలు రాష్ట్రాల్లో ఈ సదస్సుల సందర్భంగా వెల్లువెత్తిన పెట్టుబడుల్లో మెజారిటీ కేవలం ఆలోచనలు, ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయి. ప్రకటించిన వాటితో పోలిస్తే పూర్తయిన ప్రాజెక్టులపై గతేడాది జరిగిన అధ్యయనం వివరాలు దిగ్భ్రాంతి కలిగించేలా వున్నాయి. అనేక రాష్ట్రాల్లో 10 శాతం హామీలు కూడా అమలుకు నోచుకోలేదు. ఇదేమీ పెద్దగా ఆశ్చర్యం కలిగించదు. కేవలం ప్రజలను ఆకట్టుకోవడానికి, వారిని తమవైపు తిప్పుకోవడానికి చేసే కార్యక్రమాలే ఇవని అర్ధమవుతుంది. ఉద్యోగాల పేరుతో సామాన్య ప్రజలను తన వైపునకు ఆకట్టుకోవడానికి పాలక పార్టీలు చేసే ప్రయత్నాలే ఇవని స్పష్టమవుతోంది.

పారిశ్రామికవేత్తలు ప్రధానిని, ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులను, మంత్రులను తమ వాక్చాతుర్యంతో ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తూ వుంటారు. ఇక తెర వెనుక జరిగేది అంతా చాప కింద నీరులా సాగిపోతూ వుంటుంది. ప్రభుత్వం నుండి ఎంత వరకు పిండుకోవాలో అంతా పిండుకోవడానికి వ్యాపార దిగ్గజ సంస్థలు ప్రయత్నిస్తాయి. ముంబయి, పూనేల మధ్య హైపర్‌లూప్ నిర్మించడానికి సిద్ధమంటూ ఇటీవల మాగ్నటిక్ మహారాష్ట్రలో వచ్చిన ప్రతిపాదనకు రాష్ట్రప్రభుత్వం ఆమోదముద్ర వేయడానికి సిద్ధంగా వుంది. దీనికి ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానం అంతర్జాతీయంగా పరీక్షించ బడిందా లేదా అని కూడా చూడకుండానే ఆమోదం తెలిపారు. దీనికి సంబంధించిన కసరత్తు కూడా జరిగిపోయింది. హైపర్‌లూప్ వేస్తే రెండు ప్రాంతా ల మధ్య ప్రయాణ కాలం నాలుగు గంటల నుండి కేవలం 25నిముషాలకు తగ్గిపోతుందని చెప్పారు. కోటీ 50లక్షల మంది ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుందని, రు.3,50,000కోట్ల మేరకు ఆదా అవుతుందని చెప్పారు. ఇక్కడ కొన్ని వాస్తవిక గణాంకాలను పరిశీలించాల్సి వుంది. ఆర్‌బిఐ లెక్కల ప్రకారం 2016 మే నుండి 2017 డిసెంబరు వరకు 20 మాసాల్లో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ కేవలం 7.42శాతమే పెరిగింది. అంటే వార్షిక అభివృద్ధి కేవలం 4.5శాతం మాత్రమే. పరిశ్రమలకు అందిన పరపతి 2014 జూన్ నుండి 2017 అక్టోబరు వరకు చూసినట్లైతే కేవలం 3.6శాతం. అంటే వార్షిక అభివృద్ధి రేటు ఒక శాతం కన్నా తక్కువగా వుంది. వాస్తవానికి పరిశ్రమలకు బ్యాంక్ రుణం ఇటీవలి కాలంలో క్షీణించింది. స్థూల పెట్టుబడుల మొత్తం 2014-15లో 10.2శాతం వుండగా, 2015-16లో 6.3శాతం, 2016-17లో 5.2శాతం నమోదైంది. నిరుద్యోగం పెరిగిపోతోంది. ఎందుకంటే కొత్త పెట్టుబడులు రావడం లేదు, దాంతో కొత్త ఉద్యోగాలు కూడా రావడం లేదు. మరోవైపు, ఐటి వంటి పలు రంగాలు వున్న ఉద్యోగులను బయటకు పంపిస్తున్నాయి. మొత్తమ్మీద, భారత ఆర్థిక వ్యవస్థ కుదుపులతో కుంటినడక నడుస్తోంది. డిమాండ్ క్షీణిస్తోంది. దీనికి ప్రధాన కారణం పైన పేర్కొన్న పారిశ్రామిక గణాంకాలే. వ్యాపార, పారిశ్రామిక దిగ్గజాలు చేసిన ఏ వాగ్దానం లేదా హామీ కూడా పారిశ్రామిక డిమాండ్‌ను పెంచే పరిస్థితి కనపడడం లేదు. ఏవో ఇసుక రేణువుల్లాంటి ఫలితాలు మినహా ఈ పెట్టుబడుల సదస్సులేవీ కూడా అద్భుత ఫలితాలను ఇవ్వడం లేదని అర్థమవుతోంది.

సంక్షిప్తం

మేఘాలయలో కరుడుకట్టిన ఉగ్రవాది హతం

షిల్లాంగ్ : మేఘాలయలోని ఉత్తర గారో జిల్లాలో కరుడుకట్టిన ఉగ్రవాది, స్వయం ప్రకటిత గారో నేషనల్ లిబరేషన్ ఆర్మీ(జిఎన్‌ఎల్‌ఎ) అధ్యక్షుడైన సోహన్ డాల్‌బోట్ షైరా భద్రతాదళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమైనట్లు తెలిపారు. పలు ఉగ్రవాద ఘటనల్లో నందితుడై సోహన్‌పై రూ.పదిలక్షల రివార్డు ఉన్నట్లు అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు అచక్‌పెక్ గ్రామంలో జిఎన్‌ఎల్‌ఎ ఉగ్రవాదులు సమావేశమౌతుండగా, ఎస్‌ఎఫ్ 10 కమాండోలు కాల్పులు జరిపారని, ఈ సందర్భగా జరిగిన ఎదురుకాల్పుల్లో అతను మృతిచెందినట్లు మేఘాలయ పోలీస్ చీఫ్ స్వరాజ్ బిర్ సింగ్ తెలిపారు. అనంతరం మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఉగ్రవాదులను నిర్మూలించడంలో కృషిచేసిన భద్రతాదళాలను అభినందిస్తున్నట్లు మేఘాలయ ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా ట్విటర్‌లో తెలిపారు. మరో మూడురోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో ఈ ఘటన సంచలనం కలిగించిం దన్నారు. ఫిబ్రవరి 18న ప్రచారం ముగించుకుని తిరిగి వెళ్తున్న సంగ్మా కాన్వాయ్ లక్ష్యంగా ఉగ్రవాదులు జరిపిన మందుపాతర పేలుడులో ముగ్గురి మృతి చెందిన సంగతి తెలిసిందే.

మొగదిషులో జంట పేలుళ్ళు : 38 మంది మృతి

మొగదిషు : సోమాలియా రాజధాని మొగదీషులో శుక్రవారం జరిగిన జంట కారు బాంబు పేలుళ్ళ సంఘటనలో 38 మంది మృతి చెందినట్లు సంబంధిత వర్గాలు శనివారం వెల్లడించాయి. మొగదిషులోని ప్రెసిడెన్షియల్ పాలెస్‌ను, ఒక హోటల్‌ను లక్ష్యంగా చేసుకుని పేలుళ్ళు జరిగాయని నగరంలో ప్రధాన ఆమిన్ అంబులెన్స్ సర్వీస్‌కు చెందిన అబ్దుకదిర్ తెలిపారు. తొలుత విల్లా సోమాలియాకు సమీపంలో ఉన్న సెక్యూర్టీ చెక్‌పాయింట్ వద్ద కాల్పుల శబ్దాలు వినిపించాయని ఆ తరువాత కారు బాంబు దాడి జరిగిందని, ఆ తరువాత ఒక హోటల్ వద్ద రెండో కారు బాంబు పేలిందని పోలీసులు తెలిపారు.

ఈ దాడులకు తమదే బాధ్యత అని షబాబ్ ఇస్లామిస్ట్ మిలిటెంట్ గ్రూప్ ఆన్‌లైన్‌లో ఒక ప్రకటనను పోస్ట్ చేసింది.

ఆత్మాహుతి దాడులతో దద్దరిల్లిన ఆఫ్ఘనిస్తాన్

వేర్వేరు ఘటనల్లో 23మంది మృతి, పలువురికి గాయాలు

కాబూల్ : వరుస దాడులతో ఆఫ్ఘనిస్తాన్ దద్దరిల్లింది. దేశవ్యాప్తంగా శనివారం జరిగిన నాలుగు దాడుల్లో 23మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. కాబూల్‌లోని దౌత్య నివాసాలు గల ప్రాంతంలో ఆత్మాహుతి బాంబర్ పేల్చుకోవడంతో ఇద్దరు పౌరులు మరణించగా, ఏడుగురు గాయపడ్డారు. ఈ దాడిలో మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని భావిస్తున్నట్లు హోం మంత్రిత్వ శాఖ ప్రతినిధి నజీబ్ దానిష్ తెలిపారు.



మారణకాండ

నిత్య భీతావహ దృశ్యాలతో సిరియా అట్టుడుకుతోంది. సాయుధులు, ప్రభుత్వ బలగాల ఘర్షణల్లో ఒక్క వారం రోజుల్లోనే 500 మంది పౌరులు చనిపోయారని, వీరిలో 150 మంది పైగా చిన్నారులున్నారని సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ తెలిపింది.

చైనాలో వ్యవస్థాగత సంస్కరణలు

నేతల కసరత్తు

బీజింగ్ : పార్టీ, ప్రభుత్వ సంస్థల్లో చేపట్టాల్సిన వ్యవస్థాగత సంస్కరణల ప్రణాళికపై చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) నేతలు శనివారం చర్చించారు. ఇక్కడ సమావేశమైన సిపిసి పొలిటికల్ బ్యూరో కేంద్ర కమిటీ ఈ ప్రణాళికా ముసాయిదాపై చర్చించి, సమీక్ష నిమిత్తం 26నుండి జరగనున్న కేంద్ర కమిటీ మూడవ ప్లీనరీ సమావేశంలో ప్రవేశపెడుతుంది. చైనా లక్షణాలతో కూడిన సోషలిస్టు వ్యవస్థలో పార్టీ, ప్రభుత్వ సంస్థలనేవి కీలకమైన పాత్ర పోషిస్తాయని నేతలు పేర్కొన్నారు. పార్టీ నాయకత్వాన్ని, ప్రభుత్వ పాలనను మరింత మెరుగుపరిచేందుకు, ఈ వ్యవస్థను మరింత సమర్ధవంతంగా తయారు చేసేందుకు సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా వుందని పేర్కొన్నారు. ఈ కొత్త శకంలో తలెత్తే వివిధ అవసరాలను తీర్చేందుకు, కార్యకలాపాలను నిర్వహించేందుకు ప్రస్తుతమున్న పార్టీ, ప్రభుత్వ సంస్థల నిర్మాణం తగిన రీతిలో లేదని అభిప్రాయపడ్డారు. చైనా సోషలిస్టు వ్యవస్థ పూర్తి స్థాయి ప్రయోజనాలకు ఎదురయ్యే వ్యవస్థాగత అడ్డంకులను అధిగమించడానికి పార్టీ కృత నిశ్చయంతో సిద్ధం కావాల్సి వుందని పేర్కొన్నారు. అయితే ఈ ప్రణాళిక వివరాలు వెంటనే బయటకు వెల్లడి కాలేదు. 1980వ దశకం నుండి చైనా ప్రతి ఐదేళ్ళకూ వ్యవస్థాగత సంస్కరణలను చేపడుతోంది. కేంద్ర ప్రభుత్వాన్ని మరింత సమర్ధవంతంగా తీర్చిదిద్దే క్రమంలో ఇప్పటివరకు ప్రవేశపెట్టిన ఏడు సంస్కరణల ప్రణాళికలు అనేక మంత్రిత్వ శాఖలను, సంస్థలను కుదించుకుంటూ వచ్చాయి.

ఉత్తర కొరియాపై మరిన్ని ఆంక్షలు

- రెండో దశ ప్రారంభమైందన్న ట్రంప్
- ఇవి కూడా పనిచేయకపోతే ఇక వినాశనమేనని హెచ్చరిక
- 27 కంపెనీలు, 28 నౌకలపై ఆంక్షలు



వాషింగ్టన్ : ఉత్తర కొరియా తన అణు కార్యక్రమాన్ని విడనాడేలా ఒత్తిడి తెచ్చేందుకు గానూ పెద్ద మొత్తంలో ఆంక్షలు విధించినట్లు అమెరికా తెలిపింది. ఉత్తర కొరియాపై 'రెండో దశ' చర్యలు ప్రారంభమయ్యాయని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇప్పుడు తీసుకుంటున్న చర్యలు పని చేయకపోతే మరింత దురదృష్టకర పరిణామాలు సంభవిస్తాయని హెచ్చరించారు. ఉత్తర కొరియా అణు కార్యక్రమాన్ని అమెరికాకు అతిపెద్ద జాతీయ భద్రతా ముప్పుగా ట్రంప్ భావిస్తున్నారు. దీన్ని పరిష్కరించే క్రమంలో భాగంగా అమెరికా ఆర్థిక శాఖ తైవాన్ పాస్‌పోర్టు కలిగిన ఒక వ్యక్తితోపాటు, 27 కంపెనీలు, 28 నౌకలపై ఆంక్షలు విధించింది. ఐక్యరాజ్య సమితి ఆంక్షల కింద విడివిడిగా కొన్ని సంస్థలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని కూడా అమెరికా ప్రతిపాదించింది. చమురును పొందేందుకు, బొగ్గును విక్రయించేందుకు ఉత్తర కొరియా అక్రమంగా సముద్ర స్మగ్లింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తోందని ఆరోపిస్తున్న అమెరికా వాటిని నిలువరించేందుకు ఈ చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. అమెరికా ప్రధాన భూభాగాన్ని చేరగల సామర్ధ్యమున్న అణు క్షిపణులను ఉత్తర కొరియా అభివృద్ధిపరుస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్, కిమ్‌ల మధ్య తీవ్ర వాగ్యుద్ధం కూడా జరిగింది. యుద్ధం తప్పదన్న భయాందోళనలు కూడా తలెత్తాయి.

ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు దౌత్యపరమైన పరిష్కారాన్నే ఆశ్రయిస్తామని పదే పదే ట్రంప్ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఆగస్టులో ట్రంప్, ఆంక్షలను మించి వ్యవహరించాల్సి వుంటుందని హెచ్చరించారు.. ట్రంప్ సర్కార్ ప్రతిపాదించిన నిషేధాన్ని ఎదుర్కొనే సంస్థలకు అమెరికాలో వున్న ఆస్తులను స్తంభింప చేస్తారు. ఈ సంస్థలతో అమెరికా పౌరులెవరూ ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించరాదు. ఉత్తర కొరియా షిప్పింగ్, ట్రేడింగ్ కంపెనీల కార్యకలాపాలు నిలువరించేందుకు, ఆ దేశాన్ని మరింత ఏకాకిని చేసేందుకు ఈ ఆంక్షలు ఉద్దేశించబడ్డాయని అమెరికా ఆర్థిక శాఖ తెలిపింది. ఉత్తర కొరియా, చైనా, సింగపూర్, తైవాన్, హాంకాంగ్, మార్షల్ దీవులు, టాంజానియా, పనామా, కొమొరస్‌ల్లో గల రిజిస్టరైన నౌకలన్నింటికీ ఈ ఆంక్షలు వర్తిస్తాయి. ఐక్య రాజ్య సమితి ఆంక్షలను ఉల్లంఘించి గత నెల్లో ఉత్తర కొరియా రష్యాకు బొగ్గును తరలించిందని పశ్చిమ యూరోపియన్ వర్గాలు తెలిపాయి. రష్యా నుండి ఈ బొగ్గును దక్షిణ కొరియాకు, జపాన్‌కు రవాణా అయిందని పేర్కొన్నాయి. ఉత్తర కొరియా నౌకల్లోకి వెళ్ళి, సోదాలు జరిపే అవకాశాన్ని కూడా తోసిపుచ్చలేమని ఆర్థిక మంత్రి స్టీవ్ నుచిన్ తెలిపారు.

లూసియానా వర్శిటీలో కాల్పులు

ఇద్దరికి గాయాలు

లూసియానా : ఫ్లోరిడా స్కూల్లో కాల్పుల సంఘటన ఇంకా మరువకముందే లూసియానాలోని కాలేజీ ఆవరణలో శుక్రవారం తెల్లవారు జామున కాల్పులు చోటు చేసుకు న్నాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు గాయపడ్డారని కాలేజీ అధికా రులు తెలిపారు. కాలేజీలోని అసెంబ్లీ హాల్ సమీపంలో తెల్లవారు జామున 3గంటల సమయంలో కాల్పులు చోటు చేసుకున్నాయని లూసియానా యూనివర్శిటీ ప్రతినిధి ఎరిన్ కౌజర్ తెలిపారు. అసెంబ్లీ హాల్ వద్ద బాస్కెట్ బాల్, ఇతర క్రీడలు జరుగుతున్నాయి. విద్యార్థులకు, బయటివారికి మధ్య జరిగిన గొడవల్లో భాగంగా కాల్పులు జరిగినట్లు తెలుస్తోందని కౌజర్ తెలిపారు. అయితే ఈ కాల్పుల వల్ల క్లాసులు రద్దు కాలేదని తెలిపారు. అయితే గాయపడింది విద్యార్థులా కాదా అనేది కూడా స్పష్టంగా తెలియరాలేదు. వారిని వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్ళారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని, ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని ఆమె తెలిపారు.



తుపాకీ సంస్కృతిని వ్యతిరేకిస్తు నిరసన వ్యక్తం చేస్తున్న అమెరికన్లు

వైట్‌హౌస్ ఆవరణలోకి దూసుకువచ్చిన వాహనం



వాషింగ్టన్ : ఒక మహిళ తన వాహనంతో వైట్‌హౌస్ సమీపంలోని భద్రతా వలయాన్ని దాటుకుని లోపలకు దూసుకువచ్చింది. దీంతో ఒక్కసారిగా భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. వైట్‌హౌస్‌ను మూసివేశారు. ప్రస్తుతం వాషింగ్టన్‌లో పర్యటిస్తున్న ఆస్ట్రేలియా ప్రధాని మాల్కోమ్ టర్న్‌బుల్‌తో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమావేశమైన కొద్ది సేపటికే ఈ సంఘటన చోటు చేసుకుంది. అయితే తెల్ల చవర్లెట్ మినీవ్యాన్‌లో వచ్చిన ఆ మహిళ మానసిక పరిస్థితి బాలేదని, ఆమెను వెంటనే అరెస్టు చేశామని అమెరికా సీక్రెట్ సర్వీస్ తెలిపింది. ఎలాంటి కాల్పులు జరగలేదని, ఎవరూ గాయపడలేదని వరుస ట్వీట్లలో పేర్కొంది. వైట్‌హౌస్ చుట్టుపక్కల గల పలు బ్లాకులకు దారితీసే వీధులను బలగాలు చుట్టుముట్టాయి. దీంతో స్థానికంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

వైట్‌హౌస్ కాంప్లెక్స్‌లోని పశ్చిమ విభాగంలో ఈ సంఘటన జరిగింది. అమెరికా పతాక చిహ్నంతో వున్న మినీవ్యాన్ వేగంగా దూసుకురావడానికి సంబంధించిన వీడియో ఒకటి వైరల్ అవుతోంది. ఆ వ్యాన్ వెనక, పక్క కిటికీలు పగిలిపోయి వున్నాయి.

తుపాకీతో బెదిరిస్తూ ఒక వ్యక్తి ఆ వాహనాన్ని నడుపుతున్న మహిళను బయటకు లాగడానికి ప్రయత్నిస్తుండడం ఆ వీడియోలో కనిపిస్తోంది. ఇందులో తీవ్రవాదం కోణం లేదని భద్రతా సంస్థలు తోసిపుచ్చాయి. వైట్‌హౌస్‌కు ఇటువంటి సంఘటనలు కొత్తేమీ కాదు. గతేడాది మార్చిలో ఒక వ్యక్తి పెప్పర్ స్ప్రే బాటిల్‌తో వైట్‌హౌస్ ఆవరణలోకి దూకి దాదాపు 15నిముషాల పాటు హల్‌చల్ చేశాడు.

నేరాన్ని అంగీకరించిన ట్రంప్ మాజీ సలహాదారు

రష్యా ప్రమేయంపై దర్యాప్తులో సహకరిస్తానని వెల్లడి



వాషింగ్టన్ : అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాజీ సీనియర్ సలహాదారు రిక్ గేట్స్ తనపై మోపిన ఫెడరల్ కుట్ర, తప్పుడు ప్రకటనల అభియోగాలను అంగీకరించారు. తాను నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో రష్యా ప్రమేయంపై జరుగుతున్న దర్యాప్తుకు తాను సహకరిస్తానని చెప్పారు. ప్రత్యేక న్యాయవాది చేస్తున్న దర్యాప్తులో ప్రతివాదిగా వుండడానికి బదులుగా సహక రించే సాక్షి (అప్రూవర్)గా మారతానని చెప్పారు. 2016 అధ్యక్ష ఎన్నికల ప్రచారంపై జరుగుతున్న విచారణలో భాగంగా రాబర్ట్ ముల్లార్ నిర్వహించే దర్యాప్తునకు తాను పూర్తి స్థాయిలో అన్ని అంశాల్లో సహకరిస్తానని చెప్పారు. ట్రంప్ ఎన్నికల ప్రచార చైర్మన్ పాల్ మన్‌ఫర్ట్‌తో గేట్స్‌కు వ్యాపార సంబంధాలున్నాయి. మన్‌ఫర్ట్‌కు గల ఆస్తులు, ఉక్రెయిన్‌లో ఆయనకు రాజకీయ సంబంధాలు ఇతరత్రా విషయాలపై గేట్స్, ముల్లార్‌కు సమాచారం అందించడానికి సుముఖత వ్యక్తం చేశారు. వాషింగ్టన్‌లోని ఫెడరల్ కోర్టులో విచారణ సందర్భంగా గేట్స్ పై విజ్ఞప్తి చేశారు. అమెరికా అధ్యక్ష ప్రభావితం చేసేందుకు కుట్రకు పాల్పడ్డారని తనపై మోపిన అభియోగాలను ఆయన అంగీకరించారు. విచారణ పూర్తయితే ఆయనకు 57 నుండి 71 మాసాల పాటు జైలు శిక్ష పడే అవకాశముంది. 20వేల నుండి రెండు లక్షల డాలర్లు వరకు జరిమానా విధించే అవకాశాలు వున్నాయి. దర్యాప్తులో ఆయన సహకారాన్ని బట్టి శిక్ష కొంత తగ్గే అవకాశం వుండొచ్చు.

మొదటి పేజీ తరువాయి

ఔ నద్ధ కథకుడు మునిపల్లె రాజు కన్నుమూత

మండలం గరికపాడులో 1925, మార్చి 16న జన్మించారు. ఆయన తండ్రి హనుమంతరావు తల్లి శారదమ్మ. చిన్నప్పటి నుంచి కథా సాహిత్యంపై మక్కువ పెంచుకున్న మునిపల్లె రాజు 1943 నుండి 1983 వరకు భారత ప్రభుత్వ రక్షణ శాఖలోని ఇంజనీరింగ్ సర్వీసులో సర్వేయర్‌గా ఉద్యోగం చేశారు. ఆయన మొత్తం 69 కథలు రచించారు. 'అస్తిత్వనదం ఆవలి తీరాన'; 'దివోస్వప్నాలతో ముఖాముఖీ'; 'పుష్పాలు - ప్రేమికులు - పశువులు'; 'మునిపల్లె రాజు' పేరుతో నాలుగు కథా సంకనాలు వెలువరించారు. 'అలసిపోయినవాడి అరణ్యకాలు'; 'వేరొక ఆకాశం వేరెన్నో నక్షత్రాలు' పేరుతో రెండు కవితా సంపుటాలు ప్రచురించారు. రచయితలు, కవుల మీద ఆయన రాసిన సాహిత్య వ్యాసాలతో రెండు పుస్తకాలు వెలువరించారు.

'జర్నలిజంలో సృజనరాగాలు'; 'సాహితీ మంత్రనగరిలో సుస్వరాలు' అనేవే అవి. ఆయన రాసిన 'పూజారి' నవలనే 'పూజాఫలం' పేరుతో సినిమాగా బి.ఎన్.రెడ్డి వెండితెరకు ఎక్కించారు. 'అస్తిత్వనదం ఆవలి తీరాన' అనే చిన్న కథకు ఆయన 2006లో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు. అదే కథకు 2004లో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం వచ్చింది. అదే ఏడాది గోపిచంద్ పురస్కారం కూడా అందుకున్నారు. ఇలా ఆయనను ఎన్నో అవార్డులు, రివార్డులు వరించాయి. తెలుగులో మేజిక్ రియలిజంలో మొదటగా రాసిన రచయిత కూడా మునిపల్లె రాజే.

సాహితీ స్రవంతి సంతాపం

మునిపల్లె మృతిపట్ల సాహితీ స్రవంతి సంతాపం వ్యక్తం చేసింది. గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, అధ్యక్షులు వొరప్రసాదు, ప్రధాన కార్యదర్శి కె.సత్యరంజన్ ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాహితీ రంగానికి మునిపల్లె రాజు చేసిన కృషి మరువలేనిదని అన్నారు.

తవ్వేకొద్దీ కబ్జాలు

ఉమా అనుచరులే కీలకంగా ఉన్నారు. బాధితులు జాయింట్ కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయడంలో ఈ వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటి వరకూ బోండా ఉమా, అతని అనుచరులు స్వాధీనం చేసుకున్న భూముల విలువ సుమారు రూ.50 కోట్ల వరకూ ఉండొచ్చని అంచనా. పెనమలూరులో కొల్లి ఉమాదేవి, అట్లూరి లక్ష్మీ భవానికి చెందిన 80 సెంట్ల భూమిని బోండా ఉమా సన్నిహితులైన బిల్డర్లు వెంకటనరసయ్య, కిషన్‌లు డెవలప్‌మెంట్ కోసం అగ్రిమెంటు చేసుకున్నారు. దీని విలువ సుమారు నాలుగు కోట్ల వరకూ ఉంటుంది. ఆగ్రిమెంటు సమయంలో రూ.3.50 లక్షలు ఇద్దరు అక్కా చెల్లెళ్లకు ఇచ్చారు. రెండేళ్లు దాటినా ఇంతవరకు అక్కడ అభివృద్ధి చేయలేదు. దీనిపై ఎన్నిసార్లు వారిద్దరూ బిల్డర్లను అడిగినా స్పందన లేకపోవడంతో నిలదీశారు. దీంతో బిల్డర్లు వారిపై బెదిరింపులకు దిగారు. తాము స్థలం కోసం నాలుగు కోట్లు ఖర్చు చేశామని, నాలుగు కోట్లకు వడ్డీ కడితే దాన్ని ఇస్తామని బెదిరింపులకు దిగారు. దీనిపై ఎవరిని కలిసినా వారికి న్యాయం జరగకపోవడంతో శనివారం జాయింట్ కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని రాజరాజేశ్వరీపేటలోనూ 1700 గజాల భూమిని బోండా ఉమా అనుచరులు ప్రహరీకట్టి స్వాధీనం చేసుకున్నారు.

దీని విలువ సుమారు రూ.2.50 కోట్లు ఉంటుంది. ఏడుగురికి చెందిన ఆ స్థలాన్ని 2017లో ఆక్రమించేశారు. దీంతో బాధితులు పూర్తి ఆధారాలతో న్యాయస్థానం ద్వారా పోలీసులను ఆశ్రయించారు. 2017 డిసెంబరు 19న కేసు నమోదు చేసినా ఇంతవరకు నిందితులపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఇప్పటికీ ఆ భూమి బోండా అనుచరుల గుప్పిట్లోనే ఉంది. బాధితులు జెసి విజయకృష్ణన్‌కు తమ గోడు వెళ్లబోసుకున్నారు. న్యాయం చేయాలని వేడుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధులు కసిరెడ్డి సూర్యనారాయణ భూ బాగోతంపై విచారణ ప్రారంభించిన విజయ్‌కృష్ణన్‌కు బోండా ఉమా అనుచరుల భూ బాగోతాలపై వరుసగా ఫిర్యాదులు వస్తున్నాయి. సూర్యనారాయణ బంధువులు వెళ్లి వారి స్థలంలో హద్దు రాళ్లు పాతితే వెంటనే బోండా అనుచరులు వెళ్లి పీకేస్తున్నారు. దీంతో శనివారం వారు విజయ్‌కృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు.

ఉత్పత్తి కేంద్రంగా రాష్ట్రం

(మొదటిపేజీ తరువాయి)

పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని, అభివృద్ధికి సానుకూల ఫలితాలు ఉంటాయని అన్నారు. ఈ దిశలో కేంద్ర సర్కారు కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రిగా నరేంద్రమోడీ బాధ్యతలు తీసుకున్న తరువాత చేపట్టిన అతిపెద్ద ఆర్థికసంస్కరణగా నోట్లరద్దును ఆయన అభివర్ణించారు. నల్లధనాన్ని బ్యాంకులకు చేర్చడమే దీని ఉద్దేశ్యమని, ఆ మేరకు ఆశించిన లక్ష్యాలు వచ్చాయని తెలిపారు. అన్ని పార్టీల అంగీకారంతోనే జిఎస్‌టి అమలులోకి వచ్చిందని తెలిపారు. నోట్ల రద్దు కారణంగా ప్రస్తుతం దేశమంతటా బ్యాంకులు వడ్డీరేట్లు గణనీయంగా 8.2 శాతానికి తగ్గించాయని తెలిపారు. ప్రపంచంలోనే అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ దూసుకుపోతోందంటూ కితాబిచ్చారు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా గ్లోబల్ మార్కెట్‌లో ఇండియా ముందుందని ఐఎంఎఫ్ తాజా నివేదిక తెలుపుతోందన్నారు. దేశంలోని గుజరాత్, కర్నాటక, ఉత్తరప్రదేశ్ నేడు ఆంధ్రప్రదేశ్ ఇన్వెస్టర్ల మీట్‌లకు పోటీపడుతున్నాయన్నారు పారిశ్రామిక రంగంలో అవకాశాలకు ఆంధ్రప్రదేశ్ వేదికగా మారుతోందని చెప్పారు. ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం కారణంగా అత్యల్ప వృద్ధిరేటు 3.2శాతం ఉండగా మన దేశం 2017లో 7.2శాతం నుంచి 2018 సంవత్సరంలో 7.7శాతం వృద్ధిరేటును సాధించిందని చెప్పారు.

ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో మనదే అగ్రస్థానం :ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. మూడోసారి విశాఖలో సిఐఐ భాగస్వామ్య సదస్సులు నిర్వహించుకోవడం సంతోషదాయకమన్నారు. ప్రతి ఏడాదీ భాగస్వామ్య సదస్సు విశాఖలోనే నిర్వహించాలని నిర్ణయించడంతో ఇన్వెస్టర్లంతా ఉత్సాహంతో ఏటా ఇక్కడకు వస్తున్నారన్నారు. సిఐఐ ఇంతవరకూ 23 ఈవెంట్లను నిర్వహిస్తే అందులో 7 సదస్సులను ఇక్కడే నిర్వహించడం గర్వకారణమన్నారు. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఫుడ్‌ప్రోసెసింగ్, టూరిజం, ఏరోస్పేస్, టెక్స్‌టైల్స్, రెన్యువబుల్ ఎనర్జీ, మెడికల్ ఎక్విప్‌మెంట్ తదితర రంగాల్లో ఈ సదస్సుల్లో ఎంఒయులు చేసుకుంటున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. వ్యవసాయరంగంలో అద్భుత ఫలితాలు సాధించామని నేడు పరిశ్రమలు, సేవలరంగంపై దృష్టి సారించామని చెప్పారు. కేంద్రం సహకారంతో ఎపిలో రెండు పారిశ్రామిక కారిడార్లను (విసిఐసి, చెన్నయ్ బెంగళూరు) తీసుకొస్తున్నామని తెలిపారు. కోస్టల్ ఎంప్లాయ్‌మెంట్ జోన్ అభివృద్ధి చేస్తున్నామని, ఇది సాకారమైతే 31 లక్షల మందికి ఉద్యోగాలొస్తాయని చెప్పారు. ఎపిలో రియల్ టైం గవర్నన్స్ సమృద్ధిగా అమలు చేస్తున్నామన్నారు. ఆదానీ గ్రూప్ ఆధ్వర్యాన రూ.5 వేల కోట్ల పెట్టుబడితో శ్రీకాకుళం జిల్లాలోని భావనపాడు అభివృద్ధి చెందుతుందని, దేశంలోనే ఉత్తమ నౌకాశ్రయంగా భావనపాడు తయారవుతుందని చెప్పారు.

రెండో దఫా విద్యుత్ సంస్కరణలు

1998లో తాను విద్యుత్ సంస్కరణలను చేపట్టానని, మళ్లీ రెండో విడతకు శ్రీకారం చుట్టానని చంద్రబాబు ప్రకటించారు. అదే సందర్భంలో రాబోయేరోజుల్లో విద్యుత్ ధరలు పెంచనని మీ అందరికీ మాట ఇస్తున్నానంటూ భరోసా ఇచ్చారు. విద్యుత్ ధరలు తగ్గించేందుకే ప్రయత్నిస్తానన్నారు. 21 రోజుల్లో పరిశ్రమలకు అనుమతులు ఒక్క ఫోన్ కాల్‌తో ఇచ్చేస్తానన్నారు. విశాఖ సిఐఐ సదస్సులో కేంద్రమంత్రులు సురేష్‌ప్రభు, అశోక్‌గజపతిరాజు, పారిశ్రామిక వేత్త గౌతమ్ ఆదానీ, లూలూ గ్రూప్ చైర్మన్ యూసఫ్ ఆలీ, సిఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, సిఐఐ అధ్యక్షులు శోభన కామినేని తదితరులు వేదికపై ప్రసంగించారు.

తుస్సుమన్న పారిశ్రామిక విధాన సదస్సు

- కేంద్ర వాణిజ్య, పారిశ్రామిక మంత్రి సురేష్ ప్రభు డుమ్మా
- కాగితం చదివి వెళ్లిపోయిన రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి

జాతీయ పారిశ్రామిక విధానం (నేషనల్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ పాలసీ)పై ఒక విధాన పత్రం రూపొందించేందుకు శనివారం మధ్యాహ్నం సిఐఐ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సదస్సు 20 నిమిషాల వ్యవధిలోనే ముగిసింది. 12 గంటలకు ప్రారంభమైన ఈ సదస్సు 20 నిమిషాల్లో ఎలాంటి జాతీయ పారిశ్రామిక విధాన పత్రాన్ని తయారు చేయకుండానే ముగిసింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేష్‌ప్రభు ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ఇన్వెస్టర్లు, పారిశ్రామిక ఔత్సాహిక వేత్తలు, సిఐఐ ప్రతినిధులతో సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఆయన గైర్హాజరయ్యారు. రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి ఒక కాగితం తీసుకొచ్చి ఆంగ్లంలో చదివేసి ఆయన వెంటనే వెళ్లిపోవడంతో వేదిక మొత్తం ఖాళీ అయింది. సిఐఐ అధ్యక్షులు జిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ మాత్రమే స్టేజిపై మిగలడంతో హాజరైన పరిశ్రమలు, సంస్థలకు చెందిన ఔత్సాహికుల్లో ఉత్సాహం నీరుగారింది. పరిశ్రమల శాఖకు చెందిన రమేష్ అభిషేక్ ఈ సందర్భంగా ఉపాధి అవకాశాలపైనా, ఆధునాతన టెక్నాలజీ వినియోగంపైనా ప్రసంగించారు. ఆర్థిక వ్యవస్థ ప్రగతికి ఇండస్ట్రియల్ పాలసీ మాత్రమే 'ఇంజిన్' లాంటిదని కొనియాడారు. పారిశ్రామిక మౌలిక వసతులు అన్నవి దేశంలో నిధుల్లేక అవస్థలు పడుతున్న పరిస్థితులున్నాయని, కార్మికచట్టాలు, అద్దెకు వర్కర్లను తెచ్చుకోవడం, రెగ్యులర్ ప్రాతిపదికన కార్మికులను తీసుకోకపోవడం వంటి సమస్యలు కూడా పారిశ్రామిక విధానం రూపకల్పనకు ఆటంకంగా ఉన్నాయని తెలిపారు. ప్రతినిధుల నుంచి సందేహాలు, ప్రశ్నలు స్వీకరించిన తర్వాత ఇండస్ట్రియల్ పాలసీని రూపొందిస్తామని అభిషేక్ ప్రకటించారు. ఇ-కామర్స్ ఫోరం నుంచి కెకెచాంద్ మాట్లాడుతూ, పరిశ్రమలకు భూ సేకరణ, పర్యావరణ అనుమతులు పెద్ద సవాలుగా పరిణమించాయని, వివాదాల్లో ఉండే భూములను ప్రభుత్వం కేటాయించకుండా వాటన్నిటినీ పరిష్కరించి పరిశ్రమలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐఐ మాజీ రాష్ట్ర అధ్యక్షులు జి.శివకుమార్ మాట్లాడుతూ, ప్రపంచంలోని యుఎస్ఎ, ఆస్ట్రేలియా, సౌదీ వంటి చోట్ల పరిశ్రమలకు, ఉపాధి అవకాశాలకు రక్షణ ఉంటుందని, నైపుణ్యంగల మానవ వనరులను సమకూర్చుతారని, మన దగ్గర ఈ పరిస్థితులు లేవన్నారు. అనంతరం అర్ధాంతరంగా ఈ సదస్సు ముగిసింది.

ఎ కొండూరులో డయాలసిస్ సెంటర్

(మొదటిపేజీ తరువాయి)

కిడ్నీ రోగులను ఆయన శనివారం పరామర్శించారు. కిడ్నీ వ్యాధి తీవ్రతను తగ్గించటానికి ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్లోరైడ్ నీరు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉండడంతో ఏడాదిలోగా గోదావరి జలాలను చింతలపూడి వద్ద ఉన్న ఎత్తిపోతల పథకం ద్వారా రప్పించి సరఫరా చేస్తామన్నారు. ఈలోగా కృష్ణానది జలాలను ఆర్ఓ ప్లాంట్ల ద్వారానూ, ట్యాంకర్లతో ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా సరఫరా చేయిస్తామని వివరించారు. . మంత్రి వెంట నల్లగట్ల స్వామిదాస్, పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

ఎ.కొండూరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు : కలెక్టర్

ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సెంటర్‌ను యుద్ధప్రాతిపదికన ఏరాటు చేస్తున్నట్లు కలెక్టర్ బి.లక్ష్మీకాంతం ప్రకటించారు. ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెం పంచాయతీ శివారు మాన్‌సింగ్, దీప్లానగర్ తండాల్లో కలెక్టర్, ఆర్‌డిఒ చెరుకూరి రంగయ్య, తహశీల్దార్ సురేష్, వైద్యాధికారులతో కలిసి శనివారం పర్యటించారు. దీప్లానగర్‌లో డయాలసిస్‌తో బాధపడుతున్న భరోతు సక్రియా అనే మహిళను, మాన్‌సింగ్ తండాలో భరోతు చిన్నాను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ ఎ.కొండూరు మండలంతోపాటు జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా కిడ్నీ రోగులను గుర్తించి వారందరికీ ప్రభుత్వమే వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి దానికయ్యే ఖర్చును భరిస్తుందని చెప్పారు. ఎ.కొండూరు మండలంలోని తండాల్లో 19 మంది డయాలసిస్ రోగులను గుర్తించామన్నారు. వీరుగాక ఇంకా ఎవరైనా ఉంటే వారందరికీ డయాలసిస్ చేయిస్తామన్నారు. ఇకమీదట విజయవాడ వంటి సుదూర ప్రాంతాల్లోని కార్పొరేట్ వైద్యశాలలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మందులన్నీ ఎ.కొండూరు పిహెచ్‌సిలోనే అందజేస్తామన్నారు.

సిఎం సహాయ నిధి నుంచి ఆదుకోవాలి : సిపిఎం

లక్ష్మీపురం వచ్చిన మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును సిపిఎం పశ్చిమకృష్ణా కార్యదర్శి డి.వి.కృష్ణ కలిశారు. ఎ.కొండూరు మండలంలోని గిరిజన తండాల్లో కిడ్నీ వ్యాధుల తీవ్రత గురించి ఆయన వివరించారు. ముఖ్యమంత్రి ఆర్థిక సహాయనిధి ద్వారా ఆదుకునేందుకు కృషి చేస్తానని మంత్రి ప్రకటించారు. గిరిజన తండాల్లో కిడ్నీ వ్యాధుల సమస్యలపై సిపిఎం పశ్చిమకృష్ణా కమిటీ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనా కార్యక్రమాలు జరుగుతున్నాయి. సిపిఎం పోరాటం, ప్రజాశక్తి కథనాలతో ప్రభుత్వ యంత్రాంగం మొద్దునిద్ర వీడి ఎట్టకేలకు స్పందించింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు సిహెచ్.బాబూరావు, పశ్చిమకృష్ణా కమిటీ కార్యదర్శి డి.వి.కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు పి.వి.ఆంజనేయులు, ఎం ప్రభాకర్, ఎ.కొండూరు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు శెనగల రామకృష్ణారెడ్డి, ఆనందరావు నేతృత్వంలోని బృందం ఇటీవల తండాల్లో పర్యటించిన విషయం తెలిసిందే.

తొలిరోజు 77 ఎంఒయులు

(మొదటిపేజీ తరువాయి)

కుదరనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో 2వేల మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా ఎంఒయులు జరగనున్నాయని, ఇప్పటికే 1000 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తిని స్థాపించినట్లు వేదికపై చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రంలో సోలార్, విండ్ పవర్ అభివృద్ధికి గ్రిడ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పర్యాటకరంగం నుంచి 49 అవగాహన ఒప్పందాలు సుమారు రూ.8వేల కోట్ల విలువైనవి చంద్రబాబు ద్వారా ఒప్పంద పత్రాల మార్పిడి చేసుకున్నారు. టూరిజంలో ఎపిలో 32 వేల మందికి ఉద్యోగాలు రానున్నాయని సిఎం ప్రకటించారు.

ఇద్దరు రైతుల ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

రైతులకు నష్టపరిహారం వెంటనే అందించాలని కోరారు.

పత్తిరైతుదీ విషాదమే....

విజయనగరం జిల్లా కొమరాడ మండలం మసిమండ గ్రామానికి చెందిన గిరిజన రైతు జీలకర్ర చంద్రయ్య (55) తన రెండెకరాల భూమితోపాటు ఎనిమిదెకరాలు కొండపోడును సాగుచేసి పత్తిపంట వేశాడు. విత్తనాల నుంచి ఎరువుల వరకూ అప్పులు చేసి మదుపులు పెట్టాడు. పంట చేతికొస్తుందన్న ఆశతో ఉన్న చంద్రయ్యకు కాయదశలోనే నిరాశ ఎదురైంది. పంటకు పురుగు పట్టి పిందె దశలోనే పాడవ్వడంతో లక్షలాది రూపాయలు చేసిన అప్పులు ఎలా తీర్చాలోనన్న ఆందోళనతో తన ఇంట్లో పత్తి చేనుకోసం ఉంచిన పురుగు మందును తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న చంద్రయ్యను చూసి భార్య జమలమ్మ స్థానికుల సాయంతో కూనేరు రామభద్రపురం పిహెచ్‌సికి తరలించింది. అక్కడ వైద్యులు చికిత్స చేసినప్పటికీ పరిస్థితి విషమించి చంద్రయ్య మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.నకిలీ విత్తనాలే తమ కొంప ముంచాయని చంద్రయ్య భార్య కన్నీరుమున్నీరైంది.

విమర్శలపై 7న విశాఖలో సభ : వర్మ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మార్చి ఏడో తేదీన విశాఖలో సభ ఏర్పాటు చేస్తున్నానని వివాదాస్పద దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తెలిపారు. కొద్ది రోజులుగా తనపై వస్తున్న విమర్శలపై శనివారం ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. విమర్శలకు విశాఖ సభలో సమాధానం చెబుతానని తెలిపారు. తనపై విమర్శలు చేసేవారు కూడా అదేరోజు విశాఖలో సమావేశం నిర్వహించాలని, రెండు సభలకు ఎంతమంది వస్తారో ఒక్కరోజులో తెలిసిపోతుందన్నారు. తన సమావేశానికి యువత, కళాశాల విద్యార్థులు, గృహిణులు ఎక్కువ మంది రావాలని కోరారు. ఓ మీడియాలో తనపై వస్తున్న విమర్శలపైనా సమాధానం చెబుతానన్నారు.

మార్చి 7న పండ్ల తోటల రైతుల సదస్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పండ్ల తోటల రైతుల సమస్యలపై మార్చి 7న గుంటూరులో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై కేశవరావు, పి పెద్దిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణంలో మార్పుల వల్ల మామిడి పూత రాలిపోయి దిగుబడి రాలేదని, పండ్ల తోటలకి బీమా సౌకర్యం కల్పించకపోవడం వల్ల పండ్ల తోటల రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. పండ్ల పరిశ్రమలు లేకపోవడంతో పాటు ధరలు తగ్గిపోవడంతో రైతులు అప్పులపాలవుతున్నారని తెలిపారు. బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఈ సదస్సుకు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

విలన్లు.. హీరోలు వాళ్లే



సినిమా విడుదల తర్వాత థియేటర్లలో ప్రదర్శించేందుకు సర్వీస్ ప్రొవైడర్ సంస్థలైన క్యూబ్, యుఎఫ్ఓలు తమ నుంచి వసూలు చేసే అద్దె పెద్ద మొత్తంలో ఉంటోందని, అది తమ తలకు మించిన భారమవుతుందని నిర్మాతల ఆరోపణ. ఈ సమస్య పరిష్కారానికి దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, కేరళకు చెందిన నిర్మాత మండళ్ల అన్నీ కలిపి ఓ ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాయి. మార్చి రెండో తేదీలోగా సమస్య పరిష్కారం కాకపోతే యుఎఫ్ఓ, క్యూబ్‌లకు తమ కంటెంట్ ఇవ్వబోమని తుది గడువు విధించింది జేఏసీ. దీని కోసం డిసెంబర్ నుంచి రెండేసి సార్లు హైదరాబాద్, చెన్నైలోనూ, తాజాగా బెంగళూరులోనూ ఈ సమస్యపై చర్చించారు. అయినా పరిష్కారం కాలేదు. అసలు ఈ సమస్య ఎందుకు పరిష్కారం కాలేదన్నది అంతుచిక్కని ప్రశ్న. ఈ పరిష్కారం కాకపోవడానికి కారణం ఏమిటి? దీని వెనుక ఉన్నది ఎవరు? అన్నది తెలియాలి.

అసలు ఏం జరిగింది?

హాలీవుడ్‌లో ఉండే సర్వీస్ ప్రొవైడర్ల వ్యవస్థ ఇక్కడ కూడా 13 ఏళ్ల క్రితం నుంచి అమలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం తమ సినిమాను థియేటర్లలో ప్రదర్శించేందుకు గానూ నిర్మాతలు సర్వీస్ ప్రొవైడర్లకు ఐదేళ్ళు పాటు అద్దె చెల్లిస్తారు. ఐదేళ్ల తర్వాత ఉచితంగా వారు సేవలందించాలి. అయితే దక్షిణాది చిత్రసీమలో కూడా ఈ సర్వీస్ ప్రొవైడర్లు అదే ఆ నిబంధనతోనే వచ్చాయి. కానీ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్నది నిర్మాతల ఆరోపణ. ఈ విషయంపై చాలా కాలం నుంచి నిర్మాతలు గళమెత్తుతున్నా పట్టించుకోవడం లేదు. చివరకు నిర్మాత మండళ్ల ఈ సమస్య పరిష్కారానికి ఐక్య కార్యాచరణ కమిటీ వేసి చర్చించినా ఓ కొలిక్కి రాలేదు. అసలు ఎందుకు ఈ సమస్య జఠిలమవుతుందని ఆరా తీస్తే...ఈ సర్వీస్ ప్రొడవైడర్లను వెనుక ఉండి నడిపిస్తున్నది పెద్ద నిర్మాతలేనని తెలుస్తుంది. వాళ్లు ఎవరో కాదు... ఆ నలుగురే...అని అనుకుంటున్నారు. ఆ పెద్ద నిర్మాతలు నలుగురే యుఎఫ్ఓ, క్యూబ్ సంస్థలను నడిపిస్తుండడం, తేల్చాల్సి వాళ్లే ఓ కొలిక్కి రాకుండా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పటి వరకూ రీల్‌లో ఉండే ప్రదర్శన...టెక్నాలజీని పరిచయం చేసిందీ వాళ్లే...ఇప్పుడు ఇష్టమొచ్చినట్టు అద్దెలు వసూలు చేస్తున్నది వాళ్లే...మారుతున్న సాంకేతికను ముందే ఊహించి అన్ని థియేటర్లకు సర్వీస్ ప్రొవైడర్లు వీరే అయ్యేటట్టు జాగ్రత్త పడ్డారు. దానికనుగుణంగా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. దాదాపు అన్ని థియేటర్లు వీరి చేతిలో ఉన్నాయి.

వసూలు చేసే అద్దెలు

థియేటర్లలో హాలీవుడ్ సినిమా విడుదల చేస్తే ప్రొవైడర్లకు అద్దెగా ఏమీ చెల్లించనక్కర్లేదు. బాలీవుడ్ సినిమాలకు అద్దె పరిమితం. కానీ ప్రాంతీయ చిత్రాలకు ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. రీజినల్ సినిమాలకు వారానికి రూ.12వేలు చెల్లించాలి. అందులోనూ పెద్ద, చిన్న సినిమాలు అనే తేడా ఉండదు. చిన్న సినిమా బాగోపోతే ఒక్కరోజులోనే థియేటర్‌లో సినిమా కన్పించదు. కట్టిన డబ్బులు వెనక్కీ రావు.

తుట్ట కదిలింది ఇక్కడే...

ఇటీవల డిష్‌టీవీకి చెందిన డిజిటల్ సర్వీస్‌ప్రొవైడర్లు ఇండస్ట్రీలోకి ప్రవేశించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తాము చిన్న నిర్మాతలకు లాభసాటిగా ఉంటామనీ, కొన్ని సినిమాలకు ఉచితంగా సర్వీస్‌ను అందిస్తామని చెప్పడంతో అసలు తుట్ట కదిలింది.

డిజిటల్ వ్యవస్థ మొదలైందిలా...

సినిమాకు డిజిటల్ టెక్నాలజీ మొదట అమెరికాలో మొదలైంది. 'సొసైటీ ఆఫ్ మోషన్ పిక్చర్ అండ్ టెలివిజన్ ఇంజనీర్స్(అమెరికా) 2000 జనవరి 19న శ్రీకారం చుట్టింది. ఆ ఏడాది డిసెంబర్‌కల్లా అమెరికా, కెనడాలో 15 డిజిటల్ సినిమా స్క్రీన్స్ అందుబాటులోకి వచ్చాయి. అమెరికాలోని డిస్నీ, ఫాక్స్, ఎంజీఎం, పారామౌంట్, సోనీ పిక్చర్, యూనివర్సల్, వార్నర్ బ్రదర్స్ స్టూడియోలు కలసి ఓ అంగీకారానికి వచ్చి 'డిజిటల్ సినిమా ఇన్‌షియేటివ్' (డీసీఐ)గా ఏర్పడ్డాయి. 2002లో ఈ సర్వీస్ మొదలైంది. దీన్నే 'డీ' సినిమా' అంటారు. ఇది కాస్త ఖరీదవడంతో థియేటర్లను 'డీ సినిమా'కు అనుగుణంగా మార్పు చేస్తున్నప్పుడు ఆ ఏడు స్టూడియోల వాళ్లు ఓ నిర్ణయం చేశారు. ఎక్విప్‌మెంట్ కోసం తాము పెట్టిన ఖర్చు వచ్చేవరకూ 'వర్చ్యువల్ ప్రింట్ ఫీజు' (వీపీఎఫ్) వసూలు చేస్తామనీ, ఆ తర్వాత ఉచితంగా సేవలందిస్తామని చెప్పాయి. ఇప్పుడు అలాగే చేస్తున్నాయి. అందుకే మనదేశంలో ప్రదర్శించే ఆంగ్ల చిత్రాలకు వీపీఎఫ్ ఉండదు.

నిర్మాతల డిమాండ్లు

సమస్య పరిష్కారం కోసం ఐక్య కార్యాచరణ కమిటీ డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ ముందు ప్రధానంగా మూడు డిమాండ్లు ఉంచింది. మొదటిది.. వెంటనే వీపీఎఫ్ తగ్గించాలి, లేదా రద్దు చేయాలి. రెండోది... అలాగే సినిమా ప్రారంభంలో, మధ్యలో వేస్తున్న ప్రకటనలను ఎనిమిది నిమిషాలకు పరిమితం చేయాలి. మూడోది.. రెండు కొత్త సినిమాల ట్రైలర్స్ ప్రతి సినిమాతో ఉచితంగా ప్రదర్శించాలి. క్యూబ్ సిస్టమ్‌కు రెండు తెలుగు రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్‌గా నిర్మాత, పంపిణీదారుడు అల్లు అరవింద్, పిఎక్స్‌డికి నిర్మాత, ల్యాబ్ అధినేత రమేశ్‌ప్రసాద్ ఉండటంతో వీరిద్దరూ చొరవ తీసుకొంటే సమస్య మరింత త్వరగా పరిష్కారమవుతుందని చాలా మంది నిర్మాతలు అంటున్నారు. ఇప్పటి వరకూ వీళ్ల స్పందించలేదు.

మనదేశంలో ఇలా

మనదేశంలో డిజిటల్ ఫార్మట్‌లో తొలి సినిమా మణిరత్నం 'గురు' 2007లో విడుదలైంది. అప్పటి వరకూ ఒక సినిమా ప్రింట్ తీయడానికి రూ.60 నుంచి 70 వేల వరకూ ఖర్చయ్యేది. పెద్ద సినిమాకు కనీసం 400 ప్రింట్లు తీసేవారు. ఆ ఖర్చుతో పోలిస్తే డిజిటల్ సినిమాకు తక్కువ వ్యయమవుతుండటంతో డిస్ట్రిబ్యూటర్స్ సహజంగానే అటువైపు మొగ్గు చూపారు. ఈ విషయంలో మొదట ఎగ్జిబిటర్స్ కొంత అయోమయానికి గురైన మాట వాస్తవం.

ఈ డిజిటల్ సిస్టమ్ ఎక్కువ కాలం ఉంటుందా? ఉండదా?.. ఉండకపోతే పరిస్థితి ఏమిటి? అని ఎగ్జిబిటర్స్ ఆలోచిస్తున్న తరుణంలో 'డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్' (డి.ఎస్.పి.లు) రంగప్రవేశం చేసి 'డిజిటలైజేషన్ కోసం మీరేం ఖర్చు పెట్టనక్కర్లేదు. మీ థియేటర్ మాకు అప్పగిస్తే చాలు. అన్నీ మేమే మార్చేస్తాం' అని అప్పట్లో చెప్పారు. దానికనుగుణంగా డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ తయారు చేసిన నిబంధనలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

మొదట్లో వారానికి రూ. 7500 వీపీఎఫ్ వసూలు చేసేవారు. ఐదేళ్ల తర్వాత ఉచితంగా సర్వీస్ అందించాల్సిన సర్వీస్ ప్రొవైడర్లు ఇప్పుడది దాదాపు రూ. 30 వేల దాకా పెంచేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌గా క్యూబ్ సినిమా టెక్నాలజీ ప్రై.లి. (క్యూబ్), యుఎఫ్ఓ మూవీస్ ఇండియా లిమిటెడ్ (యుఎఫ్ఒ), ప్రసాద్ ఎక్స్‌ట్రీమ్ డిజిటల్ సినిమా నెట్‌వర్క్ (పిఎక్స్‌డి) ఉన్నాయి. ఇవి తమకు నచ్చినట్టు అద్దెలు వసూలు చేస్తూ, నింబధనలు ఉల్లంఘించడాన్ని నిరసిస్తూ నిర్మాతలు రోడ్డెక్కారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ రంగంలోకి దిగి, వాళ్లను చర్చలకు పిలిచింది. అయినా ఫలించలేదు. దీనిపై దక్షిణాది రాష్ట్రాల నిర్మాత మండళ్లతో ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి సన్నాహాలు చేసింది. మూడు సార్లు చర్చలు జరిగినా అవి సఫలం కాలేదు. చర్చలకు డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు వస్తే నిర్మాతలు రారు. వాళ్లు వస్తే వీళ్లు రారని జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు డి. సురేశ్‌బాబు చెబుతున్నారు.

విసిగిపోయి తీసుకున్న నిర్ణయం

థియేటర్లు మూసెయ్యడం వల్ల నిర్మాతలకే నష్టం. అయినా డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ వల్ల ఎంత విసిగిపోయి ఉంటే ఈ నిర్ణయం తీసుకొన్నామో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయంలో తెలంగాణ ఎగ్జిబిటర్స్ ముందడుగులో ఉన్నారని చెప్పాలి. మార్చి ఒకటి వరకూ ఆగకుండా తక్షణమే థియేటర్లు బంద్ చేద్దామని వాళ్లు అంటున్నారు. ప్రధానంగా ఉన్న మా మూడు డిమాండ్లలో రెండింటికి డి.ఎస్.పి.లు దాదాపుగా ఒప్పుకొన్నారు. ట్రైలర్స్ ఫ్రీగా వెయ్యడానికి అంగీకరించారు. యాడ్స్ తగ్గించే విషయంలో కూడా సుముఖత వ్యక్తం చేశారు.

– 'జెమినీ' కిరణ్, ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు

మల్టీస్టారర్ మొదలు



మణిశర్మ, సి. అశ్వనీదత్, నాని, టి. శ్రీరామ్ ఆదిత్య తదితరులు

నాగార్జున, నాని హీరోలుగా మల్టీస్టారర్ చిత్రం ఒకటి తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. వైజయంతి మూవీస్ పతాకంపై టి.శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో రూపొందునుంది. సి.అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం పాటల రికార్డింగ్ నాని పుట్టినరోజు సందర్భంగా శనివారం మహతి రికార్డింగ్ స్టూడియోలో ప్రారంభమైంది. గతంలో వైజయంతి మూవీస్ బేనర్‌లో 'ఆఖరిపోరాటం, ఆజాద్, రావోయి చందమామ' వంటి చిత్రాలు చేసిన నాగార్జున మరోసారి వైజయంతి బేనర్‌లో ఈ మల్టీస్టారర్ చేస్తున్నారు. నాని మొదటిసారి ఈ బేనర్‌లో నటిస్తున్నారు.

సి.అశ్వనీదత్ మాట్లాడుతూ 'నాగార్జున, నాని వెరైటీ కాంబినేషన్‌లో ఒక ఇంట్రెస్టింగ్ సబ్జెక్ట్‌తో ఎంటర్‌టైనింగ్ వేలో చాలా భారీగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. మా బేనర్‌లో వచ్చిన ఎన్నో మల్టీస్టారర్స్‌ని ఆదరించిన ప్రేక్షకుల్ని ఈ సినిమా తప్పకుండా ఆకట్టుకుంటుందన్న నమ్మకం ఉంది. మా బేనర్‌లో ఎన్నో మ్యూజికల్ హిట్స్ ఇచ్చిన మణిశర్మ సంగీత సారథ్యంలో పాటల రికార్డింగ్ ప్రారంభించాం. మార్చిలో షూటింగ్‌ని ప్రారంభిస్తాం' అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శ్యామ్‌దత్, ఎడిటింగ్: ప్రవీణ్‌పూడి, మాటలు: వెంకట్ డి. పట్టి, శ్రీరామ్ ఆర్. ఇరగం, స్క్రిప్ట్ అడ్వైజర్: సత్యానంద్.

ఆసక్తికరంగా 'కణం'

నాగశౌర్య, సాయిపల్లవి జంటగా ఎన్.వి.ఆర్. సినిమా సమర్పణలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కణం'. 'ఛలో' తర్వాత నాగశౌర్య చేస్తున్న విభిన్న కథా చిత్రమిది. ఈ చిత్రం మొదటి సింగిల్ 'సంజలి..'ను ఆదివారం విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు విజయ్ మాట్లాడుతూ "ఇది చాలా డిఫరెంట్ సబ్జెక్ట్. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఒక గొప్ప పాయింట్ ఇందులో ఉంది. చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది' అని అన్నారు.



సాయి పల్లవి

మహేష్ లాంటి గురువు అవసరం

మహేష్ గంగిమళ్ళ వంటి యాక్టింగ్ గురువు మన తెలుగు సినీ పరిశ్రమకి ఎంతో అవసరమని ప్రముఖ సినీ దర్శకులు శేఖర్ కమ్ముల అన్నారు. హైదరాబాద్ ఖాజాగూడలో నెలకొల్పిన యాక్టింగ్ రీసెర్చ్ సెంటర్‌ని ప్రారంభించిన తర్వాత శేఖర్ కమ్ముల ఆ సెంటర్‌లోని పూర్వ, ప్రస్తుత విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించారు. అభినయయోగం అనే నూతన ప్రక్రియతో నటన నేర్పుతున్న మహేష్‌లో డెడికేషన్, సిన్సియారిటీ అంటే తనకు ఇష్టం. అది నచ్చే ఇక్కడకు వచ్చాను. మహేష్ శిష్యుల నుంచి నటన రాబట్టుకోవడం దర్శకులకు ఎంతో సులువైన పని. తప్పకుండా దేశంలో ఇదో గొప్ప ఇన్‌స్టిట్యూట్ అవుతుంది' అని కమ్ముల అన్నారు.



మహేష్, శేఖర్ కమ్ముల


అటువంటివి అక్కర్లేదు



అనుపమ పరమేశ్వరన్

కొందరు డబ్బుల కోసం ఎలా పాత్రలు చేసేందుకైనా సిద్ధపడతారు. కొందరు విలువల కోసం, తన అభిరుచి మేరకే నటిస్తుంటారు. అటువంటి తారల్లో కొత్తగా వచ్చిన వారిలో సాయి పల్లవి, అనుపమ పరమేశ్వరన్ ఉంటారు. 'ప్రేమమ్'తో మంచి క్రేజ్‌ను సంపాదించుకున్న అనుపరమ పరమేశ్వరన్ తెలుగులో 'అ ఆ', శతమానం భవతి వంటి మంచి చిత్రాల్లో నటించింది. ఆ సినిమాల్లో కూడా తన పాత్రల్లో ఎక్కడా వల్గారిటీ ఉండదు. తాజాగా నానితో 'కృష్ణార్జున యుద్ధం'లో చేస్తుంది. ఇటీవల విడుదలైన ఓ పాటలో ఆమె ఎలా ఉండబోతుందో స్పష్టమైంది. అవకాశాలు రాకపోయినా ఫర్వాలేదు గానీ బికినీ వంటి దుస్తులు ధరించి స్కిన్ షో చేయబోనని ఓ దర్శకుడికి నిర్మొహమాటంగా చెప్పేసిందట. సాధారణ అమ్మాయి ఎలా ఉంటుందో అటువంటి పాత్రలనే తాను ఇష్టపడతానని చెప్పిందట. ఆ దర్శకుడు ఎంత చెప్పి ఒప్పించడానికి ప్రయత్నించినా అటువంటి పాత్రల తనకు అక్కర్లేదు అని స్పష్టం చేసిందట.

ఒకటో తేదీన తెలుస్తుంది



'కాలా' చిత్రం రజనీకాంత్

రజనీకాంత్ హీరోగా కొత్త సినిమా చేస్తున్నట్టు కళానిధి మారన్ ప్రకటించిన వెంటనే అభిమానుల్లో ఆనందం వ్యక్తమైంది. శంకర్ దర్శకత్వంలో ఆయన చేసిన '2.0' సినిమా వేసవికి విడుదలవుతుందనుకున్న తరుణంలో వీఎఫ్ఎక్స్ పనుల్లో జాప్యం వల్ల దాన్ని వాయిదా వేశారు. వెంటనే రజనీ మరోసారి గ్యాంగ్‌స్టర్‌గా చేస్తున్న 'కాలా' చిత్రాన్ని వేసవికి విడుదల చేస్తామని ఆ సినిమా నిర్మాత ధనుష్ వెల్లడించారు. ఈ సినిమాలో రజనీకాంత్ ఎలా ఉండబోతున్నారో? ఆయన గ్యాంగ్‌స్టర్‌గా పేదవారి పక్షాన్ని ఎలా పోరాడబోతున్నారో మార్చి ఒకటో తేదీన తెలుస్తుంది. ఎందుకంటే ఆరోజే 'కాలా' టీజర్‌ను అభిమానుల ముందుకు తీసుకొస్తున్నట్టు ధనుష్ శనివారం ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. నల్లదుస్తులతో ఉన్న రజనీ ఫొటోను పోస్టు చేశారు ధనుష్. ఈ చిత్రానికి పా. రంజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. 'కబాలి' తర్వాత రజనీ, రంజిత్ కాంబినేషన్ వస్తున్న చిత్రమిది. నానా పటేకర్, హ్యూమా ఖురేషీ, సంపత్ రాజ్, అంజలి పటేల్, పంకజ్ త్రిపాఠి తదితరులు ఈ సినిమాలో ముఖ్య తారాగణంగా నటిస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 27న విడుదల కానుంది.

ఏ మంత్రం వేశావే

'పెళ్లిచూపులు, అర్జున్ రెడ్డి' చిత్రాలతో యువతలో కథానాయకుడు విజయ్ దేవరకొండ సంపాదించిన పాపులారిటీ అంతా ఇంతా కాదు. తను నటిస్తున్న తాజా చిత్రం 'ఏ మంత్రం వేశావే'. శివానీసింగ్ నాయికగా నటిస్తుంది. గోలీసోడా ఫిలిమ్స్ నిర్మాణంలో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రై.లి.మల్కాపురం శివకుమార్ సమర్పణలో తెరకెక్కుతోంది. శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రాన్ని మార్చి 9న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ 'గేమ్ నేపథ్యంలో నడిచే విభిన్నమైన కథ ఇది. విజయ్ దేవరకొండ పాత్ర ఇందులో చాలా వైవిధ్యంగా, నేటి యువతరానికి ప్రతినిధిగా కనిపించబోతున్నాడు. విదేశాల్లో చిత్రీకరించిన సన్నివేశాలు చిత్రానికి హైలైట్' అని అన్నారు. శివన్నారాయణ, రాజబాబు, నీలాక్షిసింగ్, ఆశిష్‌రాజ్, ప్రభావతి, దీపక్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం : అబ్బూత్ సమత్, సినిమాటోగ్రఫీ: శివారెడ్డి.



'ఏ మంత్రం వేశావె'లో విజయ్ దేవరకొండ, శివానీ సింగ్

పైసా పరమాత్మ



లక్ష్మీ సుచిత్ర క్రియేషన్స్ బ్యానర్‌పై విజయ్‌కిరణ్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ విజయ్‌జగత్ నిర్మిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం 'పైసా పరమాత్మ'. సంకేత్, సుధీర్ హీరోలుగా అనూష, బనీష హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రం మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. నిర్మాత విజయ్‌జగత్ మాట్లాడుతూ 'డిఫరెంట్ కాన్సెప్ట్‌తో సస్పెన్స్ డ్రామాగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ఇటీవల షూటింగ్ ప్రారంభించి నాన్ స్టాప్‌గా హైద్రాబాద్‌లో రిచ్ లొకేషన్‌లలో షూటింగ్ చేశాం. దీంతో మొదటి షెడ్యూల్ పూర్తి అయింది. మార్చి మొదటి వారం నుంచి రెండో షెడ్యూల్ ప్రారంభిస్తాం. మా దర్శకుడు విజయ్‌కిరణ్ చెప్పిన స్టోరీ నచ్చి చేస్తున్నాం. ఇందులో రెండు పాటలు ఉన్నాయి. కనిష్క అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. రీ రికార్డింగ్‌కి ఎక్కువ స్కోప్ ఉన్న చిత్రం ఇది. సీనియర్ కెమెరామెన్ జి.ఎల్. బాబు మా సినిమాకి ఫెంటాస్టిక్ ఫోటోగ్రఫీని అందిస్తున్నారు. ప్రేక్షకులందరికీ నచ్చేవిధంగా ఈ చిత్రం ఉంటుంది" అని చెప్పారు.



ఇది నేను కాదు.. ఇంతకు మించి!

చరితను మార్చేసే కుర్రాళ్ల గురించి చెప్పుకుంటూపోతే వాళ్ల నైపుణ్యాలు, ప్రతిభాపాటవాలు, ఆశలూ, ఆశయాలు గురించి చాలా విశేషాలే రాయాలి. అవును మరి! అలాంటి కుర్రోళ్లు చదువుకున్నామా, ఏదో ఒకపని చేస్తూ సంపాదించుకుంటున్నామా, కార్లో షికార్లు చేస్తున్నామా.. అనేది అసలు కనపడదు. నేటి కుర్రాళ్లల్లో ఎప్పుడు చూడూ ఏదో ఒక కొత్తపని చేయాలి.. అందులోనూ ఛాలెంజింగ్ అనిపించే సాహసం ఉండాలని ఆలోచిస్తున్న కుర్రాళ్లు ఎక్కువయ్యారు. ఇలాంటి కోవలోకే వస్తాడు తెలుగబ్బాయి సాయితేజ. కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో మాస్టర్ మైండ్ అయినప్పటికీ.. అవేమీ సాయితేజని సంతృప్తిపరచలేదు. సాహసోపేతమైన పనేదో చేయాలనే తపన అతన్ని భారతదేశంలోనే మొదటి అగ్నిపర్వతారోహకుడిగా మార్చింది.. ఇంకా ఏమేం చేస్తున్నాడో చదవండి...

సాయితేజ పెద్దినేని పుట్టింది గుంటూరు. తాను ఎనిమిదో తరగతి చదువుకుంటుండగా హైదరాబాద్‌లో స్థిరపడింది కుటుంబం. అప్పటికే అతనికి కంప్యూటర్ జ్ఞానం అబ్బింది. పదకొండేళ్ల వయస్సులోనే ప్రోగ్రామింగ్‌లోకి అడుగుపెట్టాడు. ఎథికల్ హ్యాకింగ్‌లో ప్రావీణ్యం సాధించాడు. చదువుకునే వయసులోనే కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో మాస్టర్ అయిన సాయితేజ బి.టెక్‌లో చేరాడు. కానీ దాన్ని మధ్యలోనే వదిలిపెట్టాడు. అదేంట్రా..! అంటే, ఇంకేదైనా కొత్తదనం కావాలంటాడు. కొంతకాలం టెక్ ఎనలిస్ట్‌గానూ పనిచేశాడు. ఉద్యోగం చేసిందీ తక్కువ కాలమే. తర్వాత సొంత కంపెనీ ప్రారంభించాడు. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీలో సాయితేజ సేవలు గుర్తించి, 2015లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి అతనికి లక్ష రూపాయల నగదు చెక్కునూ బహూకరించారు. "ఇదీ కాదు... ఇంకేదో కావాలి. జీవితంలో సాహసంతో కూడిన పనేదో చేయాలి.." ఎప్పుడూ అతనిది ఇదే ధ్యాస. చాలాకాలం అదొక వ్యాధిలా అతన్ని పట్టి పీడించింది.

లావా అంటే భయం

ఇక వదిలేశాడు. అన్నింటినీ పక్కకు నెట్టాడు. కొన్నాళ్లు ఆంధ్రా, తెలంగాణ, కర్నాటకతో పాటు చుట్టుపక్కల రాష్ట్రాలు తిరిగాడు. అయినా తాను కోరుకున్న చోటుకి చేరలేదనిపించింది. ఇంకొన్నాళ్లు బైకింగ్‌తో కాలం వెళ్లదీశాడు. కానీ అంతకుమించిన సాహసం ఏదో చేయాలనే తపన ఇంకా పీడుస్తూనే ఉంది. ఇంతకుముందు ఎవరూ చేయని సాహసం ఒకటి చేయాలని అనుకున్నాడు. అప్పుడే తన చిన్నతనంలోని భయం గుర్తుకొచ్చింది. సాయితేజకి చిన్నప్పుడు అగ్నిపర్వతం నుంచి వచ్చే లావా అంటే చాలా భయం. అయితే ఇప్పుడు సమయమొచ్చింది... ఆ భయాన్నే జయించాలనుకున్నాడు. భగభగ మండుతూ ఉండే వాల్కనో (అగ్నిపర్వతం) ఎక్కడమే ఒక పెద్దసాహసం. స్కూబా డైవింగ్, స్కై డైవింగ్ కంటే వాల్కనో క్లైంబింగ్ కొద్దిగా ప్రమాదకరమే. భారతదేశం నుంచి ఇంతకుముందు అగ్నిపర్వాతాలు ఎక్కినవాళ్లు కనిపించలేదు అతనికి. ఇంకేముంది తాను కోరుకున్న సాహసోపేతమైన పని దొరికింది.

ఇందులోనూ కొత్తదనమే

అగ్నిపర్వతాలు ఎక్కడెక్కడున్నాయో ఇంటర్‌నెట్‌లో వెదకటం ప్రారంభించాడు సాయితేజ. అప్పుడు ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన వాల్కనో 'అమ్‌బ్రిమ్' తారసపడింది. దానిలోనే లావా లేక్‌నూ కలిగున్న ఈ వాల్కనో ఎక్కడం సులువుకానేకాదు. అందుకే దీనికంటే ముందు ఒక అగ్నిపర్వతాన్ని ఎక్కాలనుకున్నాడు. అదీ ఒక ఛాలెంజింగ్‌గా ఉండాలనుకున్నాడు. అప్పుడే అతనికి ఇండోనేషియా దగ్గరున్న 'డుకొనో' వాల్కనో గురించి తెలిసింది. ఇదీ ప్రమాదకరమైనదే. నిరంతరం మండుతుండే ఈ అగ్నిపర్వతంలో లావా బాంబ్‌లు పేలుతూనే ఉంటాయి. సుమారు 400 నుంచి 600 మీటర్ల వరకూ వచ్చిపడతాయి. అయితే ఈ వాల్కనో దగ్గరకి ఇంతకుముందు పెద్దగా వచ్చినవాళ్లూ లేరు. కనుక శాస్త్రీయంగా దానికి సంబంధించిన వివరాలు తెలియలేదతనికి. దగ్గర్లోని ఒక ఊళ్లో ఇద్దరు స్థానికులను వెంటబెట్టుకుని, వాల్కనోవైపు బయలుదేరాడు. స్థానికులను ఒప్పించి, తనతో తీసుకువెళ్లడానికే సాయితేజ నాలుగు నెలలు ఆ ప్రాంతంలో ఉండి, వారి భాష కొంత నేర్చుకున్నాడు. చివరికి వారిని ఒప్పించాడు. ఒక రాత్రి వాల్కనోకి 800 మీటర్ల దూరంలో నైట్ క్యాంప్ పెట్టుకున్నప్పుడు సరిగ్గా వంద మీటర్ల దూరంలో ఒక లావా బాంబ్ వచ్చిపడింది. అలాగే వాళ్లు పర్వతాన్ని చేరడానికి ఒక అడవి మార్గంలో నడుస్తున్నప్పుడు ఒక లోతైన గుంటలో పడిపోయాడు. గంటపాటు దాన్లోనే ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. ఏది ఏమైనప్పటికీ సాయితేజ 'డుకొనో' అగ్నిపర్వతానికి చేరుకున్నాడు. అది జీవితంలో కలిగే అత్యంత అరుదైన అవకాశం. దీనితర్వాత తూర్పు జావాలోని 'కావాహ్ ఈజెన్' అనే అగ్నిపర్వతాన్నీ చేరుకున్నాడు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల పూర్తిగా ఎక్స్‌ప్లోర్ చేయలేకపోయాడు కానీ, అదీ మరిచిపోలేని అనుభూతిని ఇచ్చింది అతనికి.



అగూంగ్ పర్వత

బాలీలోని అగూంగ్ వాల్కనో 2017లో పేలిన వార్తలు వార్త అందరికీ తెలిసే ఉంటుంది. కొన్నేళ్లు స్తబ్దుగా ఉన్న ఆ వాల్కెనో ఎప్పుడైనా పేలొచ్చనే వార్తలు అప్పట్లో గుప్పుమన్నాయి. అదే గనుక పేలితే భూమిపై వాతావరణమార్పులూ మారేంతటి ప్రభావం చూపిస్తుందని పరిశోధకులన్నారు. అలాంటి అగ్నిపర్వతాన్ని ఎలాగైనా సరే ఎక్కాలనే ఆశయంతో సాహసానికి ఒడిగట్టాడు. పది రోజులపాటు ఆ ప్రాంతంలోనే ఉండి, వాతావరణాన్ని పరిశీలించాడు. ఎంతమందిని బతిమాలినా ఎవ్వరూ అతని వెంట వెళ్లడానికి ఒప్పుకోలేదు. ఏదైతేనేమి, సాయితేజ అర్ధరాత్రి ఆ అగ్నిపర్వతంపైకి ప్రయాణం మొదలుపెట్టాడు. వాతావరణం ఎంతమాత్రమూ సహకరించలేదు. పర్వతాన్ని అధిరోహించే మార్గంలో ఆ వేడికి మాడిపోయిన చెట్లను నరుక్కుంటూ సగంపైనే దాటేశాడు. మిగతా సగం నడవడానికీ ఓపిక లేకపోయినా వెనుతిరిగేదే లేదనే నిశ్చయంతో ముందుకు కదిలాడు. ఆ పర్వతాన్ని ఒంటరిగానే అధిరోహించి భారతదేశం నుంచి అగూంగ్ అధిరోహించిన మొట్టమొదటి వ్యక్తిగా చరిత్రకెక్కాడు.




ఆ మార్పుకి నువ్వే కారణం

జీవితంలో ఏదో కొత్తదనం కావాలని కోరుకున్న సాయితేజ ఈ సాహసాన్ని తన ఇగోని సంతృప్తిపరచుకోవాలనో, లేదంటే పర్వతాన్ని జయించిన విజయోత్సాహం పొందాలనో చేయలేదంటే ఎవరైనా నమ్ముతారా? అవును నిజం. ఆ పర్వతాన్ని చేరుకున్న తర్వాత ఇండియన్ ఫ్లాగ్ దానిపై పాతినప్పుడు కలిగిన ఆనందం వర్ణించలేదంటాడతను. అయితే చిట్టచివరికి ఆ సాహసం తనని తాను తెలుసుకోవడానికే అని అంటాడు. ఇప్పుడు సాయితేజ 'అమ్‌బ్రిమ్' అగ్నిపర్వతాన్ని చేరడానికి సిద్ధపడుతున్నాడు. తన ఈ ప్రయాణాల్లో ఎన్నో ఆర్థికపరమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. కానీ అంతకుమించి "నువ్వు బతకాలి అనుకున్నప్పుడు పరిస్థితులన్నీ తప్పనిసరిగా మారతాయి. ఆ మార్పుకి నువ్వే కారణమవుతావు" అంటాడు సాయితేజ. ఏదేమైనా సంకల్పమే అందుకు ప్రధానబలం. ★

కట్ చేస్తే ట్రెండ్



చిన్ స్ట్రిప్
నిటారుగా గడ్డాన్ని పెదాన్నీ కలుపుతూ ఉండే సింపుల్ స్టైల్



పెన్సిల్-థిన్ మీసాలు
విభిన్నమైన హెయిర్ స్టైల్స్‌తో విసుగెత్తి సాధారణ మోడల్ కొనసాగించాలనుకుంటే ఈ మీసకట్టునూ ట్రై చేయొచ్చు.



యాంకర్ బియర్డ్
ఈ స్టైల్ రాక్‌స్టార్ మోడల్స్‌లో ఒకటికగా నిలిచింది.



రాయల్ మోడల్
చిన్ దగ్గర మాత్రమే ఉంటూ, కొద్దిగా వంగి ఉన్న మీసకట్టుతో రాయల్ లుక్ ఇస్తుంది.



హార్స్‌షూ మీసకట్టు
హార్స్‌షూ మీసకట్టు
ఈ స్టైల్ రఫ్ అండ్ టఫ్‌గా ఉండే వ్యక్తిత్వానికి సరిగ్గా సరిపోతుంది. ఇది పెదవుల పక్కనుంచీ గడ్డం కిందకు దిగే వరకూ సాగినట్లు ఉండే కౌబాయ్ స్టైల్ అనుకోవచ్చు.




గన్స్‌లింగర్ మోడల్
హార్స్‌షూ మీసాలు చివర్ల నుంచి కొనసాగిస్తూ దవడ ఎముక మీదుగా కనిపించే ఈ స్టైల్ భిన్నంగా కనిపిస్తుంది.



వాన్ డైక్ మోడల్
ఇది గోటీ బియర్డ్ మోడల్‌తో పాటుగా మీసకట్టు ఉండే స్టైల్.

షార్ట్ బాక్స్ మోడల్
సైడ్స్ ట్రిమ్ చేసుకున్న గడ్డంతో సమానంగా కనిపించే ట్రిమ్డ్ మీసకట్టు.





ఎటిట్ గోటీ
ఇదీ గడ్డాన్ని అంటిపెట్టుకుని చిన్నగా షేప్ తీసిన స్టైల్.



మటన్ చాప్స్ మోడల్
ఈ మోడల్ మీసకట్టు సింగం సినిమాలో సూర్య వాడినట్లే ఉంటుంది. కానీ ఇంకొద్దిగా దవడ కిందకు వెళుతుంది.

నేటితరం యువకులు స్టైల్‌కి ఇస్తున్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. అమ్మాయిలకి కనుబొమ్మల షేపింగ్ ఎంత ప్రాధాన్యమైందో అబ్బాయిలకి మీసకట్టు అంత స్టైల్‌ని తీసుకొస్తుంది. అందుకే బట్టల షాపులకు తగ్గకుండా సెలూన్ షాపులున్నాయి. ముఖానికి తగ్గట్టుగా మీసకట్టునూ, గడ్డం కటింగ్‌నూ వివిధ రీతుల్లో స్టైలింగ్ చేస్తున్నారు. కొందరు పాత మోడల్స్‌నే ఫాలో అవుతుంటే.. మరికొందరు విన్నూత్నంగా ట్రై చేస్తున్నారు. ఇంకొందరైతే అన్నింటినీ బ్రేక్ చేస్తూ విభిన్నంగా కనిపిస్తున్నారు. ఈ స్టైల్స్ చెప్పడం కన్నా చూస్తేనే అర్థమయ్యింది కదా! ఇంకెందుకాలస్యం స్టైల్ షేవింగ్‌లతో సందడి చేసేయండీ!

చిన్నారి



జోక్ :

టీచర్: పిల్లలూ! అబద్ధాలు చెప్పటం నేరం.. ఎప్పుడూ అబద్ధాలు చెప్పకూడదు. తెలిసిందా?

విద్యార్థి : అర్థం అయ్యింది టీచర్! అయితే రేపు ఎగ్జామ్‌లో వచ్చే ప్రశ్నలు ఏవో మీరు నిజం చెప్పండి?

పొడుపు కథ

పుల్లపుల్లని కాయలు,
చట్నీనిచ్చు కాయలు,
వేసవిలో ఎక్కువగా
రసం పిండుకుని తాగుతారు?

జవాబు : నిమ్మకాయలు



దారి కనిపెట్టండి!

పిల్లలూ..! పక్కనున్న చిత్రంలోని పువ్వు లోపలికి వెళ్ళి ఎటు నుంచి బయటకు రావాలో దారి కనిపెట్టండి !

అంబులెన్స్‌పై అక్షరాలు గమనించారా?



పిల్లలూ..! ఆపదలో ఉన్న రోగిని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లడానికి ఉపయోగించే వాహనం పేరు అంబులెన్స్. అంబులెన్స్ సైరన్ మోగుతూ వస్తుంటే ఎవరైనా సరే సైడ్ ఇవ్వాల్సిందే. ఒకవేళ ఆ వాహనానికి సైడ్ ఇవ్వకపోతే మన నిర్లక్ష్యం వల్ల ఒక్కోసారి రోగి ప్రాణాలనూ కోల్పోతాడు. అందుకే ఈ వాహనానికి ట్రాఫిక్ అవాంతరాలు ఏర్పడకుండా రోడ్డు మీద అందరినీ అప్రమత్తం చేయడానికి మూడు విధానాలను పాటిస్తారు. ప్రత్యేక శబ్దం వచ్చే సైరన్ మోగించడం ఒక పద్ధతి. రాత్రయినా, పగలైనా బాగా కనిపించేలా ప్రత్యేకమైనా ఎరుపు, నీలం రంగుల్లో తిరిగే లైటును వాహనం పైనా ఏర్పాటు చేయడం రెండవ పద్ధతి. అంబులెన్స్ వాహనం మీద అక్షరాలను దానికి ముందున్న వాహనాదారులు గుర్తించేలా రాయడం మూడవ పద్ధతి. అంటే ఆ అక్షరాలను తిరగేసి రాస్తారు. ఎందుకో తెలుసా? పిల్లలూ... రోడ్డు మీద వాహనాల డ్రైవర్లందరూ తమ వెనుక ఏయే వాహనాలు వస్తున్నాయో తెలుసుకోవడానికి 'రియర్ వ్యూ మిర్రర్' అనే చిన్న అద్దం ఉపయోగిస్తారు. దానిలో చూసినప్పుడు వెనకాల అంబులెన్స్ వాహనం మీద రాసిన అక్షరాలు సరిగా కనబడాలంటే వాటిని తిరగేసి రాయాలి. అప్పుడు ఆ అక్షరాలు అద్దంలో సరిగ్గా కనిపిస్తాయి. ఇలా ముందు ఉన్న వాహనదారుడు వెనుక అంబులెన్స్ వాహనం ఉందని తెలిస్తే వెంటనే దానికి దారి ఇస్తారు. అప్పుడు ఆ వాహనం త్వరగా వెళ్లి ఆ రోగి ప్రాణాలను కాపాడుతుంది. అంబులెన్స్‌కు సైడ్ ఇవ్వడం మనందరి కర్తవ్యం. ★



ఎత్తుకు పైఎత్తు



అనగనగా ఒక ఊరిలో చెరువు ఉంది. ఆ చెరువులో ఒక మొసలి ఉండేది. ప్రతిరోజూ అక్కడికి దాహంతో వచ్చిన జంతువులను అది చంపి తినేది. కొన్ని రోజులకు అక్కడికి జంతువులు రావాలంటే భయపడిపోయేవి. ఒకరోజు అక్కడికి నక్క వచ్చింది. ఇది గమనించిన మొసలి.. నక్కతో 'నక్కబావా! నక్కబావా! నాకు ఆహారం లేక రెండు రోజులైంది. నీవు నాకు ఆహారంగా ఏదైనా జంతువును తెచ్చిస్తే.. నీవు ఎప్పుడైనా ఈ చెరువులో నీళ్లు తాగవచ్చు' అని చెప్పింది. నక్క అలాగే అని అక్కడి నుంచి వెళ్లిపోయింది. కొంత సమయం తర్వాత ఒక జింకను తీసుకొని వచ్చింది. నక్క జింకతో 'ఇక్కడ నీళ్లు తాగుదాం!' అంది. జింక నీళ్లల్లో మొసలి ఉన్న విషయాన్ని కనిపెట్టేసింది. వెంటనే తెలివిగా సరే అంటూనే నీళ్లల్లోకి వంగినట్లు నటించింది. నక్కా నీళ్లల్లోకి వంగినట్లు వంగేసరికి.. జింక తెలివిగా నక్కను నీళ్లల్లోకి నెట్టేసింది. మొసలి నక్క తెచ్చిన ఆహారం ఇదేననుకుని నక్కను తినేసింది. జింక నక్క ఎత్తుకు పై ఎత్తు వేసి దాని ప్రాణాలను కాపాడుకుంది.


కథ సేకరణ: వి. గురుశరణ్ రెడ్డి, ఆర్. గౌతం
మూడవ తరగతి
శ్రీసాయి విజేత యు.పి. స్కూల్
పుట్లూరు
అనంతపురం జిల్లా.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మాచిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com





అరుణ కాంస్య కాంతులు

ప్రపంచ కప్‌లో హైదరాబాద్ జిమ్నాస్ట్‌కు కాంస్య పతకం



న్యూఢిల్లీ : హైదరాబాద్ అమ్మాయి జిమ్నాస్ట్ బుద్ధ అరుణ రెడ్డి జిమ్నాస్టిక్స్ ప్రపంచ కప్‌లో కాంస్యం సాధించి చరిత్ర సృష్టించింది. మెల్‌బోర్న్‌లో జరుగుతోన్న ప్రపంచ కప్ పోటీల్లో మహిళల వాల్ట్ విభాగంలో కాంస్యం నెగ్గిన అరుణ.. వ్యక్తిగత విభాగంలో పతకం సాధించిన తొలి భారతీయ మహిళా జిమ్నాస్ట్‌గా రికార్డు నెలకొల్పింది. పోటీల్లో రెండు రౌండ్లలో 13.649 సగటుతో అరుణ మూడో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో మరో భారత జిమ్నాస్ట్ ప్రణతి నాయక్ 13.416 సగటుతో ఆరో స్థానంలో నిలిచింది. ఫైనల్లో తొలి రౌండ్‌లో క్లిష్టమైన 4.600 లెవల్‌ను ఎంచుకున్న అరుణ, ఎగ్జిక్యూషన్‌లో 9.066 పాయింట్లు సాధించింది. రెండో రౌండ్‌లో మరింత క్లిష్టమైన 4.800 లెవల్లో పోటీపడిన అరుణ.. ఈ సారి ఎగ్జిక్యూషన్‌లో 8.333 పాయింట్లే పొందింది. తొలి రౌండ్లో 13.666, రెండో రౌండ్లో 13.633 ఫైనల్ పాయింట్లు సాధించిన అరుణ.. సగటున 13.649 పాయింట్లతో నిలిచింది. 13.800 పాయింట్లతో జాసా, 13.699తో ఎమిలీలు వరుసగా స్వర్ణ, రజత పతకాలు సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు ఇది మూడో జిమ్నాస్ట్ మెడల్. 2010 కామన్వెల్త్ గేమ్స్‌లో అశీష్ కుమార్ కాంస్యం సాధించగా, 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో దీప కర్మాకర్ సైతం కాంస్యమే గెల్చుకున్నది. తాజాగా తెలుగమ్మాయి అరుణ రెడ్డి ఏకంగా ప్రపంచకప్‌లోనే కాంస్యం కొట్టేసి కొత్త చరిత్రకు నాంది పలికింది.

అదరగొట్టారు

ఒకే పర్యటనలో రెండేసి సిరీస్‌లు నెగ్గిన అమ్మాయిలు, అబ్బాయిలు

ప్రజాశక్తి-కేప్‌టౌన్ : దక్షిణాఫ్రికా పర్యటనలో టీమ్ ఇండియా అమ్మాయిలు అరుదైన ఘనత దక్కించుకు న్నారు. ఆతిథ్య జట్టును చిత్తు చిత్తుగా ఓడించిన వరుసగా రెండో సిరీస్ సాధించారు. మిథాలీ రాజ్ (62, 50 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో చెలరేగిన వేళ.. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 166 పరుగులు చేసింది. యువ క్రికెటర్ జెమీమా రొడ్రిగస్ (44, 34 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ నమోదు చేసింది. బౌలర్లు రుమేలీ దార్ (3/26), శిఖా పాండే (3/16), రాజేశ్వరి గైక్వాడ్ (3/26)లు నిప్పులు చెరగటంతో ఛేదనలో దక్షిణాఫ్రికా 112 పరుగులకే కుప్పకూలింది. అర్ధ శతకంతో మెరిసిన మిథాలీరాజ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డుతో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గానూ నిలిచింది.

బౌలర్ల భళా : లక్ష్యం భారీగా ఉన్నా.. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై విజయంతో సిరీస్ సమం చేయాలని దక్షిణాఫ్రికా ఆశించింది. కానీ సహకారం లభించని పిచ్ నుంచి సైతం మనోళ్లు వికెట్లు కూల్చారు. సఫారీని ఛేదనలో ఏ దశలోనూ ముందడుగు వేయనీయలేదు. ఫామ్‌లో ఉన్న స్టార్ బ్యాట్స్‌వుమెన్, కెప్టెన్ వాన్ నికెర్క్ (10)ను ఆరంభంలోనే వెనక్కి పంపిన రుమేలీ దార్ (జులన్ గోస్వామి గాయంతో సిరీస్‌కు దూరం కాగా, ఆమె స్థానంలో కొత్తగా జట్టులోకి వచ్చిన బౌలర్) ఆతిథ్య జట్టుకు షాకిచ్చింది. మరో ఓపెనర్ లిజెలి లీ (3)ని సైతం రుమెలీ ఎంతో సేపు క్రీజులో కొనసాగనీయలేదు. మూడోస్థానంలో వచ్చిన సునె లిస్ (5)ను శిఖా పాండే బలిగొన్నది. దీంతో 20/3తో దక్షిణాఫ్రికా కష్టాల్లో పడింది. ఈ దశలో డు ప్రీజ్ (17), చొలె ట్రయాన్ (25)లు నాల్గో వికెట్‌కు 20 పరుగులు జోడించా రు. ప్రీజ్ మూడు బౌండరీలతో ఎదురు దాడి చేసే ప్రయ త్నం చేసిం ది. శిఖా పాం డే బౌలింగ్‌లో కవర్స్‌లో భారీ షాట్‌కు పోయి న ప్రీజ్ అక్కడ మిథాలీకి చిక్కింది. డి క్లెర్క్ (4)ను వచ్చీ రాగానే శిఖానే అవుట్ చేసింది. కానీ ట్రయాన్‌తో కలిసి కాప్ (27) కొద్దిసేపు వికెట్ల పతనాన్ని నిలువరించింది. ఈ సమయంలో రాజేశ్వరి గైక్వాడ్, పూనమ్ యాదవ్‌లు వికెట్ల వేటలో నిమగ్నమయ్యారు. దీంతో ఒక్కొక్కరుగా పెవిలియన్‌కు పోవటం సఫారీ వంతైంది. మరో 12 బంతులుండగానే దక్షిణాఫ్రికాను కుప్పకూల్చిన అమ్మాయిలు 54 పరుగుల తేడాతో భారీ విజయం దక్కించుకున్నారు. యువ క్రికెటర్ జెమీమా రొడ్రిగస్ కండ్లుచెదిరే క్యాచ్‌తో విశేషంగా ఆకట్టుకున్నది. మరిజానె కాప్ మిడ్ వికెట్ మీదుగా సిక్సర్ సంధించబోగా.. బౌండరీ లైన్ వద్ద అద్భుత నియంత్రణతో రొడ్రిగస్ క్యాచ్ ఒడిసిపట్టేసింది. జెమీమా ఫీల్డింగ్ నైపుణ్యంతో క్రికెట్ పండితుల మార్కు లు కొట్టేసింది.

మిథాలీ మెరిసెన్ : టాస్ ఓడి తొలుత బ్యాటిం గ్‌కు వచ్చిన టీమ్ ఇండియాకు ఓపెన ర్లు శుభారంభం అందిం చారు. సీనియర్ బ్యాట్స్ వ ు ె న ్ మిథాలీరాజ్ (62, 50 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), స్మృతి మంధాన (13)లు తొలి వికెట్‌కు 32 పరుగులు జోడించారు. మూడు ఫోర్లతో జోరందుకున్నట్టే కనిపిం చిన స్మృతి మం ధాన ఇన్ని ంగ్స్ ఐదో ఓవర్లో వికెట్ కోల్పో యింది. కాప్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి నిష్క్రమిం చింది. మూడో స్థానంలో వచ్చిన జెమీమా రోడ్రిగస్ (44, 34 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మిథాలీతో కలిసి చెలరేగింది. ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లతో మిథాలీ రాజ్ మరో అర్ధ సెంచరీ నమోదు చేయగా.. మరో ఎండ్‌లో జెమీమా సైతం దుమ్మురేపింది. మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో చెలరేగింది. వీరిద్దరి జోరుతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. రెండో వికెట్‌కు ఈ జోడీ 98 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేసింది. ఆఖర్లో మిథాలీ, జెమీ మాలు ఇద్దరూ స్వల్ప వ్యవధిలోనే అవుట య్యారు. అయినా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (27, 17 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధనాధన్ ముగింపు నిచ్చింది. వేద కృష్ణమూర్తి (8) సైతం రాణిం చింది.

స్కోరు వివరాలు : భారత్ ఇన్నింగ్స్ : మిథాలీరాజ్ (సి) లీ (బి) షబ్నిం 62, స్మృతి మంధాన (సి) క్లాస్ (బి) కాప్ 13, జెమీమా రొడ్రిగస్ (సి,బి) కాకా 44, హర్మన్‌ప్రీత్ కౌర్ నాటౌట్ 27, వేద కృష్ణమూర్తి రనౌట్ (కాప్) 8, **ఎక్స్‌ట్రాలు :** 12, మొత్తం : (20 ఓవర్లలో 4 వికెట్లకు) 166.

వికెట్ల పతనం : 1-32, 2-130, 3-134, 4-166. **బౌలింగ్ :** మరిజానె కాప్ 4-1-22-1, అయబోగ కాకా 4-0-41-1, షబ్నిం ఇస్మాయిల్ 4-0-35-1, మసబటా క్లాస్ 2-0-21-0, వాన్ నికెర్క్ 4-0-22-0, రైసిబె 2-0-21-0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : లిజెలి లీ (సి) పూనమ్ యాదవ్ (బి) రుమెలి దార్ 3, వాన్ నికెర్క్ (సి) శిఖా పాండే (బి) రుమెలి దార్ 10, సునె లుస్ (బి) శిఖా పాండే 5, డు ప్రీజ్ (సి) మిథాలీరాజ్ (బి) శిఖా పాండే 17, చొలె ట్రయాన్ (సి) హర్మన్‌ప్రీత్ కౌర్ (బి) రాజశ్వరి గైక్వాడ్ 25, డి క్లెర్క్ (బి) శిఖా పాండే 4, మరిజానె కాప్ (సి) రొడ్రిగస్ (బి) రుమెలి దార్ 27, షబ్నిం ఇస్మయిల్ (స్టంప్డ్) తనీయ భాటియా (బి) పూనమ్ యాదవ్ 8, మసబటా క్లాస్ (స్టంప్డ్) తనీయ భాటియా (బి) రాజేశ్వరి గైక్వాడ్ 9, అయబోగ కాకా (సి) స్మృతి మంధాన (బి) రాజేశ్వరి గైక్వాడ్ 1, రైసిబె నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 03, మొత్తం : (18 ఓవర్లలో ఆలౌట్) 112. **వికెట్ల పతనం :** 1-12, 2-18, 3-20, 4-40, 5-44, 6-71, 7-100, 8-108, 9-112, 10-112. **బౌలింగ్ :** పూజ 3-1-14-0, శిఖా పాండే 3-0-16-3, రుమెలీ దార్ 4-0-26-3, పూనమ్ యాదవ్ 4-0-25-1, రాజేశ్వరి గైక్వాడ్ 3-0-26-3, హర్మన్‌ప్రీత్ కౌర్ 1-0-5-0. 1 : దక్షిణాఫ్రికా గడ్డపై ఒకే పర్యటనలో రెండు సిరీస్‌లు సాధించిన తొలి జట్టు భారత్. 2-1తో వన్డే ట్రోఫీ, 3-1తో టీ20 కప్పును మన అమ్మాయిలు గెలుపొందారు.

> మన అమ్మాయిలు చరిత్ర సృష్టించారు. సఫారీ గడ్డపై ఒకే పర్యటనలో రెండు సిరీస్‌లు సాధించిన తొలి జట్టుగా రికార్డు నెలకొల్పారు. కేప్‌టౌన్‌లో జరిగిన ఐదో టీ20లో 54 పరుగులతో గెలుపొందిన టీమ్ ఇండియా.. 3-1తో పొట్టి సిరీస్ సొంతం చేసుకున్నది. మిథాలీ రాజ్ అర్ధ శతక మెరుపులతో సఫారీ బౌలర్లపై విజృంభించింది. సుదీర్ఘ విరామానంతరం అంతర్జాతీయ సర్క్యూట్‌లో అడుగుపెట్టిన భారత అమ్మాయిలు.. దక్షిణాఫ్రికాను రెండు ఫార్మాట్లలోనూ చిత్తు చేశారు. రెండు కప్పులతో సగర్వంగా స్వదేశా నికి రానున్నారు.



టి20 సిరిస్ మనదే

- 7 పరుగుల తేడాతో భారత్ విజయం
- మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రైనా

కేప్‌టౌన్ : నిర్ణయాత్మక మూడో ట్వంటీ మ్యాచ్‌లో భారత్ జట్టు విజయం కోసం చెమటోడ్చాల్సి వచ్చింది. చివరి ఓవర్లో భువనేశ్వర్ అద్భుత బౌలింగ్‌తో సఫారీ ఓటమిని శాసించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టులో టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్లు శిఖర్‌ధావన్, సురేష్ రైనా రాణించారు. అనంతరం బౌలర్లు సమిష్టిగా రాణించడంతో ఆఖరి మ్యాచ్ భారత్ వశమైంది. మూడు ట్వంటీ మ్యాచుల్లో 2-1 తేడాతో భారత్ సీరిస్‌ను కైవసం చేసుకుంది. బౌలింగ్‌లో భువనేశ్వర్ దక్షిణాఫ్రికాను తొలి దెబ్బ తీశాడు. పది పరుగుల వద్ద ఓపెనర్ రీజా హెన్డ్రిక్స్‌ను పెవిలియన్‌కు పంపాడు. పార్ట్‌టైమ్ బౌలర్ రైనా కూడా ప్రమాదకర బ్యాట్స్‌మెన్ డేవిడ్ మిల్లర్‌ను త్వరగా ఔట్ చేయడంతో సఫారీల స్కోరు బోర్డు నెమ్మదించింది. మరోవైపు విధ్వంసకర బ్యాట్స్‌మెన్ క్లాసెన్‌ను కేవలం ఏడు పరుగులకే ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వెనక్కి పంపాడు. ఓ వైపు వికెట్లు పడుతున్నా కెప్టెన్ డుమినీ క్రిస్టియన్ సహకారంతో స్కోరుబోర్డు వేగం పెంచే ప్రయత్నం చేశాడు. 38 బంతుల్లోనే మూడు సిక్సర్లు, రెండు ఫోర్ల సహాయంతో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఆ వెంటనే ఊపుమీదున్న డుమినీని శార్దూల్ ఠాకూర్ పెవిలియన్ బాట పట్టించాడు. అనంతరం క్రీజులోకొచ్చిన క్రిస్ మోరీస్‌ను బుమ్రా క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో 20 పరుగులు చేయాల్సి ఉండగా భువనేశ్వర తనదైన శైలిలో బౌలింగ్ చేసి చివరి బంతికి సైతం వికెట్ తీసి భారత జట్టుకు విజయాన్నిందించాడు. తొలుత టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా బౌలింగ్‌ను ఎంచుకొంది.

తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ క్రికెట్ జట్టుకు ఆదిలోనే కెప్టెన్ రోహిత్‌శర్మ రూపంలో తొలిదెబ్బ తగిలింది. 14 పరుగులకే వికెట్ కోల్పోయిన భారత్ జట్టును శిఖర్‌ధావన్, సురేష్‌రైనా ఆదుకున్నారు. వీరిద్దరూ రాణించడంతో స్కోరుబోర్డు పరుగులెత్తింది. మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్లు మనీష్‌పాండే, ధోనీ, దినేష్‌కార్తీక్ నిరాశపరచడంతో స్కోర్‌బోర్డు వేగం మందగించింది. చివర్లో ఆల్‌రౌండర్ హార్దిక్‌పాండ్యా ఆదుకోవడంతో భారత జట్టు 20 ఓవర్లలో 172 పరుగులకు చేయగలిగింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో జూనియర్ డాలా మూడు వికెట్లు తీసి భారత్‌ను దెబ్బ తీశాడు. క్రిస్ మోరీస్, షాంషీ ఒక వికెట్ తీశారు.



క్రికెట్, ఖోఖోలో విజేతలకు ట్రోఫీలను అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ఎస్ఎఫ్ఐ క్రికెట్ టోర్నీ విజేత ఇంజినీరింగ్ కాలేజీ

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

విద్యార్థులకు క్రీడల్లోనూ ప్రావీణ్యం అవసర మని మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణ రావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యంలో ఈనెల 17వ తేదీ నుండి ఎస్ఎఫ్ఐ నిర్వహించిన క్రికెట్, ఖోఖో పోటీలు శనివారం ముగిశాయి. క్రికెట్‌లో 32 జట్లు పాల్గొనగా, ఖోఖోలో ఎనిమిది జట్లు తలపడ్డాయి. క్రికెట్‌లో ఇంజినీరింగ్ కళాశాల విజేత గాను, ఇఇ విభాగం రన్నర్స్‌గాను నిలిచాయి. ఖోఖోలో జిసిఇ జట్లు విజయం సాధించగా సిఎస్ఇ జట్టు రెండో స్థానాన్ని దక్కించుకుంది. శనివారం నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో విజేతలకు ట్రోఫీలను లక్ష్మణరావు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమస్యలపై ఎలా పోరాడాతారో క్రీడల్లో గెలుపు కోసమూ అదేవిధంగా పోరాడాలని చెప్పారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గెలుపోట ములతో ఆగిపోకుండా నిరంతరం శ్రమించాలన్నారు. కార్య క్రమంలో టూరిజం విభాగం అధ్యాపకులు రెహ్మాన్, మ్యాథమెటిక్స్ విభాగం అధ్యాపకులు సత్యనారా యణ, వికాస జాయింట్ సెక్రటరీ భాను ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మనోజ్‌కుమార్, భగవాన్‌దాస్, ఎఎన్‌యు నాయకులు కిరణ్, సురేఖ, అమూల్య పాల్గొన్నారు.



ఫైనల్లో సమీర్ వర్మ

- సెమీ ఫైనల్లో కాంటఫోన్‌పై 2-1తో గెలుపు
- స్విస్ ఓపెన్



బేసెల్ : భారత యువ షట్లర్ సమీర్ వర్మ స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఫైనల్స్ చేరుకున్నాడు. రెండో సీడ్‌గా బరిలో దిగిన సమీర్ హోరాహోరీగా సాగిన సెమీస్ సమరంలో 2-1తో కాంటఫోన్ వాంగ్‌చరోన్ (థాయిలాండ్)పై గెలుపొందాడు. 75 నిమిషాల ఆటలో సమీర్ తొలి సెట్‌లో ఆధిపత్యం చలాయించినా తదుపరి గేముల్లో కాంటఫోన్ గట్టిపోటీనిచ్చాడు. 21-14తో అలవోకగా గేమ్ నెగ్గిన సమీర్ రెండో సెట్‌లో తడబడంతో 11-21తో ఓడి నిర్ణాయక సెట్ ఆడాల్సి వచ్చింది. ఆఖరు సెట్లోనూ 10-10తో ఉన్న వేళ సమీర్ పుంజుకున్నాడు. ప్రత్యర్థిని కట్టడి చేసి 21-12తో సెట్ గెల్చి ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకున్నాడు.



Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68